మెట్రో త్వరగా స్వాధీనం కావాలి 12

సంప్రదింపులు, బదిలీ ప్రక్రియను వేగంగా చేపట్టండి

మొదటి, రెండో దశల అనుసంధానంతోనే పనులు వేగంగా జరిగే అవకాశం: సీఎం రేవంత్

ఎన్వీఎస్ రెడ్డి, సర్ఫరాజ్ అహ్మద్‌తో భేటీ

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సుప్రీంకు రాష్ట్ర ప్రభుత్వం?

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే మీద అప్పీలు యోచన

న్యాయ నిపుణులతో మంతనాలు

స్టేకు నిరసనగా 14న తెలంగాణ బంద్

అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలి 13

మిలియన్ మార్చ్ తరహాలో బీసీ ఉద్యమానికి కార్యాచరణ: ఆర్.కృష్ణయ్య

శనివారం | 11-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 193 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: పంచమి సా.4.44 తదుపరి షష్ఠి; నక్షత్రం: రోహిణి మ.3.20 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ.8.03-9.30, రా.8.31-10.01; దుర్ముహూర్తం: ఉ.6.10-7.44; అమృతఘడియలు: మ.12.25-1.52, తె.5.26 మొదలు; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.10, సూర్యాస్తమయం: 5.52 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శబరిమల సంచలనం

ఆ 4.5 కిలోల బంగారం ఎక్కడ?

- తెచ్చినప్పుడు 42.8 కిలోలు.. తిరిగిచ్చింది 38.25 కిలోలు
- అయ్యప్ప ఆలయ బంగారు తొడుగులు దేశమంతా తిప్పారు
- మరమ్మతు పేరుతో రవాణాకు 39 రోజులు
- ఏపీ సహా పలు రాష్ట్రాల్లోని ఆలయాలు, ఇళ్లకు..
- కేరళ హైకోర్టుకు సిట్ నివేదికలో సంచలన విషయాలు
- విజయ్ మాల్యా 1998లో ఇచ్చిన విరాళం 30.8 కిలోలు
- వాటి లెక్కలు తేల్చేందుకు నడుం బిగించిన హైకోర్టు
- క్రిమినల్ కేసు పెట్టాలని కేరళ పోలీసులకు ఆదేశం



తిరువనంతపురం, అక్టోబరు 10: శబరిమల ఆలయ నిర్వహణ చేపడుతున్న ట్రావెంకోర్ దేవస్వం బోర్డు కార్యకలాపాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. కూతురి పెళ్లికి దేవాలయం దగ్గర బంగారం అడుక్కొనే వ్యక్తిని దాతగా చూపి, ఆయనకు కిలోల కొద్దీ బంగారం పూత ఉన్న భారీ విగ్రహాల తొడుగుల పునరుద్ధరణ బాధ్యత అప్పగించింది. పునరుద్ధరణకు ఆయన సొంతంగా వెచ్చించిన బంగారం 400 గ్రాములు కాగా.. దేవస్థానం 42.8 కిలోల బరువున్న బంగారం పూతతో కూడిన రాగి తొడుగులను ఆయనకు ఇచ్చింది. చివరకు మెరుగులు


మిగతా 2వ పేజీలో...



← ఆలయ ద్వార పాలకుల బంగారు తొడుగులు →

ఇక డిస్కమ్‌ల పోటీ!

- ఒకే ప్రాంతంలో బహుళ డిస్కమ్‌ల విద్యుత్ సరఫరా
- ప్రస్తుత నెట్‌వర్క్‌ను వాడుకుని వ్యాపారం చేసుకునే చాన్స్
- తయారీ రంగం, రైల్వే, మెట్రోలకు ఐదేళ్లలోగా క్రాస్ సబ్సిడీ భారం నుంచి మినహాయింపు 10
- డిస్కమ్‌లు ఏఆర్ఆర్ దాఖలు చేయకపోతే సుమోటోగా చార్జీలు నిర్ణయించే అధికారం ఈఆర్‌సీలకు
- ముసాయిదా ఎలక్ట్రిసిటీ సవరణ బిల్లు-2025 తెచ్చిన కేంద్రం



వెనెజువెలా ఉద్యమకారిణికి

నోబెల్ శాంతి

ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న మరియా కొరినాకు దక్కిన పురస్కారం

- 'బుల్లెట్లకు బదులు బ్యాలెట్లు' నినాదంతో వెనెజువెలాలో ఉద్యమం
- స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల కోసం 20 ఏళ్లుగా పోరాటం
- నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేసిన ధీశాలి
- ప్రాణాలకు ముప్పు ఉన్నా స్వదేశంలోనే అజ్ఞాతంలో ఉంటూ పోరాటం
- ట్రంప్‌తో సహా 338 మంది నామినేట్ అయినా వారందరిని కాదని కొరినాను ఎంపిక చేసిన నోబెల్ కమిటీ
- మా పోరాటానికి అండగా నిలిచిన అమెరికాకు కృతజ్ఞతలు
- డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ బహుమతి అంకితం: మరియా మచాడో



ఆస్లో, అక్టోబర్ 10: ప్రపంచమంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన నోబెల్ శాంతి బహుమతి ప్రకటన శుక్రవారం వెలువడింది. ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారానికి వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో ఎంపికయ్యారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజల తరపున పోరాడినందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు నార్వేజియన్ నోబెల్ కమిటీ తెలిపింది. చీకట్లు కమ్ముకున్న ప్రాంతంలో ప్రజాస్వామ్య జ్వాల వెలిగేలా చేస్తున్న సాహసిగా శాంతి కోసం ఆమె చేసిన విశేష కృషికి గాను ఈ పురస్కారం ఇస్తున్నట్లు పేర్కొంది. వెనెజువెలాను నియంతృత్వ దేశం నుంచి ప్రజాస్వామ్య దేశంగా మార్చేందుకు శాంతియుత పోరాటం చేశారని

మిగతా 2వ పేజీలో...

ట్రంప్ అ'శాంతి'!

8 యుద్ధాలు ఆపానన్నా.. 'నేనే అర్హుడిని' అన్నా.. దక్కని నోబెల్ బహుమతి

అసలైన శాంతి కంటే రాజకీయాలకే నోబెల్ కమిటీ ప్రాధాన్యమిచ్చింది: వైట్‌హౌజ్

యుద్ధాలను ఆపేందుకు ట్రంప్ కృషి కొనసాగుతుందని వెల్లడి 2

నియంతలు అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పుడు దానికి వ్యతిరేకంగా స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం పోరాడే వ్యక్తులను గుర్తించటం ఎంతో అవసరం.

- నోబెల్ కమిటీ చైర్మన్ జోర్గెన్ వానె ఫ్రిడ్నెస్

ధైర్యం.. విశ్వసనీయత

నోబెల్ బహుమతి విజేతలకు ఉండే లక్షణాలివి

ట్రంప్‌ను ఎందుకు ఎంపిక చేయలేదన్న ప్రశ్నకు నోబెల్ కమిటీ చైర్మన్ ఫ్రిడ్నెస్ జవాబు 2



ఆక్రమణకు గురైన స్థలం (వృత్తంలో)

చుట్టూ ఫెన్సింగ్..

బౌన్సర్లు.. వేటకుక్కలు..!

750 కోట్ల స్థలం కబ్జా

నకిలీ సేల్‌డీడ్ సృష్టించి బంజారాహిల్స్‌లో 5 ఎకరాల భూమి ఆక్రమణ

కోర్టులో కేసు నడుస్తుండగానే.. ఫెన్సింగ్, షెడ్ల నిర్మాణం

రంగంలోకి హైడ్రా.. ఆక్రమణలు తొలగించి భూమి స్వాధీనం

గాజులరామారం, మేడ్చల్, తట్టిఅన్నారంలోనూ ఆక్రమణలు నేలమట్టం

ఆ భూముల విలువ రూ.350 కోట్లు!



ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రా

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్/అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారుల చెర నుంచి వందల కోట్ల రూపాయల విలువైన భూములకు హైడ్రా అధికారులు విముక్తి కల్పించారు. ప్రభుత్వ భూములు, పార్కుల్లోని ఆక్రమణలపై కొరడా ఝుళిపించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో రూ.750 కోట్ల విలువైన 5 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గాజుల రామారం, మేడ్చల్, తట్టిఅన్నారంలలో మరో రూ.350 కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమణల చెర నుంచి విడిపించారు. మొత్తం రూ.1100 కోట్ల విలువైన భూములను కాపాడారు. షేక్‌పేట మండలం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని సర్వే నంబర్ 403లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని పార్థసారథి అనే వ్యక్తి కబ్జా చేశాడు. రూ.750 కోట్ల విలువైన ఈ భూమికి 403/52 సర్వే నంబర్ పేరిట నకిలీ అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ సృష్టించాడు. పలుమార్లు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు పెట్టారు. వాటిని తొలగించి మరీ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు బౌన్సర్లు, వేట కుక్కలను కాపలాగా ఉంచాడు. దీనికి సంబంధించి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో పార్థసారథిపై నాలుగు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కోర్టులో వివాదం ఉండగానే మొత్తం భూమిని అధీనంలోకి తీసుకొని షెడ్లు నిర్మించాడు. ఆ షెడ్లలో బౌన్సర్లు, ఇతరులు మద్యం సేవించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అలాగే జలమండలికి కేటాయించిన 1.20 ఎకరాల భూమిని కూడా వాడుకోకుండా అడ్డుపడుతున్నాడన్న ఫిర్యాదు కూడా హైడ్రాకు అందింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు.. రికార్డులను పరిశీలించి, 5 ఎకరాలను ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. భారీ బందోబస్తు నడుమ రూ.750 కోట్ల విలువైన భూమిని స్వాధీనం చేసుకున్నారు. కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమిగా

మిగతా 12వ పేజీలో...

గురుకులాల్లో అత్యవసర ఖర్చులకు రూ.60 కోట్లు!

సీఎం సహాయనిధి నుంచి కేటాయించిన ప్రభుత్వం

బడ్జెట్ కేటాయింపులకు ఈ నిధులు అదనం 13

డ్రగ్స్, హవాలా నెట్‌వర్క్‌ను ఛేదించిన 'ఈగల్'

దేశవ్యాప్తంగా సోదాలు

నెల రోజులుగా తప్పించుకు తిరుగుతున్న హవాలా ఆపరేటర్

ప్రజాపతి ముంబైలో అరెస్టు

3 కోట్ల నగదు స్వాధీనం

నైజీరియన్లకు అండగా హవాలా ఆపరేటర్లు 9

ఆ ఎమ్మెల్యే లాకర్లలో

40 కిలోల గోల్డ్!

ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో కర్ణాటక ఎమ్మెల్యే వీరేంద్రపై ఆరోపణలు

రెండు లాకర్లు తనిఖీ చేసిన ఈడీ

రూ.50.33 కోట్ల విలువైన బంగారు కడ్డీలు లభ్యం


ఇదివరకే 21 కిలోల గోల్డ్ సహా రూ.103 కోట్ల సొత్తు సీజ్

బెంగళూరు అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యే.. పేరు కేసీ వీరేంద్ర. కర్ణాటకలోని చిత్రదుర్గ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయనకు సంబంధించిన బ్యాంకు లాకర్లను తెరిచిచూసి ఈడీ అధికారులు నోరెళ్ల బెట్టారు. ఆ లాకర్ల నిండా బంగారం కడ్డీలే కనిపించాయి! తక్కెట్లో కుప్పగా పోస్తే ఆ గోల్డ్ 40 కిలోలు తూగింది! ఆ బంగారం విలువ రూ.50.33 కోట్లు అని ఈడీ అధికారులు లెక్కగట్టారు. వీరేంద్ర నేతృత్వంలో

మిగతా 10వ పేజీలో...

పెళ్లి మోజులో ఆదమరిస్తే..

జేబు గుల్లే!




వివాహ సంబంధాల వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్త

- ఈ సైట్లపైనా సైబర్ నేరగాళ్ల కన్ను
- నకిలీ ఫొటోలు, పేర్లు, చిరునామా ఇచ్చి బుట్టలో వేస్తున్న వైనం
- రూ.7.7 కోట్లు పోగొట్టుకున్న టెకీ
- వైద్యురాలి నుంచి రూ.10 లక్షలు కాజేసిన ఓ కేటుగాడు
- అప్రమత్తంగా ఉండండి.. వివరాలను నిర్ధారించుకోండి
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ సూచన

హైదరాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చక్కని చుక్కను భార్యగా పొందాలని ఏ అబ్బాయికి ఉండదు? అలాగే అమ్మాయిలు కూడా. జీవితంలో స్థిరపడి.. ఒడ్డూ పొడుగుతో ఆకర్షణీయంగా ఉన్న యువకుడిని వరుడిగా పొందాలని అనుకుంటారు. అయితే తమకు సరైన భాగస్వామిని వెతుక్కునేక్రమంలో వివాహ సంబంధాల వెబ్‌సైట్లను యువతీయువకులు గుడ్డిగా నమ్మడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొందరు కేటుగాళ్లు నకిలీ పేర్లు, ఫొటోలు, చిరునామాలను పొందుపర్చి.. సంబంధాల కోసం చూస్తున్న యువతీయువకుల జేబులు గుల్ల చేస్తున్నారు. ఈ వెబ్‌సైట్లపై సైబర్ నేరగాళ్లు కన్నేసి.. రూ.కోట్లలో దోచుకుంటున్నారు. ఇటీవల ఓ యువ వైద్యురాలు.. షాదీ డాట్‌కామ్ వెబ్‌సైట్లో ఓ యువ ఎమ్మెల్యే ఫొటోను చూసి ఆకర్షితురాలైంది. అదో ఫేక్ ప్రొఫైల్ అని ఆమెకు ఏమాత్రం అనుమానం రాలేదు. ఆ ప్రొఫైల్‌లో ఉన్న ఫోన్ నంబర్‌కు ఆమె ఫోన్ చేస్తే.. మనసును కట్టిపడేసేలా ఆవలి నుంచి కమ్మని మాటలు వినిపించాయి. ఇద్దరి మధ్య ఫోన్ సంభాషణలు, చాటింగ్‌లు పెరిగాయి. ఒకానొక రోజు.. అర్జెంటుగా డబ్బు అవసరం ఉందంటూ ఆ ఫేక్ ప్రొఫైల్ తాలూకు

మిగతా 3వ పేజీలో...



చేపల చెరువు, కాటేజీలు, (ఇన్‌సెట్) విండితుడు మెహ్రా

కిలోల్లో బంగారం.. టన్నుల్లో తేనె..

ఫాంహౌస్‌లో 39 కాటేజీలు

భారీ చేపల చెరువు, గోశాల, ఆలయం

పెద్ద సంఖ్యలో లగ్జరీ కార్లు

భోపాల్‌లో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఆస్తులు

2.64 కిలోల బంగారం, రూ.36 లక్షల నగదు స్వాధీనం 10

అంజన్ అలక.. బుజ్జగింపు!

జూబ్లీహిల్స్ టికెట్ దక్కకపోవడంతో ఆగ్రహం

కామారెడ్డి, మల్కాజిగిరిలో స్థానికేతరుడు పోటీ చేయలేదా?

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎక్కడైనా పోటీ చేయొచ్చు

ఒరిజినల్ కాంగ్రెస్ నేతలకు 200 శాతం అన్యాయం 13

మీడియా సమావేశంలో అంజన్‌కుమార్ యాదవ్ విమర్శలు

ఆయన ఆఫీసుకెళ్లి బుజ్జగించిన మీనాక్షి, పొన్నం, వివేక్



భారత సైన్యానికి 'మార్టిలెట్'లు!



బ్రిటన్‌కు చెందిన అధునాతన క్షిపణులు కొనుగోలు 2

యూకేతో రూ.4,151 కోట్ల ఒప్పందం

తేలికపాటి, బహుళ ప్రయోజన క్షిపణులివి

6 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం

ధ్వని వేగం కంటే ఒకటిన్నర రెట్లు వేగంగా దూసుకెళ్లే మార్టిలెట్ క్షిపణులు

వెనెజువెలా ఉద్యమకారిణికి నోబెల్ శాంతి



(మొదటి పేజీ తరువాయి)

కమిటీ ఛైర్మన్ వాట్నే ఫ్రైడ్నెస్ ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణి పెరుగుతున్న పరిస్థితుల్లో మరియా లాంటి ప్రజాస్వామ్య పరిరక్షకులు ఎంతో అవసరమని కమిటీ అభిప్రాయపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా ఈ ఏడాది మొత్తం 338 మంది ప్రముఖులు నామినేట్ అవ్వగా.. వారందరినీ కాదని ఈ గౌరవాన్ని మచాడో సొంతం చేసుకున్నారు. ఈ ప్రకటనతో నోబెల్ శాంతి బహుమతి తనకే దక్కాలని పదేపదే చెప్పుకుంటూ వచ్చిన ట్రంప్‌కు నిరాశ తప్పలేదు.

ఎవరీ మరియా కొరినా..

ఒకప్పుడు లాటిన్ అమెరికాలో అత్యంత సుసంపన్న దేశంగా ఉన్న వెనెజువెలా, గత కొన్ని సంవత్సరాలుగా నియంతృత్వ పాలన, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం, రాజకీయ అస్థిరత, మానవతా సంక్షోభం వంటి కారణాలతో కుదేలైంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో "బుల్లెట్లకు బదులు బ్యాలెట్లను ఎంచుకుందాం" అంటూ మచాడో ఒకసారి చెప్పిన మాటే ఆమె శాంతియుత ప్రజాస్వామ్య పోరాటానికి నినాదమైంది. 'సుమేట్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి రెండు దశాబ్దాలుగా దేశంలో స్వేచ్ఛ, నిష్పాక్షిక ఎన్నికల కోసం ఆమె పోరాటం కొనసాగించారు. అణచివేతలకు వెరవకుండా, సైనిక పాలనకు వ్యతిరేకంగా ప్రజా హక్కుల కోసం గళమెత్తారు. 2024లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో వెనెజువెలా సర్కారు ఆమెను పోటీ చేయనివ్వలేదు. దీంతో ప్రతిపక్ష అభ్యర్థి ఎడ్మండో గోంజాలెజ్‌కు మద్దతిచ్చి, వేలాది మంది వలంటీర్లను పర్యవేక్షకులుగా నియమించారు. బెదిరింపులు, అరెస్టులు, హింస వంటి కుట్రల మధ్య కూడా ప్రతిపక్షం విజయం సాధించినట్టు సాక్ష్యాలున్నా.. అధికార పక్షం ఫలితాన్ని అంగీకరించలేదు. దీంతో ప్రతిపక్షం భారీ నిరసనలు చేపట్టింది. దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో దాదాపు 20మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిణామాల తర్వాత మచాడోపై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. అప్పటి నుంచి ఆమె ప్రజా జీవితానికి దూరంగా ఉన్నారు. కానీ, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్యపరిచేందుకు పోరాటం చేస్తూనే ఉన్నారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా వెనిజువెలా ప్రజల కోసం దేశంలోనే ఉంటూ లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచారు.

కళంకిత నేతల బిల్లుపై విపక్షం లేకుండానే జేపీసీ!

న్యూఢిల్లీ, అక్టోబరు 10: తీవ్రమైన నేరారోపణలపై 30 రోజుల పాటు అరెస్టయిన ప్రధానమంత్రి, సీఎంలు, మంత్రులను పదవుల నుంచి తొలగించే మూడు బిల్లులను సమీక్షించడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో చేరడంపై ప్రతిపక్షాలు నోరు మెదపడం లేదు. ఈ నేపథ్యంలో అధికార ఎన్డీయే ఎంపీలతో పాటు, చిన్న పార్టీలు, స్వతంత్ర ఎంపీలతో కమిటీని ఏర్పాటు చేసేందుకు కేంద్రం యోచిస్తోంది. కమిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపక్ష పార్టీలకు అనేకసార్లు రిమైండర్లు పంపామని, అయితే జేపీసీకి సభ్యులను నామినేట్ చేస్తారా లేకుంటే బాయ్‌కాట్ చేస్తారా అనేదానిపై స్పీకర్ ఓం బిర్లాకు వారు ఇంకా సమాచారం ఇవ్వలేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రతిపక్షం లేకుండా జేపీసీ ఏర్పాటైతే అది దేశ చరిత్రలోనే అసాధారణమైన ఘటనగా మిగిలిపోతుందని లోక్‌సభ మాజీ సెక్రటరీజనరల్ పీడీటీ ఆచార్య పేర్కొన్నారు.

అమెరికా ఆయుధ తయారీ ఫ్యాక్టరీలో పేలుడు

- కనీసం 19 మంది గల్లంతు .. పెద్ద సంఖ్యలో మృతులు!

టెన్నిస్సీ, అక్టోబరు 10: అమెరికా టెన్నిస్సీలోని ఆయుధ తయారీ కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 19 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. అక్యురేట్ ఎనర్జిటిక్ సిస్టమ్స్ ఫ్యాక్టరీలో సంభవించిన ఈ పేలుడు ధాటికి భవనం పూర్తిగా నేలమట్టమైంది. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీలోని పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. మంటలు చెలరేగడంతో పాటు పెద్ద ఎత్తున పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు 17 కిలోమీటర్ల వరకు వినిపించాయని స్థానికులు తెలిపారు.

అఫ్గాన్‌పై పాకిస్థాన్ దాడులు!

ఇస్లామాబాద్/పాకిస్థాన్/న్యూఢిల్లీ, అక్టోబరు 10: అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు తెగబడింది. తెహ్రీక్-ఇ-తాలిబన్-పాకిస్థాన్ (టీటీపీ) స్థావరాలే లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి కాబుల్, పక్తికా ప్రావిన్స్‌లో దాడులు చేసింది. తాలిబన్ విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ భారత్‌లో పర్యటిస్తుండగానే ఈ దాడులు చోటుచేసుకున్నాయి. అఫ్గానిస్థాన్-భారత్‌కు దగ్గరవ్వడం జీర్ణించుకోలేకనే పాక్ దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. తమ సైనిక కాన్వాయ్‌పై దాడికి పాల్పడిన 30 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని పాక్ ప్రకటించింది.

పీఏసీ రైల్వేల ఉప కమిటీ కన్వీనర్‌గా కె.లక్ష్మణ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ విభాగాలపై అధ్యయనం చేసేందుకు 6 ఉపకమిటీలను లోక్‌సభ సచివాలయం ఏర్పాటు చేసింది. ఇందులో ఆర్థిక, రక్షణ, రైల్వేకు చెందినవి ఉన్నాయి. రైల్వేల ఉప కమిటీకి బీజేపీ రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఆర్థిక వ్యవహారాల ఉప కమిటీకి టీఎంసీ ఎంపీ సుఖేందు శేఖర్ కన్వీనర్‌గా ఉండగా ఈ ప్యానెల్‌లో తెలుగు ఎంపీలు సీఎం రమేశ్, శ్రీనివాసులురెడ్డి, బాలశౌరి సభ్యులుగా ఉన్నారు. రక్షణ వ్యవహారాల ఉప కమిటీకి ఒడిశా ఎంపీ అపరాజిత సారంగి కన్వీనర్‌గా, సీఎం రమేశ్ సహ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఇందులో బాలశౌరి, మాగుంట శ్రీనివాసులురెడ్డి సభ్యులుగా ఉన్నారు. సివిల్-టూ ఉపకమిటీలో కె.లక్ష్మణ్ సభ్యులుగా ఉన్నారు.



ట్రంప్ అశాంతి!

నోబెల్‌పై పెట్టుకున్న ఆశలన్నీ ఆవిరి.. 8 యుద్ధాలు ఆపానన్నా దక్కని బహుమతి

- అసలైన శాంతి కంటే రాజకీయాలకే నోబెల్ కమిటీ ప్రాధాన్యం అని వైట్‌హౌజ్ విమర్శ

వాషింగ్టన్, అక్టోబరు 10: రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత 'ప్రపంచ శాంతి దూత'గా అవతారమెత్తిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు 'శాంతి' లేకుండా పోయింది. ఎనిమిది యుద్ధాలు ఆపానని చెప్పినా.. వెంటనే ఒప్పందానికి రాకపోతే నరకం చూపిస్తానంటూ బెదిరించి ఇజ్రాయెల్, హమాస్ మధ్య హడావుడిగా సంధి కుదిర్చినా కూడా ఆయనను నోబెల్ శాంతి బహుమతి వరించలేదు. దానిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ట్రంప్.. దీనితో తీవ్రంగా అసంతృప్తికి లోనయ్యారు. దీనిపై ట్రంప్ నేరుగా ప్రకటన చేయకపోయినా.. అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌజ్ ప్రతినిధి స్టీవెన్ చుయెంగ్ మీడియాతో మాట్లాడారు. "నోబెల్ కమిటీ మరోసారి శాంతి కంటే రాజకీయాలకే ప్రాధాన్యత ఇచ్చింది. అయినా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధాలను ఆపుతూనే ఉంటారు. శాంతి ఒప్పందాలు కుదుర్చుతూనే ఉంటారు. ప్రజల ప్రాణాలను కాపాడుతారు. ఆయనొక గొప్ప మానవతా వాది. తన సంకల్ప బలంతో పర్వతాలనైనా కదిలించగలిగే ట్రంప్ వంటి వ్యక్తి మరొకరు ఉండరు.." అని పేర్కొన్నారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని, ఆయనకు తాము మద్దతు పలుకుతున్నామని బహుమతి ప్రకటనకు ముందు రష్యా పేర్కొనడం గమనార్హం. ఈ మేరకు పుతిన్ సన్నిహితుడు యూరి ఉషకోవ్ ప్రకటన చేశారు.

నేను అర్హుడిని.. నేనే అర్హుడిని!

ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి పనిచేసిన సమయంలోనే తనకు నోబెల్ శాంతి బహుమతిపై ఆశలు ఉన్నట్టు బయటపెట్టారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక అయితే బహిరంగంగానే ప్రకటనలు చేశారు. వివిధ దేశాల మధ్య యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి తానే అర్హుడినని కూడా పలుమార్లు పేర్కొన్నారు. భారత్-పాకిస్థాన్, కాంబోడియా-థాయ్‌లాండ్, కాంగో-రువాండా, ఇజ్రాయెల్-ఇరాన్, సెర్బియా-కొసావో, ఈజిప్ట్-ఇథియోపియా, ఆర్మేనియా-అజర్‌బైజాన్‌ల మధ్య యుద్ధాలను ఆపానని చెప్పుకొచ్చారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధ విరమణ కోసం ప్రయత్నాలు చేశారు. తాజాగా హడావుడిగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య శాంతి ఒప్పందాన్నీ కుదిర్చారు. మొత్తంగా ఈసారి తనకు నోబెల్ వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. బహుమతి ప్రకటనకు ఒక రోజు ముందు శ్వేతసౌధం 'శాంతి అధ్యక్షుడు (ది పీస్ ప్రెసిడెంట్)' అంటూ ట్రంప్ ఫొటోతో ఎక్స్‌లో పోస్టు కూడా పెట్టడం గమనార్హం. పాకిస్థాన్ ప్రభుత్వం నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ పేరును అధికారికంగా నామినేట్ చేసింది. ఇజ్రాయెల్, కాంబోడియా ప్రధానులు నెతన్యాహు, హున్ మానెట్ కూడా ప్రతిపాదించారు.

వింత ప్రకటనలతో పరువు పోతున్నా..

ఇంతగా ఆశపెట్టుకున్నా తనకు నోబెల్ శాంతి బహుమతి రాదని ట్రంప్ మథనపడ్డారు కూడా. తాను ఎన్ని యుద్ధాలు ఆపినా, శాంతికోసం ఎంత కృషి చేసినా తనకు నోబెల్ ఇవ్వకపోవచ్చని కూడా ఒకట్రెండు సార్లు వ్యాఖ్యలు చేశారు. భారత్ నిర్ద్వంద్వంగా ఖండించినా కూడా.. భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ఎన్నోసార్లు ప్రకటనలు చేశారు. ఇప్పటివరకు నలుగురు అమెరికా అధ్యక్షులు రూజ్‌వెల్ట్ (1906లో), వుడ్రో విల్సన్ (1919), జిమ్మీకార్టర్ (2002), బరాక్ ఒబామా (2009లో) నోబెల్ శాంతి బహుమతి పొందారు. అయితే వారందరికన్నా ప్రపంచ శాంతి కోసం తాను చేపట్టిన చర్యలు గొప్పవని ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఒబామా అసలేమీ చేయకపోయినా కూడా నోబెల్ ఇచ్చారని వ్యాఖ్యానించారు.

నోబెల్ బహుమతి ట్రంప్‌కు అంకితం: మరియా మచాడో

ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి పొందిన మరియా మచాడో.. ఈ బహుమతిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. "వెనెజువెలాలో స్వేచ్ఛ కోసం చేస్తున్న మా పోరాటానికి నోబెల్ బహుమతి గొప్ప గుర్తింపు. గొప్ప విజయానికి మేం దగ్గరయ్యాం. వెనెజువెలా స్వేచ్ఛను పొందుతుంది. ప్రజాస్వామ్యం కోసం పోరాటంలో మాకు మద్దతుగా నిలిచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, అమెరికా ప్రజలు, లాటిన్ అమెరికా ప్రజలు, ప్రజాస్వామ్య దేశాలకు కృతజ్ఞతలు. వెనెజువెలాలో బాధిత ప్రజలకు, మాకు అండగా నిలిచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు నోబెల్‌ను అంకితం ఇస్తున్నా.." అని ఎక్స్‌లో పోస్టు చేశారు. తాను ఓ పెద్ద ఉద్యమంలో భాగస్వామిని మాత్రమేనని.. ఈ బహుమతి వెనెజువెలాలో తమ పోరాటానికి గౌరవమని వ్యాఖ్యానించారు.

ధైర్యం.. విశ్వసనీయత

- నోబెల్ శాంతి బహుమతి విజేతలకు ఉండే లక్షణాలివి
- ట్రంప్‌ను ఎందుకు ఎంపిక చేయలేదన్న ప్రశ్నకు నోబెల్ కమిటీ చైర్మన్ ఫ్రిడ్నెస్ సమాధానం



ఆస్లో, అక్టోబరు 10: ధైర్యం, విశ్వసనీయత కలిగిన వ్యక్తులు మాత్రమే నోబెల్ శాంతి బహుమతికి ఎంపిక అవుతారని నోబెల్ కమిటీ చైర్మన్ జోర్గెన్ వానె ఫ్రిడ్నెస్ స్పష్టం చేశారు. ట్రంప్‌ను ఈ బహుమతికి ఎందుకు ఎంపిక చేయలేదన్న విలేకరుల ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. నోబెల్ శాంతి బహుమతి రేసులో ట్రంప్ పేరును అసలు పరిగణించలేదన్న విధంగా ఆయన సంకేతాలిచ్చారు. ట్రంప్‌కు నోబెల్ దక్కనుందంటూ పెద్ద ఎత్తున జరిగిన ప్రచారాన్ని విలేకరులు ప్రస్తావించగా.. 'నోబెల్ కమిటీ అన్ని రకాల ప్రచారాన్ని, మీడియాలో వచ్చిన వార్తలను చూసింది. శాంతి కోసం తాము కృషి చేశామని పేర్కొంటూ ఏటా వేలకు వేల ఉత్తరాలు మాకు అందుతుంటాయి. నోబెల్ విజేతల ఫొటోలున్న గదిలో ఈ కమిటీ సమావేశమవుతుంది. ఆ గది నిండా ధైర్యం, విశ్వసనీయత నిండి ఉంటాయి. శాంతి కోసం జరిగిన కృషి, ఆల్ఫ్రెడ్ నోబెల్ (నోబెల్ బహుమతి వ్యవస్థాపకుడు) వీలునామా ఆధారంగా మాత్రమే మా నిర్ణయం ఉంటుంది' అని ఫ్రిడ్నెస్ స్పష్టం చేశారు. నోబెల్ శాంతి బహుమతి విజేత మరియా కొరినా మచాడో గురించి మాట్లాడుతూ.. అవధుల్లేకుండా విస్తరిస్తున్న అంధకారంలో ప్రజాస్వామ్య జ్వాలను మండించటానికి తనను తాను అంకితం చేసుకున్న మహిళగా అభివర్ణించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా, చీలికలు పేలికలుగా ఉన్న ప్రతిపక్ష శిబిరాన్ని సమైక్యపరచటంలో ఆమె గొప్ప పాత్ర పోషించారని ప్రశంసలు కురిపించారు. 'గత ఏడాదిగా ఆమె అజ్ఞాతంలో ఉన్నారు. తన ప్రాణాలకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని తెలిసి కూడా వెనెజువెలాలోనే ఉంటున్నారు. ఆమె పోరాటం కోట్లాదిమందిలో స్ఫూర్తి నింపుతోంది. నియంతలు అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పుడు దానికి వ్యతిరేకంగా స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం పోరాడే వ్యక్తులను గుర్తించటం ఎంతో అవసరం' అని చెప్పారు.

లోకం తీరు



హెచ్1బీ వీసా మరింత కఠినం!

వాషింగ్టన్, అక్టోబరు 10: ఇప్పటికే హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచిన ట్రంప్ ప్రభుత్వం.. ఆ వీసా కార్యక్రమాల్లో మరింత కఠిన సంస్కరణలు తీసుకురానుంది. వీసా పరిమితి మినహాయింపుల అర్హత నిబంధనలు కఠినతరం చేయడంతో పాటు, ఉద్యోగాలు కల్పించే కంపెనీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, థర్డ్ పార్టీ ప్లేస్‌మెంట్స్‌పై మరింత దృష్టి పెట్టాలని నిర్ణయించింది. హెచ్1బీ వీసా కార్యక్రమాల్లో మార్పులు చేయడానికి యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు చేసింది. ఇవి ఫెడరల్ రిజిస్టర్‌లో 'రిఫార్మింగ్ ది హెచ్1బీ నాన్‌ఇమ్మిగ్రెంట్ వీసా క్లాసిఫికేషన్ ప్రోగ్రామ్' పేరుతో నమోదయ్యాయి. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే విదేశీ నిపుణులపై ఆధారపడ్డ కంపెనీలు తీవ్ర ఇబ్బందులు పడతాయి. ముఖ్యంగా స్టార్టప్ కంపెనీలు అయితే వీసా ఖర్చులు భరించలేవు.

50 సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు

- జాబితాలో ముగ్గురు భారతీయులు

వాషింగ్టన్, అక్టోబరు 10: ఇరాన్ చమురు ఉత్పత్తులు, ఎల్‌పీజీ ఎగుమతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారనే అభియోగాలపై 50కి పైగా సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ జాబితాలో వరుణ్ పులా, సోనియా శ్రేష్ఠ, అయ్యప్పన్ రాజా అనే ముగ్గురు భారతీయులు కూడా ఉన్నారు. ఈ ఆంక్షల వల్ల ఆయా వ్యక్తులు, సంస్థలకు అమెరికాలో ఉన్న ఆస్తులు, సంబంధిత బ్యాంకు ఖాతాలు స్తంభించిపోతాయి. వరుణ్ పులా.. బెర్తా షిప్పింగ్ కంపెనీకి యజమాని. సోనియా శ్రేష్ఠకు చెందిన వెగాస్టార్ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థ ఇరాన్ ఎల్‌పీజీని పాకిస్థాన్‌కు రవాణా చేస్తోంది. అయ్యప్పన్ రాజాకు చెందిన ఈవీ లైన్స్ సంస్థ ఇరానియన్ ఎల్‌పీజీని చైనాకు రవాణా చేసింది.

ఆ 4.5 కిలోల బంగారం ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

దిద్దించి, అప్పగించిన రాగి-బంగారు తొడుగుల బరువు కేవలం 38.25 కిలోలు. అంటే నాలున్నర కిలోలు తేడా వచ్చింది. తగ్గిందంతా బంగారమేనని అనుమానిస్తున్నారు. శబరిమల ఆలయంలో ద్వారపాలక విగ్రహాల పాదపీఠానికి, తొడుగులకు వేసిన బంగారు తాపడం మెరుగు తగ్గడంతో దానికి తన సొంత ఖర్చుతో కొత్తగా తాపడం వేయించేందుకు బెంగళూరుకు చెందిన ఉన్నికృష్ణన్ పొట్టి ముందుకొచ్చాడు. ఆయన గతంలో దేవస్థానంలో ఉద్యోగం చేసినవాడే కావడం గమనార్హం. మొదట 2019 జూలైలో పాదపీఠాలు, తొడుగులను మెరుగుదిద్దే బాధ్యతను ఆయనకు అప్పగించారు. జూలై 19న పొట్టి సమక్షంలోనే వాటిని తొలగించారు. తూకం వేయగా 42.8 కిలోలని తేలింది. మర్నాడు శబరిమల నుంచి పాదపీఠాలు, విగ్రహ తొడుగులతో కూడిన కంటైనర్ బయల్దేరింది. చెన్నైలో బంగారుతాపడం చేసే సంస్థ స్మార్ట్ క్రియేషన్ వర్క్‌షాప్‌కు చేరగానే అక్కడి ఉద్యోగులు తూకం వేయగా.. 38.25కిలోలు ఉన్నట్లు తేలింది. కంటైనర్‌లో ఎక్కించినపుడు 42.8 కిలోలున్న బంగారం తాపడం ఉన్న రాగి తొడుగులు కిందికి దింపగానే నాలుగున్నర కిలోలు ఎలా తగ్గాయన్నదే ప్రశ్న. దీనికితోడు కంటైనర్ శబరిమల నుంచి చెన్నైలోని వర్క్‌షాప్‌కు చేరడానికి 39 రోజులు పట్టింది! జూలై 20న బయల్దేరితే ఆగస్టు 29కి చేరింది. ఆ 39 రోజుల్లో ఏం జరిగిందనే దానిమీద తాము పరిశోధించామని, సంచలనాత్మక విషయాలు తెలిశాయని ఎన్డీటీవీ ప్రకటించింది. కంటైనర్ కొట్టాయంలోని ఒక ప్రైవేటు దేవాలయం, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ఆలయాలు, బెంగళూరులోని శ్రీరాంపురంలో అయ్యప్ప ఆలయానికి వెళ్లినట్లు తెలిపింది. చెన్నైలో ఉంటున్న ప్రముఖ మలయాళ నటుడు జయరాం ఇంట్లో జరిగిన ప్రైవేటు పూజకు కూడా వీటిని తీసుకెళ్లినట్లు ఆరోపిస్తోంది. ఇందుకు సంబంధించి ఒక ఫేస్‌బుక్ పోస్టును ఆధారంగా చూపిస్తోంది. 2019 ఆగస్టు 29న చెన్నై వర్క్‌షాప్‌కు వచ్చిన విగ్రహాల తొడుగులకు మెరుగులు దిద్ది, సెప్టెంబరు 11న తిరిగి దేవస్థానానికి పంపారు. వర్క్‌షాప్‌కి వచ్చినప్పుడు వాటి బరువు 38.25 కిలోలు ఉంటే ఉన్నికృష్ణన్ పొట్టి తన సొంత బంగారం 394 గ్రాములు కలిపి మెరుగులు దిద్దించాడు. సొంత బంగారం కలిపినప్పటికీ వర్క్‌షాప్‌కు ఎంత బరువుతో వచ్చిందో అంతే బరువుతో తిరిగి పంపించడం గమనార్హం. మరోవైపు తగ్గిన నాలుగున్నర కిలోల బరువు గురించి అడిగిన వారూ లేరు, చెప్పిన వారూ లేరు. అదనంగా చేర్చిన 394 గ్రాములు ఏమయ్యాయని అడిగిన వారు కూడా లేరు. చివరకు 2019 డిసెంబరులో పొట్టి తన దగ్గర కొంత దేవస్థానం బంగారం మిగిలిందని, అనుమతిస్తే కుమార్తె పెళ్లికి వాడుకుంటానని స్వయంగా దేవస్థానానికి ఈ-మెయిల్ పెట్టారు. దీంతో దేవస్థానం బంగారం దాత చేతిలో ఉందన్న విషయం మీడియా దృష్టికి వచ్చింది. వరస కథనాలు రావడంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 2020లో హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశారు. 2021లో దీనిపై దర్యాప్తునకు హైకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ దర్యాప్తులో ద్వారపాలకుల విగ్రహాల తొడుగుల విషయంలో నాలుగున్నర కిలోల బంగారం తేడా ఉందన్న విషయం బయటకు వచ్చింది. నిజానికి 2018లో కూడా ఇతనికి ప్రధాన ద్వారం బంగారం తాపడం మెరుగులు పెట్టే బాధ్యతను అప్పగించారు. ఆయన ఏకంగా ప్రధాన ద్వారాన్ని చెన్నైకి తీసుకెళ్లి బంగారు తాపడం పెట్టించుకువచ్చారు. ఆ సమయంలో దేవస్థానమే ఆయనకు 474.9 గ్రాముల బంగారాన్ని ఇచ్చింది. కొత్తగా తాపడం చేసిన ఆలయ ద్వారాలను ఉన్నికృష్ణన్ పొట్టి 2019 మార్చిలో కేరళకు తీసుకొచ్చి, ఒక పెద్ద కార్యక్రమంలో ఆలయ పెద్దలకు అప్పగించాడు.

దేవస్థానం తప్పు చేయలేదు: విజయన్

ట్రావెంకోర్ దేవస్వం బోర్డు ఎలాంటి తప్పూ చేయలేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. బంగారం దుర్వినియోగం వెనక ఎవరున్నా చట్టం చేతికి చిక్కుతారని వ్యాఖ్యానించారు. గత నెల 22న పంబ తీరంలో తాము నిర్వహించిన శబరిమల కాంక్లేవ్‌ను దెబ్బతీయడానికే కొన్ని శక్తులు కుట్ర చేశాయని అన్నారు. ఆ కార్యక్రమానికి రెండు రోజుల ముందు దాత ఉన్నికృష్ణన్ పొట్టి బంధువు ఇంట్లో మిగిలిన బంగారం పట్టుకోవడం, విలేకరుల సమావేశం పెట్టడం.. ఇవన్నీ కాంక్లేవ్‌ను దెబ్బతీసే ప్రయత్నాలేనని చెప్పారు.

మాల్యా ఇచ్చింది 30 కిలోలు

1998లో వ్యాపారవేత్త విజయ్ మాల్యా 30 కిలోల బంగారాన్ని శబరిమల ఆలయానికి విరాళంగా ఇచ్చారు. మరో 800 గ్రాములు తలుపుల తాపడం కోసం ఇచ్చారు. ఉన్నికృష్ణన్ వ్యవహారాలపై విచారిస్తున్నప్పుడు మాల్యా ఇచ్చిన బంగారంలో ఎంత ఆలయానికి వెచ్చించారు? ఎంత మిగిలింది? అనేది లెక్కలు లేవని కేరళ హైకోర్టు గుర్తించింది. ఆ లెక్కలన్నీ తీయాలని సిట్‌ను ఆదేశించింది. సిట్ రిపోర్టులో మిగిలిన బంగారం వాడుకుంటానని ఉన్నికృష్ణన్ పొట్టి రాసిన లేఖ ప్రస్తావనకు వచ్చినప్పుడు హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తాము నిబంధనల ప్రకారమే చేశామని ట్రావెంకోర్ బోర్డు స్పష్టం చేసింది. హైకోర్టు అంతటితో వదల్లేదు. ఇప్పుడు ఆలయంలో ద్వారపాలకుల విగ్రహాలకు అమర్చిన పాదపీఠం, తొడుగులు అసలువా, నకిలీవా? అనేది తేల్చాలని ఆదేశించింది.



క్రిమినల్ కేసు నమోదుకు హైకోర్టు ఆదేశం

కేరళ హైకోర్టు దేవస్థానం బంగారం దుర్వినియోగంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. ద్వారపాలకుల విగ్రహాల తొడుగులేకాకుండాప్రధాన ద్వారం తాపడాల బంగారం విషయంలోనూ అవకతవకలు జరిగాయని హైకోర్టు నిర్ధారించింది. దీనిపైనే క్రిమినల్ కేసు పెట్టమని ఆదేశించింది. తాపడం చేయడానికి ఉన్నికృష్ణన్ పొట్టికి 474.9 గ్రాముల బంగారాన్ని దేవస్థానం ఇచ్చిందని, దాతగా ఆయన ఎంత తిరిగిచ్చారో చెప్పలేదని ప్రస్తావించింది.

పాక్‌కు కొత్త ఆయుధాలేవీ ఇవ్వడం లేదు

క్షిపణుల విక్రయం వార్తలను ఖండించిన అమెరికా

న్యూఢిల్లీ, అక్టోబరు 10: దాయాది దేశం పాకిస్థాన్‌కు అత్యాధునిక క్షిపణులు అందించేందుకు అమెరికా ఒప్పందం చేసుకుందంటూ వస్తున్న వార్తలను అగ్రరాజ్యం తోసిపుచ్చింది. ఇటీవల సవరించిన ఒప్పందం ప్రకారం పాక్‌కు అడ్వాన్స్‌డ్ మీడియం రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ (ఏఎమ్‌ఆర్‌ఏఏఎంఎస్) అందించనుందనే ప్రచారాన్ని ఖండించింది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తాజా ఒప్పందం ప్రకారం పాకిస్థాన్ సహా అనేక దేశాలకు ఇప్పటికే ఉన్న ఆయుధాల నిర్వహణ, విడి భాగాలు అందిస్తామని మాత్రమే పేర్కొన్నట్టు తెలిపింది. పాక్‌కు కొత్తగా ఎలాంటి ఆయుధాలూ సరఫరా చేయబోమని స్పష్టం చేసింది. అమెరికా రక్షణ శాఖ సెప్టెంబరు 30న సవరించిన ఒప్పందాన్ని వెల్లడించింది. దీనిపై పాక్‌కు చెందిన డాన్ సహా అనేక పత్రికలు అమెరికా తమ దేశానికి కొత్త క్షిపణులు విక్రయించనున్నట్టు పేర్కొన్నాయి.

భారత సైన్యానికి 'మార్ట్‌లెట్'లు!

- బ్రిటన్‌కు చెందిన అధునాతన క్షిపణుల కొనుగోలు
- యూకేతో రూ.4151 కోట్ల డీల్



న్యూఢిల్లీ, అక్టోబరు 10: భారత సైన్యానికి బ్రిటన్‌కు చెందిన అధునాతన క్షిపణులు సమకూరనున్నాయి. ఈ మేరకు ఇరుదేశాల మధ్య రూ.4151 కోట్ల విలువైన కీలక రక్షణ ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా మార్ట్‌లెట్‌లుగా పిలిచే 'వివిధ రకాల లక్ష్యాలను ఛేదించగల తేలికపాటి క్షిపణుల (ఎల్ఎంఎం)'లను భారత్ కొనుగోలు చేయనుంది. ఈ మార్ట్‌లెట్ క్షిపణులను ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్‌కు చెందిన 'థేల్స్ ఎయిర్ డిఫెన్స్' సంస్థ అభివృద్ధి చేస్తోంది. పురాణాల్లో ఉండే 'మార్ట్‌లెట్' అనే పక్షి పేరును ఈ క్షిపణులకు పెట్టారు. అలుపెరగని పక్షి అని దీని అర్థం. ఇవి తేలికపాటి, బహుళ ప్రయోజనకర క్షిపణులు. వీటిని గగనతలం నుంచి గగనతలం, గగనతలం నుంచి భూతలం, భూతలం నుంచి భూతలం, భూతలం నుంచి గగనతలం దాడులకు ఉపయోగించుకోవచ్చు. గగనతల రక్షణ వ్యవస్థలతో పాటు డ్రోన్లు, సాయుధ వాహనాలు వంటి మిలటరీ లక్ష్యాలను కూడా ఛేదించేలా వీటిని రూపొందించారు. లేజర్ బీమ్ గైడెన్స్‌తో పనిచేసే ఈ క్షిపణులను సైనికులు భుజంపై ఉంచుకొని ప్రయోగించే వీలు కూడా ఉంటుంది. సాయుధ వాహనాలకు అనుసంధానం చేసి, హెలికాప్టర్లు, నౌకల నుంచి కూడా ప్రయోగించవచ్చు. ఇవి ఆరు కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలవు. 13 కిలోల బరువుండే ఈ మార్ట్‌లెట్ క్షిపణులు ధ్వని వేగం కంటే ఒకటిన్నర రెట్లు వేగంగా దూసుకెళ్లగలవు. వీటిని 2019 నుంచి బ్రిటన్ సైన్యంలో వాడుతున్నారు. ఇవే క్షిపణులను యూకే ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తోంది. ప్రస్తుతం రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ వీటిని వినియోగిస్తోంది. కాగా, భారత్-యూకే మధ్య విస్తృత ఆయుధాల ఒప్పందం కుదిరేందుకు తాజా క్షిపణి ఒప్పందం దారి చూపినట్లయిందని బ్రిటన్ ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే యూకేలో ఇంజనీరింగ్, టెక్నాలజీ, క్రియేటివ్ పరిశ్రమ తదితర రంగాల్లో 64 భారత కంపెనీలు రూ.15,430 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయని.. వీటి ద్వారా దాదాపు 7 వేల ఉద్యోగాలు లభిస్తాయని వివరించింది.

త్వరలోనే వాయుసేనకు 'తేజస్'

భారత గగనతల రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. గంటకు 2,200 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో.. బ్రహ్మోస్ క్షిపణులను సైతం మోసుకెళ్లే సామర్థ్యం కలిగిన తేలికపాటి స్వదేశీ యుద్ధ విమానం తేజస్ ఎంకే-1ఏ ఈ నెలాఖరులోనే భారత వాయుసేన (ఐఏఎఫ్)లో చేరనుంది. ఈ నెల చివరి వారంలో మొదటి తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్‌ను హాల్ డెలివరీ చేయనుంది. 1.8 మాక్ స్పీడ్‌తో దూసుకెళ్లే ఈ ఫైటర్ జెట్ కొత్త తరం క్రూయిజ్ క్షిపణులను కూడా మోసుకెళ్లగలదు. వాస్తవానికి గతేడాది ఫిబ్రవరిలోనే తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాలు ఐఏఎఫ్‌కు చేరాల్సి ఉంది. కానీ.. అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ) సంస్థ నుంచి ఇంజిన్ల సరఫరా జాప్యం కావడంతో హాల్ వీటిని సకాలంలో తయారుచేయలేక పోయింది. తేజస్ ఎంకే-1ఏకి కీలకమైన ఎఫ్404-ఐఎన్20 ఇంజన్లు నెలకు ఒకటి లేదా రెండు యూనిట్ల చొప్పున మాత్రమే వస్తున్నాయి. ఈ క్రమంలో ఐఏఎఫ్ ఆర్డర్ చేసిన మొత్తం 83 యుద్ధ విమానాలను వచ్చే నాలుగేళ్లలో డెలివరీ చేసేందుకు హాల్ ప్రయత్నిస్తోంది. ఇవిగాక, మరో 97 తేజస్ ఎంకే-1ఏ ఫైటర్ జెట్ల కోసం చర్చలు కీలక దశలో ఉన్నాయి.

65 లక్షల మంది మహిళలకు 'ఇందిరమ్మ' చీరలు!

- నవంబరు 19న రాష్ట్రవ్యాప్తంగా పంపిణీకి ఏర్పాట్లు: మంత్రి తుమ్మల


మహిళలకు పంపిణీ చేయబోయే చీరెలతో తుమ్మల, శైలజ రామయ్యర్

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 65 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు వచ్చే నెలలో ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. నవంబరు 19 ఇందిరాగాంధీ జయంతి రోజున ఈ చీరల పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సచివాలయంలో మంత్రి తుమ్మల, జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నాణ్యతపై వచ్చిన విమర్శలను దృష్టిలో ఉంచుకుని, చేనేత కార్మికులతో ప్రత్యేకంగా చీరలను ఉత్పత్తి చేయించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ఇప్పటికే 33.50 లక్షల చీరలు జిల్లా స్థాయిలో గోదాములకు చేరాయని, మిగిలిన చీరెలను నవంబరు 15లోపు క్షేత్రస్థాయికి చేర్చాలని అధికారులకు సూచించారు.

నేతన్నకు భరోసా..

చేనేత కార్మికుల రుణమాఫీ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ పథకంతో 6,780 మంది చేనేత కార్మికులు లక్ష రూపాయల వరకు రుణ విముక్తులవుతారని తుమ్మల వెల్లడించారు. నేతన్న భరోసా పథకంలో చేనేత కార్మికులకు ప్రోత్సాహం ఇవ్వటానికి ఈ ఏడాది రూ. 48.80 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకంలో నేతన్నలకు రూ. 18 వేలు, అనుబంధ కార్మికులకు రూ. 6 వేల చొప్పున ఏడాదికి రెండు విడతల్లో ప్రోత్సాహకం అందిస్తామని తుమ్మల వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ శాఖలు.. వస్త్రాలు కొనుగోళ్లకు సంబంధించి ఆర్డర్లు టెస్కో నుంచే తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్ ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని యాదాద్రి భువనగిరిలోని పోచంపల్లికి మార్చాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. డిజిటల్ వ్యవసాయంతో రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఒరవడి వస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జర్మనీకి చెందిన 'ఏసీఆర్ఏటీ' ప్రతినిధులు సచివాలయంలో తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా ఏఐ, లాట్ ఆధారిత డిజిటల్ వ్యవసాయంతో ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి, నేల ఆరోగ్యం కాపాడాలని మంత్రి అన్నారు.

తల్లిపై చేయిచేసుకున్న వీడియో వైరల్ అవ్వడంతో..

- పరువు పోయిందని బీజేవైఎం మేడ్చల్ జిల్లా కన్వీనర్ మనస్తాపం
- చెరువులో దూకి బలవన్మరణం


రేవెల్లి రాజు (ఫైల్)

బీబీనగర్, ఉప్పల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి తల్లితో గొడవ పడి.. ఆమెపై చేయిచేసుకుంటే.. ఆ ఘటన తాలూకు వీడియో బయటకు పొక్కడాన్ని ఆ బీజేవైఎం నేత తీవ్ర అవమానంగా భావించారు. ఆ వీడియో వాట్సా్ప్‌లో వైరల్ అవుతుండటంతో తన పరువు పోయిందని తీవ్ర మనస్తాపానికి గురై చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని పెద్ద చెరువు వద్ద జరిగింది. మృతుడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ విజయపురి కాలనీకి చెందిన రేవెల్లి రాజు (40). ఆయన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేవైఎం కన్వీనర్‌గా ఉన్నారు. సీఐ ప్రభాకర్ రెడ్డి, మృతుడి బంధువులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గురువారం తల్లితో ఘర్షణ పడి.. ఆమెపై రాజు చేసుకోవడాన్ని దగ్గరి బంధువుల్లో ఒకరు వీడియో తీసి ఓ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. దీంతో అది వైరల్ అయింది. అదే రోజు రాజు.. తన ఫోన్లో సెల్ఫీ వీడియో తీసి, ఆ ఫోన్‌ను ఇంట్లోనే పెట్టారు. ఇక తాను సమాజంలో తలెత్తుకొని తిరగలేనని.. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఆ వీడియోలో పేర్కొన్నారు. అనంతరం ఇంట్లో నుంచి బయటపడి.. ఉప్పల్ నుంచి బీబీనగర్ వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కారు. రాజుకు తెలిసిన వ్యక్తి కూడా ఆయనతో పాటు ఆ బస్సు ఎక్కారు. రాజు వద్ద చిల్లర లేకపోవడంతో బీబీనగర్ వెళ్లేందుకు టికెట్‌ను ఆ వ్యక్తే తీసుకున్నారు. చీకటి పడ్డాక కూడా రాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు, రాజు బీబీనగర్‌కు వెళ్లారంటూ ఆయనతో పాటు ప్రయాణించిన వ్యక్తి కుటుంబసభ్యులకు చెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బీబీనగర్ చెరువు కట్టపై మార్నింగ్ వాక్‌కు వెళ్లిన స్థానికులు.. నీళ్లపై తేలిన మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. అది రాజు మృతదేహంగా గుర్తించిన పోలీసులు.. పోస్టుమార్టం కోసం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా తల్లిపై రాజు చేయిచేసుకున్న వీడియోను వైరల్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ ఉప్పల్‌లో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు.

మోసం చేసింది కాంగ్రెస్సే

- కేంద్రం బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి: బి. వినోద్

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): "రిజర్వేషన్లు కల్పిస్తామని బీసీలను మోసం చేసింది కాంగ్రెస్సే. భట్టివిక్రమార్క బీజేపీ, బీఆర్ఎస్‌లను విమర్శిస్తున్నారు. కేంద్రంలో బిల్లు పాస్ చేయని బీజేపీని అంటే అర్థం ఉంది కానీ.. మా పార్టీపై నిందలు వేయడం తగదు" అని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి. వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరాగాంధీ పదవికి ముప్పు వచ్చిందని ఏకంగా రాజ్యాంగాన్నే సవరించిందని, ఓ వ్యక్తికోసం ఆలోచించిన పార్టీ నాడు బీసీల కోసం రాజ్యాంగాన్ని ఎందుకు సవరించలేదని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నోసార్లు తమకు అనుకూలంగా ఉన్న విషయాలపై రాజ్యాంగాన్ని సవరించిందని, ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల కోసం సవరణలు చేసి.. అందరికీ న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


ఢీకొన్న ఆర్టీసీ బస్సులు

ఆర్టీసీ బస్సులు ఢీ.. 30మందికి గాయాలు

- భద్రాద్రి జిల్లా సారపాకలో ఘటన

బూర్గంపాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో 30 మంది గాయపడ్డారు. భద్రాచలం, కొత్తగూడెం డిపోలకు చెందిన బస్సులు బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో మలుపు వద్ద ఢీకొన్నాయి. ఘటనలో గాయపడిన డ్రైవర్లు, ప్రయాణికులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్రేన్ సహాయంతో వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

బడిలో క్రైస్తవ మతబోధన!

గదిలో 4 తరగతుల పిల్లలను కూర్చోబెట్టి చర్చి ఫాదర్ బోధనలు.. దగ్గరుండి సహకరించిన ప్రిన్సిపల్ మేరీ

- వర్ధన్నపేటలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఘటన
- వీడియో బయటకు.. ప్రిన్సిపల్ తత్తరపాటు
- పిల్లలకు స్పెషల్ క్లాసులు అని ఒకమాట..
- వారంతా క్రైస్తవ విద్యార్థులేనని మరోమాట
- విచారణకు ఆదేశించిన జిల్లా విద్యాశాఖ అధికారి
- మత ప్రచారం నిజమేనని నిర్ధారించిన ఎంఈవో
- పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేసిన ఏబీవీపీ


స్కూల్‌లోని తరగతి గదిలో మత బోధకుడు

వర్ధన్నపేట రూరల్/ వర్ధన్నపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని 'ఫుస్కోస్ స్కూల్' అనే ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు క్రైస్తవమత బోధనలు, వారితో ప్రార్థనలు చేయించిన తాలూకు వీడియో బయటపడింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఆ బడిలోని 1, 6, 8, 9 తరగతులకు చెందిన 20 మంది పిల్లలను ఒకే క్లాసులో కూర్చోబెట్టి.. ప్రిన్సిపల్ మేరీ సమక్షంలో చర్చి ఫాదర్ వేషధారణలో ఉన్న వ్యక్తి మతబోధనలు నిర్వహిస్తున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. శుక్రవారం ఉదయం బడి గంట కొట్టగానే మొదటి పీరియడ్‌క కేటాయించిన సమయంలో చర్చి ఫాదర్ పిల్లలకు ఈ మత బోధనలకు సంబంధించిన క్లాసు తీసుకున్నారు. తాము చేసే పనుల్లో, భోజన సమయాల్లో ప్రేయర్ చేయాలంటూ పిల్లలకు ఫాదర్ చెబుతున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. కాగా ఈ ప్రార్థనలు చేయించినట్లుగా చెబుతున్న వ్యక్తి.. ఆ బడికి ఆనుకొని ఉన్న చర్చిలోని ఫాదర్ అని, ఆయన పేరు చిన్నపు రెడ్డి అని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం ఓ విద్యార్థి తండ్రి.. స్కూల్ ఫీజు కట్టేందుకు వెళ్లగా, గదిలో మత బోధనలు జరుగుతుండటాన్ని చూసి.. మొబైల్ ఫోన్లో వీడియో తీశారు. ఆ వీడియోనే బయటకు పొక్కి.. వైరల్ అయింది. ఈ ఘటన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, హిందూ, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఫుస్కోస్ స్కూల్‌లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఉంది. బడిని క్రైస్తవ మతానికి చెందిన యాజమాన్యమే నిర్వహిస్తున్నా.. అన్ని మతాలకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ బడిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో గుట్టుగా మత బోధనలు జరుగుతున్నాయని.. ఆ సమయాల్లో బయటి వ్యక్తులెవరూ లోపలికి ప్రవేశించకుండా గేట్లు మూసేస్తారని స్థానికులు చెబుతున్నారు. వేలకు వేలు ఫీజులు కట్టి తమ పిల్లలను బడికి పంపిస్తే ఇలా వారికి మత బోధనలు చేయడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కాగా బయటపడిన వీడియోకు సంబంధించి ప్రిన్సిపల్ మేరీ స్పందించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, విలువైన విషయాలు చెబుతున్నామని, క్రైస్తవ విద్యార్థులకు మాత్రమే మత బోధనలు చేస్తున్నామని రకరకాలుగా మాట్లాడారు. బడిలో మత ప్రచార బోధనలకు సంబంధించిన ఘటనపై ఏబీవీపీ వర్ధన్నపేట మండల శాఖ ప్రతినిధులు శుక్రవారం మండల తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలపై కేసు నమోదు చేసి.. గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మత ప్రచారం నిజమేనని నిర్ధారణ

ఫుస్కోల్ స్కూల్‌లో మత ప్రచారం జరిగిందనే విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ విచారణకు అదేశించింది. ఈ మేరకు వర్ధన్నపేట ఎంఈవో శ్రీధర్ శుక్రవారమే పాఠశాలకు చేరుకున్నారు. యాజమాన్యంతో మాట్లాడారు. మత ప్రార్థనల్లో పాల్గొన్న విద్యార్థుల నుంచి కూడా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మత ప్రచారం జరిగిందని నిర్ధారించారు. అన్ని విషయాలను నివేదిక రూపంలో డీఈవో అందించారు.

ఏసీబీ వలలో ఇద్దరు ప్రభుత్వోద్యోగులు

- కాంట్రాక్టర్ సహాయకుడిని రూ.15 వేలు లంచమడిగిన విద్యుత్ ఏఈ
- కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇంటికి కార్యదర్శి రూ.10 వేలు లంచం డిమాండ్



ఈఈ సుధాకర్ రెడ్డి, మధురానగర్ కార్యదర్శి అనిల్

తార్నాక/ గంగాధర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ వద్ద పనుల కోసం వచ్చిన ప్రజల నుంచి లంచం డిమాండ్ చేసిన ఇద్దరు ప్రభుత్వోద్యోగులు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటనలు హైదరాబాద్, కరీంనగర్ జిల్లాల్లో శుక్రవారం చోటు చేసుకున్నాయి. తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టీజీఎస్‌పీడీసీఎల్) సికింద్రాబాద్ డివిజన్ పద్మారావునగర్ సబ్ డివిజన్ లాలాగూడ సెక్షన్ ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ భూమిరెడ్డి సుధాకర్ రెడ్డి.. సింగిల్ ఫేజ్ మీటర్లను త్రీ ఫేజ్ మీటర్లుగా మార్చడంతోపాటు 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణానికి ఎలక్ట్రిక్ కాంట్రాక్టర్ ఉద్యోగిని రూ.15 వేలు లంచం ఇవ్వమని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు శుక్రవారం తార్నాక చౌరస్తాలోని సన్మాన్ హోటల్‌లో బాధితుడు ఇచ్చిన డబ్బు తీసుకుని బయటకు వస్తున్న భూమిరెడ్డి సుధాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ హైదరాబాద్ నగర డీఎస్పీ గంగసాని శ్రీధర్ తెలిపారు. మరోవైపు, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ పంచాయతీ శివారు పత్తికుంటపల్లి వాసి గంగాధర లాస్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి బేస్‌మెంట్ లెవల్ పూర్తి కాగానే నెల రోజుల క్రితం రూ.లక్ష. లబ్ధిదారు ఖాతాలో జమైంది. నాటి నుంచి తన ఖర్చులకు రూ.10 వేలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ వేధిస్తున్నాడు. లబ్ధిదారు ఇంటికే వెళ్లడంతో ఆమె భర్త శ్రీకాంత్.. కరీంనగర్‌లోని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్‌ను సంప్రదించాడు. ఆయన సూచన మేరకు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీకాంత్ రూ.10 వేలు ఇస్తుండగా అనిల్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పసివాడిని బలిగొన్న వేడి తేనీరు

- తెలియక తాగేయడంతో గొంతు కాలి దుర్మరణం
- ఆస్పత్రి పాలైన మరో చిన్నారి.. అనంతలో విషాదం


రుత్విక్ (ఫైల్)

యాడికి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లల పట్ల ఏమరుపాటుగా ఉంటే ఎలాంటి దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయో ఈ ఉదంతమే నిదర్శనం. ప్లాస్క్‌లో పోసి పెట్టిన వేడి టీ తాగిన నాలుగేళ్ల పసివాడు ప్రాణాలను కోల్పోయాడు. రెండేళ్ల అతడి చిట్టి చెల్లెలు తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిపాలైంది. అనంతపురం జిల్లా యాడికి పట్టణంలో ఈ విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని చెన్నకేశవ కాలనీకి చెందిన రామస్వామి, చాముండేశ్వరి దంపతులకు కుమారుడు రుత్విక్ (4), కూతురు యశస్విని ఉన్నారు. రామస్వామి భవన నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన తల్లిదండ్రులు పనులకు వెళ్లేటప్పుడు ఎప్పటిలానే ప్లాస్క్‌లో టీ తయారు చేసుకుని వేడివేడిగా ప్లాస్క్‌లో పోసుకుని ఒక పక్కన పెట్టారు. ఆ వేడి వేడి టీని పిల్లలిద్దరూ గ్లాసలలోకి ఒంపుకుని తాగారు. దీన్ని కుటుంబ సభ్యులు గమనించలేదు. టీ వేడికి పసివారి గొంతు లోపలిభాగంలో గాయాలయ్యాయి. నొప్పి భరించలేక ఇద్దరూ ఏడుస్తుండటంతో తల్లిదండ్రులు వారిని తాడిపత్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఒక రోజు చికిత్స చేసిన వైద్యులు, మరుసటి రోజు అనంతపురం వెళ్లాలని సూచించారు. దీంతో చిన్నారులిద్దరినీ గురువారం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా రుత్విక్‌కు జ్వరం, ఫిట్స్ వచ్చాయి. పరిస్థితి విషమించి, రుత్విక్ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందాడు. యశస్వినికి చికిత్స కొనసాగుతోంది. పసివాడి మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి అనాగరిక చర్య

- నిందితులపై చర్యలు తీసుకోవాలి : మంద కృష్ణ మాదిగ

పంజాగుట్ట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అనాగరికమైన చర్య అని, ఈ దాడిని ఖండిస్తూ ప్రధాని మోదీ స్పందించిన తీరును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. మోదీ అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నామని, ఆయన స్పందననే దేశ ప్రజల స్పందన అని అన్నారు. దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఉన్న రాష్ట్రాలలో ఈనెల 13 నుంచి పలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ, జస్టిస్ గవాయ్ దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందని, దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, బీసీ రిజర్వేషన్ల అంశంపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

పిల్లల ప్రాణం తీసిన బైక్ రైడ్ సరదా!

- రోడ్డు ప్రమాదానికి గురై వారిలో ఇద్దరి మృతి
- మరొకరి పరిస్థితి విషమం, ఖమ్మం జిల్లాలో ఘటన

ముదిగొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురూ మైనర్లు.. అందులో ఇద్దరు అన్నాచెల్లెళ్లు.. ముగ్గురూ కలిసి సరదాగా ద్విచక్రవాహనంపై రైడ్‌కు వెళ్లగా.. అతి వేగమో ? మరేమైనా జరిగిందో తెలియదు కానీ ? రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురిలో ఓ బాలుడు, బాలిక మరణించగా.. మరొకరు ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పెద్దమండవ గ్రామంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దమండవకు చెందిన గొర్రెముచ్చు యావన్ కుమార్తె సనా(9) నాలుగో తరగతి చదువుతుండగా, కుమారుడు సాయి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి. పెద్దమండవకే చెందిన పేరం బుచ్చిబాబు కుమారుడు పేరం ప్రవీణ్(14) తొమ్మిదో తరగతి విద్యార్థి. సాయి, సనా, ప్రవీణ్ కలిసి శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై పెద్దమండవ నుంచి బాణాపురం వైపు వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ప్రవీణ్ అక్కడికక్కడే మరణించగా.. ఆస్పత్రికి తరలిస్తుండగా సనా అంబులెన్స్‌లోనే ప్రాణాలు కోల్పోయింది. తీవ్రంగా గాయపడిన సాయి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాయి పరిస్థితి విషమంగా ఉండగా.. అతను కోలుకుంటేనే ప్రమాదం ఎలా జరిగింది ? అనే దానిపై స్పష్టత వచ్చే అవకాశముంది. కాగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి మోజులో ఆదమరిస్తే.. జేబు గుల్లే!

(మొదటి పేజీ తరువాయి)



యువకుడు చెప్పడంతో ఆమె వెనుకాముందూ ఆలోచించకుండా రూ.10 లక్షలు ఆన్‌లైన్‌లో అతడికి పంపించేసింది. ఆ తర్వాత అతడితో మాట్లేందుకు ఆమె ప్రయత్నిస్తే ఫోన్ స్విచాఫ్ అని వచ్చింది. ఇలా ఈ యువ వైద్యురాలినే కాదు.. మరో 20 మందిని ఆ యువకుడు మోసం చేశాడు. పోలీసులు రంగంలోకి దిగి.. ఆ కేటుగాడిని చెరుకూరి హర్షగా గుర్తించారు. ఇలా వివాహ వెబ్‌సైట్లలో వాస్తవాలను నిర్ధారించుకోకుండా యువతీయువకులు గుడ్డిగా ముందుకు వెళ్లడాన్ని పసిగట్టిన సైబర్ నేరగాళ్లు తమ దోపిడీకి ఇలాంటి సైట్లనూ అడ్డాగా మార్చుకున్నారు. ఇటీవల ఓ టెకీ నుంచి రూ.7.7 కోట్ల మేర దోచుకున్నారు. బాధితుడిది హైదరాబాద్. ఓ వివాహ వెబ్‌సైట్ ద్వారా అతడికి ఓ యువతి పరిచయమైంది. ఇద్దరూ ఆ వెబ్‌సైట్‌కు సంబంధించిన ప్రీమియం ప్యాకేజీ సభ్యులు కావడంతో ఒకరి ఫోన్ నంబర్లు మరొకరు తెలుసుకుని మాట్లాడుకున్నారు. కొన్నాళ్లకు ఆ టెకీ పూర్తిగా యువతి మాయలో పడిపోయాడు. టెకీని మాటల్లో పెట్టిన యువతి.. ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలొస్తాయని నమ్మించి.. కొన్ని లింకులను పంపించింది. ఆ టెకీ.. ఆ లింకుల్ని క్లిక్ చేసి.. కొంత డబ్బు పెట్టుబడిగా పెట్టాడు. తొలుత కేటుగాళ్లు ఆ పెట్టుబడిపై లాభాలు చూపించి.. విత్‌డ్రాకు అవకాశం కల్పించారు. దీంతో ఆ యువకుడు లాభాలపై ఆశతో ఆ సైట్లలో విడతలవారీగా మొత్తం మీద రూ.7.7 కోట్ల మేర పెట్టుబడి పెట్టాడు. ఆ డబ్బు, లాభాలు కనిపిస్తున్నా.. డబ్బు విత్‌డ్రా అవ్వకపోవడం, వెబ్‌సైట్ల నిర్వాహకులకు ఫోన్లు చేసినా స్విచాఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

సైబర్ నేరగాళ్లకు అదే వరమైందా?

వాస్తవానికి మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్లలోని ప్రొఫైల్ నిజమైనదేనా? అని నిర్ధారించుకునే వ్యవస్థ నిర్వాహకుల వద్ద ఉండటం లేదు. అయితే ప్రొఫైల్ అప్‌లోడ్ చేసిన వెంటనే ప్రీమియం ప్యాకేజీ తీసుకోండి అంటూ వెంటపడి తమ ప్యాకేజీని అమ్ముకుంటారు. ఇందుకోసం రిలేషన్‌షిప్ మేనేజర్లను ఆయా సంస్థలు నియమిస్తాయి. ఇక్కడా ఏ దశలోనూ ప్రొఫైల్ వెరిఫికేషన్ ఫిజికల్‌గా ఉండకపోవడం సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది. దీనినే ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. యువ వైద్యురాలిని ఫేక్ ప్రొఫైల్‌తో మోసం చేసిన కేసుకు సంబంధించి హర్షతో పాటు షాదీ డాట్ కామ్ నిర్వాహకుడు, రిలేషన్ షిప్ మేనేజర్లపైనా జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేయడంతో ఆయా సంస్థల నిర్వాహకులు ఈ ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. తమది కేవలం మధ్యవర్తిత్వంలాంటి వ్యాపారమేనని, ప్రొఫైల్ ఫిజికల్ వెరిఫికేషన్ సాధ్యం కాదని, ఆన్‌లైన్ క్రెడెన్షియల్స్ మాత్రం చెక్ చేస్తామని కోర్టుకు తెలిపారు. తమపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టి వేయాలని అభ్యర్థించారు. అయితే.. షాదీ డాట్ కామ్ నిందితులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడి విచారణను ఎదుర్కోవాలని, ఆ తర్వాతే కోర్టుకు రావాలని హైకోర్టు ఆదేశించింది. హర్ష కేసులో బాధితులు, నిందితుడు దేశంలోని వారే కావడంతో పోలీసుల విచారణ సులభమైంది. తాజాగా సైబర్ నేరగాళ్లు రంగంలోకి దిగడం, విదేశీ లింకులు ఉండటం, డబ్బు బదిలీ జరిగిన వెంటనే మ్యూల్ ఖాతాల ద్వారా నిమిషాల వ్యవధిలో చేతులు మారుతుండటంతో అసలు నిందితులను పట్టుకోవడం కష్టంగా మారుతోందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అంటున్నారు. వివాహ సంబంధాల వెబ్‌సైట్లలో చొరబడుతున్న చీటర్లు.. నకిలీ ఆన్‌లైన్ పెట్టుబడి పథకాల్లో డబ్బులు పెట్టాలంటూ యువతీయువకులను ప్రలోభపెడుతున్నారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ షికా గోయల్ తెలిపారు. వెబ్‌సైట్లలోని వివరాలపైనే ఆధారపడొద్దని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, కుటుంబ నేపథ్యం తదితరాలను ధ్రువీకరించుకోవాలని ఆమె సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అఫ్ఘాన్ మైత్రి

అఫ్ఘానిస్థాన్ విదేశాంగమంత్రి మనదేశంలో తొలిసారిగా కాలూనడమే కాక, ఢిల్లీలో కూచొని పాకిస్థాన్‌ను చెడామడా ఏకేయడం పాలకులకు సహజంగానే సంతోషం కలిగిస్తుంది. మాతో పెట్టుకుంటే ఏం జరుగుతుందో తెలియకపోతే, నాటో, సోవియట్ యూనియన్, అమెరికాలని అడిగితెలుసుకో అంటూ మన పొరుగుదేశాన్ని ఉద్దేశించి ఆయన చేసిన హెచ్చరికలు విన్నవారికీ, చూసినవారికి తెగనచ్చేసి ఉంటాయి. వారం రోజుల భారత పర్యటనకు తాను ఉపక్రమించగానే, 'తెహ్రీక్–ఎ–తాలిబాన్ పాకిస్థాన్' (టీటీపీ) స్థావరాలమీద పాకిస్థాన్ దాడులకు దిగడం, ఆ సంస్థ అధినేత నిర్మూలనే లక్ష్యంగా భీకరంగా విరుచుపడుతున్నట్టు పాక్ మీడియా చెప్పుకోవడం ముత్తాఖీకి కోపం తెప్పించింది. అఫ్ఘాన్ల ధైర్యసాహసాలను పరీక్షించి, ప్రమాదంలో పడవద్దని పాకిస్థాన్‌ను హెచ్చరించడంతోపాటు, తమ గడ్డమీదనుంచి భారత వ్యతిరేక కార్యకలాపాలను ఏ మాత్రం అనుమతించబోమని కూడా ఆయన హామీ ఇచ్చారు. ఒక్క మహిళా పాత్రికేయురాలు కూడా లేని విలేఖరుల సమావేశంలో ఉభయదేశాల సంబంధాల గురించి అమీర్‌ఖాన్ ముత్తాఖీ ఎంతో చక్కని వ్యాఖ్యలు చేశారు, భారత్ తమకు ఎంతో ముఖ్యమైన, మిత్రదేశమని ప్రకటించారు.

దాదాపు నాలుగేళ్ళ తరువాత భారత్–అఫ్ఘాన్ మధ్య అత్యున్నతస్థాయి భేటీ జరిగింది. విదేశాంగమంత్రులు ఇద్దరూ కరచాలనాలు చేసుకున్నారు, చేయీచేయీ కలిపి ముందుకు సాగాలన్న లక్ష్యాన్ని ప్రకటించుకున్నారు. తాలిబాన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించకుండానే, కొద్దికాలంలోనే భారత్ చాలా దగ్గరైంది. ఇప్పుడు ఓ ఇరవై అంబులెన్స్‌లు, వైద్యపరికరాలు ఇవ్వడం వంటి సుహృద్భావ చర్యలను అటుంచితే, ప్రకృతివైపరీత్యాల్లో దానిని ఆదుకుంటూ, ఆహారధాన్యాలు, మందులు వంటివి అందిస్తూ, మూడు బిలియన్ డాలర్ల ప్రాజెక్టులను కూడా అక్కడ చేపడుతోంది. తాలిబాన్ పునరాగమనానికి ముందు, అష్రాఫ్ ఘనీ పాలనాకాలంలో అయితే వేలకోట్లు కుమ్మరించింది. ఇప్పుడు మరో ఆరు కొత్త ప్రాజెక్టులకు భారత్ సిద్ధపడటంతో పాటు, కాబూల్‌లో నామమాత్రంగా ఉన్న సాంకేతిక కార్యాలయాన్ని పూర్తిస్థాయి దౌత్యకార్యాలయంగా మార్చాలన్న నిర్ణయం బంధం మళ్ళీ బలపడుతోందనడానికి నిదర్శనం. అఫ్ఘానిస్థాన్ తన గనుల రంగాన్ని భారత కంపెనీలకు తెరవడం మరో మంచి పరిణామం. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల పహల్గాం దాడిని ఖండించడంతో పాటు, ఆపరేషన్ సిందూర్ సందర్భంలో సైతం అఫ్ఘానిస్థాన్ మనపక్షానే నిలిచింది. అఫ్ఘాన్‌లోని బగ్రాం వైమానిక స్థావరాన్ని తనకు అప్పగించని పక్షంలో తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని అమెరికా అధ్యక్షుడు తాలిబాన్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ససేమిరా ఇచ్చేది లేదంటున్న తాలిబాన్‌ను రష్యా, చైనా, పాకిస్థాన్‌లతోపాటు భారత్ కూడా మొన్న మంగళవారం వెనకేసుకొచ్చింది.

తాలిబాన్ ప్రభుత్వాన్ని రష్యా మాత్రమే గుర్తించింది. గుర్తించిందీ లేనిదీ ప్రపంచానికి చెప్పకుండా, రాయబారిగా ఒకరిని అనుమతించి, చైనా అతివేగంగా తాలిబాన్ ప్రభుత్వానికి ఇప్పటికే దగ్గరై, ఆర్థికంగా ప్రయోజనం పొందుతోంది. చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను ఇక్కడివరకూ విస్తరించే ఆలోచనలోనూ ఉంది. మారుతున్న పరిణామాల నేపథ్యంలో తాలిబాన్‌ను దగ్గరచేసుకోవడం భద్రత రీత్యా ఎంతో ముఖ్యమని భారత్ గ్రహించింది. అఫ్ఘానిస్థాన్‌ను అమెరికా సైన్యం విడిచిపోగానే అతికొద్దిగంటల్లోనే తాలిబాన్ ఆ దేశాన్ని స్వాధీనం చేసుకోవడం, అంతా అల్లాదయ అంటూ అప్పటి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆనందాశ్రువులు కురిపించడం తెలిసినవే. అయితే, గతంలో మాదిరిగా పాకిస్థాన్ చెప్పినట్లు తాలిబాన్ ఆడకపోవడంతో అనతికాలంలోనే అఫ్ఘాన్–పాకిస్థాన్ మధ్య వ్యవహారం చెడింది. తాలిబాన్ ప్రోత్సాహంతోనే టీటీపీ విధ్వంసానికి పాల్పడుతోందని పాకిస్థాన్ ఆరోపణ. గత ఏడాది డిసెంబరులో ఉగ్రవాదులన్న ఆరోపణతో యాభైమంది అఫ్ఘాన్లను పాకిస్థాన్ హతమార్చిన ఘటనను భారత్ తీవ్రంగా ఖండించి తాలిబాన్‌కు దగ్గరైంది. భద్రతామండలి ముత్తాఖీని ఉగ్రవాదిగా ప్రకటించి, ఆంక్షలు విధించిన నేపథ్యంలో, ఈ పర్యటనకోసం మన పాలకులు భద్రతామండలిమీదే ఒత్తిడితెచ్చి తాత్కాలిక మినహాయింపు సాధించారట. ఇక, తాలిబాన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించడమన్న ఆనవాయితీ కూడా త్వరలోనే తీరిపోవచ్చు.

ప్రతికూల పవనాల్లో భారత్–అమెరికా మైత్రి



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొగడ్తల విషయంలో చాలా పొదుపరి. ఒక వ్యక్తిని ఒకసారి మాత్రమే కాకుండా రెండుసార్లు, అందునా నాలుగు రోజుల వ్యవధిలో ఘనంగా ప్రశంసించడం అసాధారణమైన విషయమే. ఈ అరుదైన వైఖరిని ఆయన ఇటీవల చూపారు. మోదీ మెచ్చుకోలుకు అర్హుడైన పెద్ద మనిషి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ జె. ట్రంప్. 'ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధాన్ని ముగింపునకు తీసుకురావడానికి' ట్రంప్ ఇరవైసూత్రాల 'శాంతి ప్రణాళిక'ను ప్రతిపాదించిన సందర్భంగా ఆయనను మోదీ ఒకటికి రెండుమార్లు మెచ్చుకున్నారు, అభినందించారు.

ట్రంప్ ప్రతిపాదించిన 'శాంతి ప్రణాళిక' గురించి సెప్టెంబర్ 30, 2025న మోదీ ఒక ప్రకటనలో ఇలా పేర్కొన్నారు: 'గాజా ఘర్షణను సమాప్తి చేసేందుకు దోహదం చేసే సమగ్ర ప్రణాళిక అది. పాలస్తీనియన్, ఇజ్రాయెలీ ప్రజలకే కాకుండా సమస్త పశ్చిమాసియా ప్రాంతానికి సుదీర్ఘ, సుస్థిర శాంతి, భద్రత, అభివృద్ధిని సమకూర్చే ఆచరణీయ మార్గమది'. మోదీ మరో అసాధారణ చర్య కూడా తీసుకున్నారు. తన ప్రకటనను ఎనిమిది భాషల– అరబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్‌తో పాటు హిబ్రూ, హిందీ– లో జారీ చేశారు. అక్టోబర్ 4న మోదీ ఇలా ప్రకటించారు: 'గాజాలో శాంతి స్థాపనకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు నిర్ణయాత్మక పురోగతి సాధించాయి. హర్షామోదాలతో ఆయన నాయకత్వాన్ని స్వాగతిస్తున్నాం'.

నేనీ వ్యాసాన్ని రాస్తున్న సమయంలో ట్రంప్ శాంతి ప్రణాళిక మొదటి దశను అమలుపరిచేందుకు హమాస్, ఇజ్రాయెల్ అంగీకరించాయి. హమాస్ తన చెరలో ఉన్న ఇజ్రాయెలీ బందీలను విడుదల చేస్తుంది, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ పాటిస్తుంది. అయితే ఇవి ఎప్పటి నుంచి అమలవుతాయన్న విషయం తెలియదు, బహుశా, త్వరలోనే కావచ్చు. ఎట్టకేలకు శాంతి వీచికలు వీస్తున్నందుకు గాజాలోనూ, ఇజ్రాయెల్లోను ప్రజలు వీధుల్లోకి వచ్చి పండుగ చేసుకొంటున్నారు. హమాస్ ఇప్పటికీ ఆ శాంతి ప్రణాళికలోని అనేక అంశాలను అంగీకరించలేదు. ముఖ్యంగా గాజాపై తన నియంత్రణ అధికారాలను ఒక బాహ్య అధికార సంస్థకు అప్పగించేందుకు హమాస్ సుముఖత చూపడం లేదు.

జనవరి 20, 2025న అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిననాటి నుంచీ ట్రంప్ మహాశయుడు భారత్‌ను అగౌరవపరుస్తున్నారు, అవమానిస్తున్నారు. భారత్ ప్రయోజనాలను దెబ్బతీసే, భారతీయుల శ్రేయస్సుకు హానికలిగించే నిర్ణయాలే తీసుకుంటున్నారు. అయినప్పటికీ ట్రంప్‌ను ఘనంగా పొగిడేందుకు, ఆయనను ప్రసన్నుడిని చేసుకునేందుకు ప్రధాని మోదీ ఎందుకు అంతగా ఆరాటపడుతున్నారు? ట్రంప్ మొదటి పర్యాయం అధ్యక్షుడుగా ఉన్న కాలం (2017–21)లో భారత్ (ఇంకా కొన్ని ఇతర దేశాల)పై భారీ సుంకాలు విధించారు. ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకాలు విధించారు. భారత్‌కు జీఎస్‌పీ ప్రయోజనాలను రద్దు చేశారు. భారతీయులు వినియోగించుకుంటున్న వివిధ రకాల వీసాలు, ముఖ్యంగా హెచ్–1బిని నిలిపివేశారు. అయినప్పటికీ సెప్టెంబర్ 22, 2019న టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో ట్రంప్‌కు మద్దతుగా 'అబ్‌కీ బార్, ట్రంప్ సర్కార్' అనే ఒక అప్రతిష్ఠాకర ప్రకటనను మోదీ చేశారు.

ఈ ఏడాది జనవరిలో రెండో పర్యాయం అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన ట్రంప్ దరిమిలా గత తొమ్మిది నెలల్లో భారత్ (బ్రెజిల్ పైన కూడా)పై పెద్ద ఎత్తున సుంకాలు విధించారు. తద్వారా అమెరికాకు భారత్ నుంచి ఉక్కు, అల్యూమినియం, జౌళి ఉత్పత్తులు, ముత్యాలు, బంగారు ఆభరణాలు, సముద్ర ఆహారోత్పత్తులు, ఔషధాలు, పాదరక్షలు, ఫర్నీచర్, కార్లు, ఆట వస్తువులు మొదలైన వాటి ఎగుమతులను దాదాపుగా నిలిపివేశారు. రష్యా నుంచి పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా యుద్ధాన్ని కొనసాగించేందుకు రష్యాకు భారత్ నిధులు సమకూరుస్తోందని ట్రంప్ ఆరోపించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నదనే ఆక్షేపణతో భారత్‌పై మరో 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఆయన సన్నిహితుడు సెనేటర్ లిండ్సే గ్రాహమ్ అయితే భారత్‌ను తీవ్ర కష్టనష్టాలకు గురి చేస్తామని హెచ్చరించారు. 'రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తే మీ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేస్తా'మని కూడా ఆయన తీవ్రంగా అన్నారు. భారత్‌ను 'టారిఫ్ కింగ్' అని ట్రంప్ దుయ్యబట్టారు. ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవార్రో అయితే మరింత ఘోరంగా మాట్లాడారు. భారత్–రష్యా సంబంధాలను తీవ్రంగా విమర్శిస్తూ ఆ రెండు దేశాలూ 'మృత ఆర్థిక వ్యవస్థలు' అని ట్రంప్ వెటకారం చేశారు. హెచ్ 1–బి వీసాలకు దరఖాస్తు చేసే వారు లక్ష డాలర్ల ఫీజు చెల్లించాలని ఉత్తర్వు జారీ చేసారు. విద్యార్థి, కుటుంబ సభ్యుల వీసాల నియమ నిబంధనలను మరింత కఠినతరం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి–మే నెలల మధ్య 1000 మందికి పైగా భారతీయులను 'చట్టవిరుద్ధ వలసకారులు' అనే ఆరోపణతో అరెస్ట్ చేసి వారి చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులు కట్టి సైనిక విమానంలో భారత్‌కు తరలించారు.



> జనవరి 2025 నుంచి భారత్‌కు అమెరికా మిత్ర దేశమని చెప్పేందుకు వీలు కల్పించే ఒక్క నిర్ణయాన్ని కూడా ట్రంప్ ప్రభుత్వం తీసుకోలేదు. భారత్–అమెరికా సంబంధాలు సజావుగా లేవు. అవి దిగజారుతున్నాయి. పరిస్థితి ఇదయితే ట్రంప్‌ను ప్రశంసించేందుకు ఇజ్రాయెల్ మద్దతుతో ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను భారత ప్రధానమంత్రి ఎందుకు ఒక అవకాశంగా తీసుకున్నారు?

పహల్గాం ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ప్రమేయమున్నదని తెలిసి కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ దేశానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అమెరికా మద్దతుతో పాకిస్థాన్ ఐఎమ్ఎఫ్ నుంచి 100 కోట్ల డాలర్లు, ఏడీబీ నుంచి 80 కోట్ల డాలర్లు, ప్రపంచ బ్యాంక్ నుంచి 400 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని పొందింది. పాక్‌కు ఈ ఆర్థిక వితరణను భారత్ వ్యతిరేకించినప్పటికీ అమెరికా పట్టించుకోలేదు. పహల్గాం తరువాత భారత్–పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం ముగిసేందుకు తాను మధ్యవర్తిత్వం చేశానని ట్రంప్ ప్రకటించారు. ఇందులో ఆవగింజంత సత్యం కూడా లేదని భారత్ ఎంతగా ఖండించినప్పటికీ ట్రంప్ ఆ వాదనను పదే పదే పునరుద్ఘాటిస్తున్నారు. మున్నెన్నడూ లేని రీతిలో అమెరికా అధ్యక్షుడు తన అధికార నివాసం శ్వేతసౌధంలో పాకిస్థాన్ సైనిక దళాల ప్రధానాధికారికి గత జూన్ 18న విందు ఇచ్చారు. ఇది భారత్‌ను అవమానించడం కాదా? ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వాధినేత ఒక సైనికాధికారికి ఆతిథ్యమివ్వడమేమిటి? సెప్టెంబర్ 25న పాకిస్థాన్ ప్రధాన మంత్రి, సైనిక దళాల ప్రధానాధికారితో కలిసి విలేఖర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా పాక్ 'మహానాయకులు' ఇరువురూ అమెరికాకు అత్యాధునిక పరిశ్రమలకు అవసరమైన రేర్ ఎర్త్ మినరల్స్‌ను సరఫరా చేసేందుకు పాకిస్థాన్ సుముఖంగా ఉందని ప్రకటించారు. అంతేకాకుండా అరేబియా సముద్ర తీరస్థ ప్రాంతంలో ఒక ఓడ రేవును నిర్మించేందుకు అమెరికాను ఆహ్వానించారు. సెప్టెంబర్ 11 ఉగ్రవాద దాడులు, ఒసామా బిన్ లాడెన్, అబ్బోటాబాద్, పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఒక సురక్షిత స్థావరమై పోయిందని బుష్, ఒబామా ప్రభుత్వాలు పదే పదే చేసిన ప్రకటనలను ట్రంప్ అమెరికా పూర్తిగా విస్మరించింది. ఒకేసారి రెండు గుర్రాల (అమెరికా, చైనా)పై స్వారీ చేసే విద్యలో పాకిస్థాన్ ఆరితేరిపోయింది. జనవరి 2025 నుంచి భారత్‌కు అమెరికా మిత్ర దేశమని చెప్పేందుకు వీలు కల్పించే ఒక్క నిర్ణయాన్ని కూడా ట్రంప్ ప్రభుత్వం తీసుకోలేదు. భారత్–అమెరికా సంబంధాలు సజావుగా లేవు. అవి దిగజారుతున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు భారత్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. ఈ క్లిష్ట పరిస్థితిని అధిగమించేందుకు మరింత పట్టుదలతో బృహత్తర కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

పరిస్థితి ఇదయితే ట్రంప్‌ను ప్రశంసించేందుకు ఇజ్రాయెల్ మద్దతుతో ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను భారత ప్రధానమంత్రి ఎందుకు ఒక అవకాశంగా తీసుకున్నారు అనేది ఒక ఆసక్తికరమైన ప్రశ్న. ఆ శాంతి ప్రణాళిక పాలస్తీనియన్లకు న్యాయం చేసేదేమీ కాదు. అందులోని 19వ అంశాన్ని చూడండి: గాజా పునర్ నిర్మాణ కార్యక్రమం కొనసాగుతూ, నిర్దేశించిన విధంగా పాలస్తీనా అథారిటీ తనను తాను సంస్కరించుకోవడం జరిగినప్పుడు పాలస్తీనా స్వయం నిర్ణయాధికార హక్కుకు, స్వతంత్ర దేశ ప్రతిపత్తికి అంతిమంగా అనుకూల పరిస్థితులు నెలకొంటాయి'. ఇదేమన్నా పాలస్తీనియన్లకు ఆనందోత్సాహాలు కలిగిస్తుందా?

నేను అభిప్రాయపడుతున్నది ఏమిటంటే యుద్ధం అంతిమంగా నిలిచిపోవచ్చు, త్వరలోనే బందీలు విడుదల కావచ్చు, నిస్సహాయులుగా మిగిలిపోయిన గాజా వాసులకు మానవతాపూరిత సహాయం అందవచ్చు... ఇంతమాత్రాన సమస్య తీరిపోతుందా? డోనాల్డ్ ట్రంప్, టోనీ బ్లెయిర్ (బ్రిటన్ మాజీ ప్రధాని) తదితర ప్రముఖులతో ఏర్పాటయ్యే 'బోర్డ్ ఆఫ్ పీస్' అనే సంస్థ పర్యవేక్షణలో గాజా దాదాపుగా ఒక వలసపాలనా ప్రాంతంగా పరిణమిస్తుంది. తమ మాతృభూమి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించాలన్న పాలస్తీనియన్ల స్వప్నం సంపూర్ణంగా భగ్నమవుతుంది. మళ్లీ అటువంటి స్వప్నానికి ఆస్కారం లేని పరిస్థితులు నెలకొంటాయి. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతి గురించి, ప్రపంచ వ్యవహారాలలో భారత్ పోషిస్తున్న పాత్ర గురించి మోదీ చాలా చాలా గొప్పగా మాట్లాడడం కద్దు. ఆ ఘనమైన మాటలు ఎలా ఉన్నా ప్రపంచంలో భారత్‌కు కొద్ది మంది మిత్రులు మాత్రమే ఉన్నారని, భారత ఆర్థిక వ్యవస్థ గడ్డు పరిస్థితులను అధిగమించలేని పరిస్థితిలో ఉందన్న కఠోర వాస్తవాలను ప్రధాని మోదీ గుర్తించారు. చుట్టుముడుతున్న ప్రతికూల పరిస్థితులను అర్థం చేసుకుంటున్నారు. హేతుబద్ధమైన విదేశాంగ విధానం, మంచి వాణిజ్య, పెట్టుబడుల విధానాలకు చిత్తశుద్ధిలేని పొగడ్తలు ఎంత మాత్రం ప్రత్యామ్నాయాలు కావు, కాబోవు.


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

భారత ప్రజాస్వామ్య ఉద్ధారకుడు

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత రాజకీయాలలో సుప్రసిద్ధ నాయకుడిగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న జయప్రకాశ్ నారాయణ్ శ్రీవాస్తవ 'జనతా పార్టీ'ని స్థాపించి, 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీని ఓడించారు. తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చరిత్రలోనే చెరగని ముద్ర వేశారు.

జయప్రకాశ్ నారాయణ్ 1902 అక్టోబర్ 11న బిహార్–ఉత్తర ప్రదేశ్ సరిహద్దులలోని ఒక కుగ్రామంలో జన్మించారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్ళి అక్కడ ఓహియో యూనివర్సిటీలో విద్యను పూర్తి చేసుకొని స్వదేశానికి చేరుకునే సమయంలో దేశంలో నడుస్తున్న స్వాతంత్ర్యోద్యమం వైపు ఆకర్షితుడై అందులో పాల్గొని, గాంధేయవాదిగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని స్థాపించారు. క్విట్ ఇండియా మూవ్‌మెంట్‌లో కీలకపాత్ర పోషించారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజకీయాల వైపు దృష్టి కేంద్రీకరించి, పలువురు నాయకులతో చర్చించేవారు. స్వార్థపూరిత రాజకీయాలను సహించేవారు కాదు. సామాన్యులకు సమ న్యాయం జరగాలన్నదే ఆయన ప్రధాన లక్ష్యం. సాధ్యమైనంతవరకు ప్రజలకు నిర్ణయాధికార హక్కులను ఇచ్చి, స్వచ్ఛమైన పరిపాలనను అందించాలన్నదే ఆయన వాదన. తాను ఏనాడూ పదవిని ఆశించలేదు. 1974 మార్చి 18న బిహార్‌లోని విద్యార్థులు ప్రభుత్వ అవినీతి కార్యకలాపాలకు వ్యతిరేకంగా ఒక ఉద్యమాన్ని లేవనెత్తారు. ఆ ఉద్యమానికి నాయకత్వం వహించవలసిందిగా జయప్రకాశ్ నారాయణ్‌ను కోరగా, అంగీకరించి ఆ ఉద్యమాన్ని విజయపథంలో నడిపారు. ఉత్తర భారతంలోని అన్ని రాష్ట్రాలకు ఈ ఉద్యమం విస్తరించి బిహార్ మూవ్‌మెంట్‌గా మారింది. అప్పుడే జయప్రకాశ్ నారాయణ్‌ను 'జె.పి'గా పిలిచారు.



జె.పి– 1975 ప్రారంభంలో 'ఛాత్ర యువ సంఘర్ష వాహిని' అనే ఒక స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. దీని కోసం పాట్నాలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి 'సమగ్ర మార్పుల కోసం – సంపూర్ణ విప్లవం' అన్న నినాదంతో పోరాటాన్ని నడిపించాలని పిలుపునిచ్చారు. అయితే ఇది అహింసాయుతంగా ఉండాలని, ఇందులో సామాజిక న్యాయం, అవినీతి నిరోధం, అసాంఘిక రుగ్మతలను రూపుమాపడం లాంటివి ముఖ్యోద్దేశ్యాలై సాగాలని కోరారు. రోజురోజుకు ప్రజాదరణ పెరిగి 'సంపూర్ణ క్రాంతి జబ్ నారాహై, భావీ ఇతిహాస్ హమారాహై' అంటూ ఉద్యమం ఉధృత రూపు దాల్చింది.

నాటి ప్రధాని ఇందిరాగాంధీ లోక్‌సభ ఎన్నికలలో అవినీతికి, అవకతవకలకు పాల్పడినట్లు నిరూపితమై, ఆమె ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. అందులో ఆమె లోక్‌సభ ఎన్నిక రద్దుతో పాటు, మరో ఆరేళ్ళ వరకు ఎన్నికలలో పోటీకి అనర్హురాలిగా ప్రకటించింది. ఇందిరాగాంధీ సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్ళింది. 1975 జూన్ 25న హైకోర్టు తీర్పును సమర్థిస్తూ, తదుపరి చర్యలు చేపట్టేవరకు తన పదవిలో కొనసాగవచ్చని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆ తీర్పును తట్టుకోలేని ఇందిరాగాంధీ, అదేరోజు రాత్రి భారత రాజ్యాంగంలోని 352(1) అధికరణాన్ని ఉపయోగించి దేశంలో అంతర్గత అలజడుల వలన హింసాత్మక సంఘటనలు చెలరేగే అవకాశం ఉందన్న సాకుతో నాటి దేశాధ్యక్షులు ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చేత అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటింపజేసింది. వెంటనే పౌరుల హక్కులను తొలగించింది. వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యాలను హరించింది. రాత్రికి రాత్రే ప్రతిపక్ష నాయకులందరినీ అరెస్టు చేయించి, జైళ్ళలో వేయించింది. దాదాపు 21 నెలల పాటు ఈ దేశం నిరంకుశత్వాన్ని చవిచూసింది. ఈ ఎమర్జెన్సీ కాలంలోనే జె.పి. ప్రతిపక్ష పార్టీలను ఏకం చేయాలని నిర్ణయించుకున్నారు. ఫలితంగా జనతా పార్టీ పుట్టింది. 1977లో జరిగిన ఎన్నికలలో కరడుగట్టిన కాంగ్రెస్ పార్టీని ఓడించి, ఆ పార్టీ అధికారాన్ని చేపట్టింది. జె.పి గొప్ప ప్రజాస్వామ్య పోరాట యోధుడుగా గడిపి, కొంతకాలం తర్వాత ఆరోగ్యం క్షీణించి 1979 అక్టోబరు 8న పరమపదించారు.

జయప్రకాశ్ నారాయణ్ సామాజిక సేవలను గుర్తించి 1965లో రామన్ మెగసెసె అవార్డు (ఏసియా నోబుల్ ప్రైజ్) వరించింది. 1980లో ఆయన గౌరవార్థం భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంపును రిలీజ్ చేసింది. 1999లో భారత ప్రభుత్వం దేశ ప్రముఖులకు మరణానంతరం అందజేసే అత్యున్నత అవార్డు 'భారతరత్న'ను ప్రకటించింది. జెపి 113వ జయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'ప్రజాస్వామ్య పరిరక్షణ దినం'గా ప్రకటించింది. ప్రజాస్వామ్య పరిరక్షణ సిద్ధాంత కర్తగా ఈ దేశంలో నిరంకుశ పాలనను నిర్మూలించడానికి ప్రయత్నించిన సాధకులుగా జెపి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. 'లోక్‌నాయక్'గా చిరస్మరణీయులయ్యారు.

○ రేమద్దుల దివాకర్‌రావు
మాజీ కన్వీనర్, ఛాత్ర యువసంఘర్ష వాహిని

(నేడు జెపి జయంతి)

గంటకో రైతు ఎందుకు రాలిపోతున్నాడు?

మన దేశంలో 2023లో 1,71,418 మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీరిలో వ్యవసాయ రంగానికి చెందిన రైతులు, రైతు కూలీలు కూడా ఉన్నారు. దేశానికి అన్నం పెట్టే చేతులే ఆకలితో, అప్పుల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం మన సమాజానికి ఒక మాయని మచ్చ. దేశవ్యాప్తంగా ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో 66.2శాతం మంది వార్షిక ఆదాయం ఒక లక్ష రూపాయల కంటే తక్కువే.

2023లో దేశవ్యాప్తంగా గంటకు ఒక రైతు తన ప్రాణం తీసుకున్నాడని జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తాజా గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు, అప్పులు, పంటలు దెబ్బతినడం వంటి కారణాలు మరోసారి ఈ వాస్తవాన్ని మన కళ్లముందు నిలబెట్టాయి. ఆత్మహత్యలకు పాల్పడిన 1,71,418 మందిలో 10,786 మంది వ్యవసాయ రంగానికి చెందినవారు. మొత్తం ఆత్మహత్యల్లో ఇవి 6.3 శాతం. ఈ గణాంకాలను లోతుగా పరిశీలిస్తే ఆత్మహత్యలు చేసుకున్న వారిలో 43శాతం మంది రైతులు (4,690) కాగా, 56శాతం మంది వ్యవసాయ కూలీలు (6,096) ఉన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల్లో 4,553 మంది పురుషులు కాగా, 137 మంది మహిళలు ఉన్నారు. కూలీలలో మాత్రం 5,485 మంది పురుషులు ఉంటే, 611 మంది మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రలో 38.5శాతం మంది ఉండగా, కర్ణాటకలో 22.5శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 8.6శాతం, మధ్యప్రదేశ్‌లో 7.2శాతం, తమిళనాడులో 5.9శాతం ఉన్నారు.



"రైతు ఆత్మహత్యలు దేశమంతా వ్యాపించిన గ్రామీణ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రైతులు, పేదల కంటే ఎక్కువగా పెట్టుబడిదారుల పక్షానే నిలుస్తోంది. ఫలితంగా గ్రామీణ భారత దేశంలో తీవ్రమైన పేదరికం, కష్టాలు పెరిగాయి. గతంలో భారత ప్రభుత్వ విధానాలు– సానుభూతి, వివిధ వర్గాల మధ్య సమతౌల్యం ఆధారంగా ఉండేవి. గత దశాబ్ద కాలంగా కీలకమైన వ్యవసాయాన్ని కాపాడుకునే విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. ప్రతి రైతు ఆత్మహత్య పాలనాపరమైన వైఫల్యం, విధానాల లోటుకు సాక్ష్యంగా నిలుస్తోంది" అంటారు జర్నలిస్టు డా. కోట నీలిమ. ఈమె గతంలో రైతుల ఆత్మహత్యలపై అధ్యయనం చేసి, 'విడోస్ ఆఫ్ విదర్భ' పుస్తకాన్ని రాశారు.

ఉత్పత్తి ఖర్చుపై లాభం వచ్చేలా కనీస మద్దతు ధరను అన్ని పంటలకు వర్తింపజేయాలి. మధ్యవర్తుల దోపిడీని తగ్గించేందుకు డైరెక్ట్ మార్కెటింగ్, ఈ–నామ్ వేదికలను బలోపేతం చేయాలి. గిడ్డంగులు ఏర్పాటు చేయడం ద్వారా పంటలు నిల్వ చేసుకునే అవకాశం కల్పించాలి. అనకాపల్లి సమీపంలో 'వికాసవనం' మన్యంలో పండిన అరటి, క్యారెట్, పనసను సోలార్ డ్రయర్ల ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్నారు. తద్వారా ఆ ప్రాంతంలో దిగుబడి పెరిగినా పంట వృథా కాకుండా మార్కెట్ చేస్తూ రైతులకు భరోసాగా మారారు.

వర్షాధార ప్రాంతాల్లో చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ కార్యక్రమాలు వేగవంతం చేయాలి. 'భూసారం, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే ప్రకృతి వ్యవసాయం మల్టీ–క్రాపింగ్ వంటి పద్ధతులను ప్రోత్సహించాలి. దీనివల్ల రసాయన ఎరువులపై పెట్టుబడులు తగ్గించుకోవచ్చు' అంటారు పార్వతీపురం మన్యం జిల్లాలోని కొండబారిడి గ్రామస్థులు. ఈ ఊరిలో ఒక్క కెమికల్ ఎరువుల షాపు కూడా కనిపించదు! పూర్తిగా ప్రకృతి సేద్యంతో ఇక్కడ పంటలు పండిస్తారు.

చిన్న రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు, పంట ఇన్సూరెన్స్‌లో పారదర్శకత ఉండాలి. ప్రైవేట్ మనీ లెండర్లపై ఆధారపడకుండా కోఆపరేటివ్ సొసైటీలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా రుణాలు ఇవ్వాలి. అలాగే రైతులు పంట నష్టపోతే తక్షణ పరిహారం, ఆరోగ్య బీమా, వృద్ధాప్య పింఛన్, పిల్లల విద్యకు మద్దతు ఇవ్వాలి. గ్రామస్థాయిలో కౌన్సెలింగ్ కేంద్రాలు, రైతు భరోసా వేదికలు వంటివి ఏర్పాటు చేయాలి. దేశానికి అన్నం పెడుతున్న రైతు, అదే పొలంలో తన ప్రాణం వదిలిపెట్టడం సమాజాన్ని కలవరపెట్టే విషయం.

● శ్యాంమోహన్
రూరల్ మీడియా

ఇంకానా? ఇకపై చెల్లదు

తమపై కుట్రలు చూసి
బీసీల కళ్లెర్రపడుతున్నాయి...

తమ ఆశల గొంతులు కోసే వాళ్లను
బీసీలు కనిపెట్టిండ్రు...
మోసం చేసిన వాడే వాగ్దానాలు
ఇవ్వడాన్ని ప్రతి బీసీ గుర్తుపట్టిండు..

వాళ్ల గెలుపుల కోసం
బీసీలను పావులను చేసిన వాళ్ళను
వదలను అంటుంది బీసీ కంఠం...
బీసీలను బలిపీఠాల పైకెక్కించి
మీరు ఇంకెన్నాళ్లు గద్దెలపై
కులుకుతారని గర్జిస్తోంది బీసీ స్వరం..

నోటి కాడ ముద్దను
ఎనభై ఏళ్లు లాగేసింది ఎవరు...
అధికారాలను
ఇన్నేళ్లు లాగేసిందెవరు...

నీ నోటి కాడ ముద్ద మేమడగట్లే
మా వాటా మాకు వచ్చేదాకా
మిమ్మల్ని విడవనంటోంది బీసీ శక్తి..

రాజ్యాంగ సవరణ జరిగే దాకా
న్యాయం జరగదు
ఇక తమ రాజ్యానికై
ప్రతి బీసీ కదలక తప్పదు...

– జూలూరు గౌరీశంకర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఇందిరమ్మ రాజ్యం రాలేదేమి?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బంగారు తెలంగాణను ఆవిష్కరిస్తానని వందమార్లు నమ్మబలికిన కేసీఆర్ పాలనలో అన్ని రంగాలూ మరింత నిర్వీర్యమై శిథిలావస్థకు చేరాయి. కుటుంబ నిరంకుశ పాలనలో అధికారిక అనధికారిక దోపిడీ, అవినీతి అనేక రెట్లు పెరిగిపోయింది. అవినీతిమయ పాలనను జీర్ణించుకోలేని ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. రాహుల్‌గాంధీ సమక్షంలో పీసీసీ అధ్యక్షునిగా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తూ ఇందిరమ్మ రాజ్యాన్ని తిరిగి తెస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.



ఇందిరమ్మ పాలన (1967–77)లో పేదల అభివృద్ధికి, సంక్షేమానికి అనేక పథకాల అమలు జరిగింది. ఇందిరాగాంధీ నేతృత్వంలో 1975లో తెలంగాణలో కాకతీయ విశ్వవిద్యాలయం ప్రారంభమైంది. అనేక డిగ్రీ జూనియర్ కళాశాలలు మొదలయ్యాయి. మారుమూల గ్రామాలలో వందలాది ఉన్నత పాఠశాలలు అవతరించాయి. ప్రైమరీ హెల్త్ సెంటర్స్ విస్తరణ జరిగింది. ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేయడం, సంస్థానాధీశులకు ఇచ్చే కోట్లాది రూపాయల రాజభరణాలను రద్దు చేయడం, భూగరిష్ఠ పరిమితి చట్టం తేవటం వంటి ఎన్నో మంచి పనులు జరిగాయి. ఇరవై సూత్రాల పథకం ద్వారా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించారు. మొట్టమొదటిసారి బీసీలకు విద్య, ఉద్యోగాలలో 25శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడింది. నిష్ణాతులైన మేధావి వర్గం సలహాలతో ఏర్పడిన ప్రణాళికా సంఘం ద్వారా ప్రభుత్వ రంగ ప్రాజెక్టులు, పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. అందుకే పేద ప్రజలు ఇప్పటికీ ఇందిరమ్మ రాజ్యాన్ని ఇష్టంగా తలుచుకుంటారు.

అలాంటి ఇందిరమ్మ రాజ్యాన్ని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నది. ప్రజలు, ఉద్యమకారులు, మేధావులు పాలనలో గుణాత్మకమైన మార్పు కోసం ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు. తెలంగాణలో గత పాలనలో విధ్వంసానికి గురైన ప్రభుత్వ విద్యాసంస్థలు ఇప్పటికీ సంక్షోభంలోనే కూరుకొని ఉన్నాయి. ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంస్థలు రకరకాల బలహీనతలతో ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోతున్నాయి. రాష్ట్రంలో రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్, నీటిపారుదల మున్సిపాలిటీ శాఖలలో అవినీతి విలయతాండవం చేస్తున్నది.

కేవలం వ్యవసాయ, సేవల రంగంపై ఆధారపడిన తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక అభివృద్ధి నామమాత్రంగా మిగిలిపోయింది. ఎదుగుతున్న యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగుకావడం లేదు. లాభసాటి వ్యవసాయం, అనుబంధ పరిశ్రమల ఊసే లేదు. ప్రజలు తమ ఆదాయంలో అత్యధిక భాగం ప్రైవేటు విద్య, వైద్య సేవల కొనుగోలు కోసం, అధికారులకు అవినీతి చెల్లింపుల కోసం కోల్పోతున్నారని క్షేత్రస్థాయి పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా పరిపాలనలో గుణాత్మకమైన మార్పు రావడంలేదని బాధిత ప్రజలు వాపోతున్నారు.

ప్రభుత్వం అప్పులు చేయకపోతే పూట గడవడం లేదు. ప్రభుత్వ ఆదాయంలో అత్యధిక భాగం వేతనాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, గత ప్రభుత్వం చేసిన బాకీలు, బకాయిల చెల్లింపులకే సరిపోవడం లేదనీ నిత్యం వార్తా కథనాలు వస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల అభివృద్ధే అన్నట్టుగా అక్కడే కార్పొరేట్ సంస్థల అభివృద్ధి, విస్తరణ కొనసాగుతున్నది. రాష్ట్రంలో వెనుకబడిన ఆదిలాబాద్, నిజామాబాదు, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో ప్రభుత్వ పెట్టుబడులు లేక, ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించలేక ఆ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువత రాష్ట్ర రాజధానికి వలసపోతున్నది. ఇందిరమ్మ రాజ్యంలో వలె వార్షిక ప్రణాళికలు, పంచవర్ష ప్రణాళికలు, దీర్ఘకాలిక ప్రణాళికల ఊసే లేదు.

రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన ఇందిరమ్మ రాజ్యం అమలుకు ప్రస్తుత ప్రభుత్వానికి ఇంకా మూడేళ్ళ వ్యవధి మాత్రమే ఉన్నది. ఇప్పటికైనా పేద ప్రజలు కోరుకున్న విధంగా పరిపాలనలో గుణాత్మకమైన మార్పులను అమలు చేయాలి. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో నూతన ఒరవడితో రాష్ట్రాన్ని పునర్నిర్మించాలి.

▪ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



> అధికార కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి మొదలైంది. జిల్లా కమిటీల కార్యవర్గాలను ఎంపిక చేసేందుకు టీపీసీసీ కసరత్తు చేస్తోంది. డీసీసీ అధ్యక్ష పదవికి పోటీ పడే వారి నుంచి శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటంతో పార్టీ సంస్థాగత ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని అధిష్ఠానం భావిస్తోంది. అయితే పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో పార్టీ పదవులపై నాయకులు ఆశతో ఉన్నారు. ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలకే డీసీసీ అధ్యక్ష పదవిని కట్టబెట్టేందుకు అధిష్ఠానం సుముఖంగా ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఉన్న డీసీసీ అధ్యక్షుల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మరో టర్మ్ కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లుగా ప్రచారం ఉంది. మిగతా జిల్లాల్లో కూడా పాత, కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. పార్టీ పదవుల పందేరం ఇప్పుడు కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

- నేటి నుంచి డీసీసీ అధ్యక్ష పదవులకు దరఖాస్తుల స్వీకరణ
- హనుమకొండకు ఎమ్మెల్యే నాయిని వైపే అధిష్ఠానం మొగ్గు..?
- వరంగల్ డీసీసీకి స్వర్ణతో పాటు మరో నలుగురైదుగురు ఆశావహులు
- జనగామ జిల్లా అధ్యక్ష రేసులో ఝాన్సీరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి
- ములుగు జిల్లా అధ్యక్ష పదవి తెరపైకి పైడాకుల, సూర్య
- భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష పీఠం దక్కేదెవరికో?
- ఎమ్మెల్యేలు, సీనియర్లకు అవకాశం ఇవ్వాలనే యోచనలో అధిష్ఠానం

సారథులెవరో!?

కాంగ్రెస్ జిల్లా కార్యవర్గాల భర్తీకి అధిష్ఠానం కసరత్తు

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులను భర్తీ చేసేందుకు అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. శనివారం నుంచి వారంపాటు జిల్లా అధ్యక్ష పదవిని ఆశించే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఏఐసీసీ నుంచి ప్రతీ జిల్లాకు డీసీసీ ఎన్నికల పర్యవేక్షులను నియమించారు. శనివారం హనుమకొండ, వరంగల్ జిల్లా పార్టీ సమావేశాలను డీసీసీ భవన్‌లో నిర్వహిస్తున్నారు. సోమవారం భూపాలపల్లి పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్ష పదవిని ఆశించేవారు తమ దరఖాస్తుతో పాటు పార్టీ వారు చేసిన సేవలు, అనుభవం, గతంలో నిర్వహించిన బాధ్యతలు, తదితర వివరాలతో స్పష్టంగా పేర్కొంటూ ఏసీసీఐ పర్యవేక్షులకు ఇవ్వాలని అధిష్ఠానం సూచించింది. దీంతో డీసీసీ అధ్యక్ష పదవిని ఆశించే నేతలు దరఖాస్తులు సిద్ధం చేసుకుంటున్నారు.

హనుమకొండ నాయినికేనా..

ఉమ్మడి జిల్లాకు కేంద్రంగా ఉన్న హనుమకొండ డీసీసీ అధ్యక్ష పదవి కాంగ్రెస్‌కు కీలకంగా మారింది. ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు హనుమకొండలో కీలకమైన నేత చేతిలో డీసీసీ పగ్గాలు ఉంచాలని అధిష్ఠానం భావిస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డికి ఇటీవలే టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా పార్టీ నియమించింది. అయితే తనకు కార్యనిర్వాహక అధ్యక్ష పదవి కావాలని నాయిని అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారు. కులాల సమీకరణలో నాయిని ఉపాధ్యక్ష పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే డీసీసీ అధ్యక్ష పదవిని వేరే వాళ్లకు అప్పగించాలని నాయిని పీసీసీ అధ్యక్షుడికి లేఖ కూడా రాశారు. దీంతో హనుమకొండ డీసీసీ అధ్యక్ష పదవిపై కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జంగా రాఘవరెడ్డి, దొమ్మాటి సాంబయ్యతో పాటు మరో నలుగురైదుగురు నజర్ వేసినట్లుగా ప్రచారం జరిగింది. అయితే అధిష్ఠానం మరోసారి డీసీసీ అధ్యక్ష పదవిని నాయిని రాజేందర్‌రెడ్డికి అప్పగించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాలకు బలంగా కౌంటర్ ఇస్తుండటంతో పాటు రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉండటంతో నాయిని వైపే అధిష్ఠానం మొగ్గు చూపుతోందనే ప్రచారం జరుగుతోంది. జడ్పీ చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వుడు కావటంతో దొమ్మాటి సాంబయ్య కూతురు మౌనికకు దాదాపు ఖరారైందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో నాయిని అధ్యక్ష పదవి చేపట్టేందుకు అయిష్టత చూపిస్తే రెడ్డి సామాజిక వర్గం నుంచి మరొకరికి అవకాశం ఇస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి.



ఇక వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవిని మరోసారి చేపట్టేందుకు ఎర్రబెల్లి స్వర్ణ సుముఖంగా ఉన్నారనే ప్రచారం ఉంది. అయితే వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖతో పాటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి.. తమ అనుచరులను బరిలోకి దించేందుకు ప్రణాళిక రూపొందించారని తెలుస్తోంది. మంత్రి కొండా దంపతులు తమ అనుచరులు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాష్‌తో పాటు మరో ఇద్దరు ముగ్గురు పేర్లను అధిష్ఠానం

(మిగతా 7లో..)



మద్దతు ధర లభించేలా చూడాలి..

మద్దతుధరల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ సత్యశారద
- ఏనుమాముల మార్కెట్లో ఆకస్మిక తనిఖీ

వరంగల్‌సిటీ, శుక్రవారం 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతులకు లభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. డీఎంవో సురేఖ, గ్రేడ్ 2 కార్యదర్శి రాముతో కలిసి పత్తి, అపరాల యార్డులకు వెళ్లి రైతులతో మాట్లాడారు. ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. పత్తి, మక్క జొన్నల నాణ్యత, తేమ తీరును పరిశీలించారు. లాట్ ఐడీల వివరాలు తెలుసుకున్నారు. అదే విధంగా మార్కెట్లో పత్తి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమె 2025-26 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామ గ్రామాన అంటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, క్యాంటీన్, విద్యుత్, విశ్రాంతిభవనం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి మార్కెట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజిత్‌రావు, ఏఎస్.రాజేందర్, చాంబర్ ప్రతినిధులు అల్లె సంపత్, గౌరిశెట్టి శ్రీనివాస్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వీధి కుక్కలపై స్పెషల్ డ్రైవ్

- వందకు పైగా కుక్కల పట్టివేత
- చింతగట్టు ఏబీసీ సెంటర్‌కు తరలింపు



7

స్మార్ట్‌సిటీ పనుల గడువు పొడిగింపు

- డిసెంబరు వరకు పూర్తిచేసేందుకు అవకాశం
- ఫలించిన ఎంపీ కడియం కావ్య చొరవ

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ మిషన్ పథకంలో భాగంగా వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పనులను పూర్తిచేసేందుకు మరోమారు అవకాశం లభించింది. నగరంలో స్మార్ట్‌సిటీ పథకం కింద జరగాల్సిన పనులు కొన్ని అసంపూర్తిగా మిగిలి ఉన్నాయని, పనులు పూర్తి కావడానికి మరి కొంత సమయం అవసరమని ఎంపీ కడియం కావ్య జూలై 31న ఢిల్లీలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖను కోరారు. గతంలో కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి స్మార్ట్ సిటీ పనులకు సమయం పొడిగించాలని కేంద్రాన్ని అభ్యర్థించడంతో మార్చి 2025 మార్చి వరకు గడువు పెంచారు. ఇంకా పనులు పెండింగ్‌లో ఉండడంతో ఎంపీ కావ్య పార్లమెంట్‌లో విజ్ఞప్తి చేయడంతో ఈ యేడు డిసెంబర్ వరకు వరంగల్‌లో స్మార్ట్‌సిటీ పనులను చేసేందుకు గడువు పొడిగిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. కాగా, ప్రస్తుతం వడ్డేపల్లి చెరువు సుందరీకణ, గ్రీనరీ, లైటింగ్, ల్యాండ్ స్కేపింగ్, పాత్‌వే, వాకింగ్ ట్రాక్, స్వాగత తోరణాల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. హనుమకొండలోని పద్మాక్షిగుట్ట, ఎన్‌జీవోఎస్ కాలనీలోని సెంట్రల్ లైటింగ్, గ్రినరీ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి

(మిగతా 6లో..)

బీసీల రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి డ్రామా

- ఢిల్లీలో అఖిలపక్షంతో కలిసి కేంద్రంపై పోరాటం చేయాలి
- ఎన్నికల సమయంలో గ్యారంటీ కార్డులు ఇచ్చి కాంగ్రెస్ మోసం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హనుమకొండ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి డ్రామా చేస్తున్నారని, ఆయనను ప్రజలు తరిమి కొట్టాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని ఆయన నివాసంలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, సతీష్‌బాబుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ 420 హామీల లాగానే 42శాతం బీసీ రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి డ్రామా చేశారని ఆరోపించారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలువలేమని తెలుసుకుని బీసీ వర్గాలను మాయమాటలతో దగా చేశారని మండిపడ్డారు. స్థానిక సంస్థలు లేక కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.300కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.300కోట్లు గ్రామాలు నష్టపోతున్నాయన్నారు. కాంగ్రెస్ నిర్లక్ష్యంతో గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని అన్నారు. రాష్ట్రంలో 22 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం ఒక్క అభివృద్ధి పని చేసింది లేదని విమర్శించారు.

గతంలో రాష్ట్రాలు రిజర్వేషన్లు అడిగితే జైలుకు పంపించాలని అన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు బీసీల రిజర్వేషన్లపై నమ్మించి మోసం చేశారని అన్నారు. రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా ఎలా ముందుకెళ్తారని కేటీఆర్ ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేదని అన్నారు. రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసే సీఎం కావాలని కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతున్నదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి రూ.1,300కోట్ల అప్పులు చేసి బస్సు చార్జీలు పెంచారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో బీసీలకు బీసీ బంధు, సంక్షేమ పథకాలు అమలు చేశామని తెలిపారు. ఆర్టీసీకి రూ.2వేల కోట్లు చెల్లించి ఆర్టీసీని లాభాలోకి తీసుకొచ్చారని ఎర్రబెల్లి తెలిపారు.



విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ బాకీ కార్డును ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, తదితరులు

మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన మోసాలు బట్టబయలయ్యాయని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గ్యారంటీ కార్డులలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను కూడా ఇరికించారని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రిజర్వేషన్ల పేరు చెప్పి ఎన్నికలు అంటూ ప్రజలను అయోమయానికి గురి చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, పోలెపల్లి రాంమూర్తి, బండి రజనీకర్ తదితరులు పాల్గొన్నారు.

చిందు కళాకారుడు

గజవెల్లి సమ్మయ్య కన్నుమూత



గజవెల్లి సమ్మయ్య (ఫైల్)

పోచమ్మమైదాన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పైడిపెల్లికి చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి సమ్మయ్య (80) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. చిందు యక్షగాన కళాకారుడిగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక వార్డులు అందుకున్నారు. స్త్రీ వేషధారణలో అనేక నాటకాలు వేసి ఎంతో మంది అభిమానం చూరగొన్నారు. ఆయన మరణంతో స్థానికులు, పలువురు ప్రముఖులు పెద్ద ఎత్తున తరలివచ్చి సంతాపం తెలిపారు. స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్‌కుమార్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సమ్మయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమ్మయ్యకు భార్య, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు.


ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి...

- టోకెన్ ఉన్న రైతులకే గన్నీ బ్యాగ్‌లు ఇవ్వాలి
- జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌లోని హాల్‌లో సెర్ఫ్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఖరీఫ్ -2025-26 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై ధాన్యం కొనుగోలు కమిటీ ప్రతినిధులు, సీసీలు, ఏపీఎంలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ అధికారులు జారీ చేసిన టోకెన్ ఉన్న రైతుల వద్ద మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రతీ కొనుగోలు కేంద్రం వారు సక్రమంగా పుస్తక నిర్వహణ చేయాలన్నారు. అలాగే టోకెన్ ఇచ్చిన రైతులకు మాత్రమే గన్నీ బ్యాగ్‌లను ఇవ్వాలని ఆదేశించారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, నీడ కోసం షెడ్, కరెంటు, లైట్ సౌకర్యం, మహిళా రైతుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పీపీసీ కేంద్రానికి ఇచ్చిన ప్యాడీ క్లీనర్లను అన్నింటినీ వాడాలన్నారు. కమలాపూర్, హసన్‌పర్తి మండలాల్లో వరి కోతలు మొదలైన నేపథ్యంలో సోమవారం వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, అడిషనల్ డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ డీపీఎం రాజేంద్రప్రసాద్, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయాధికారులు, మండల ఏపీఎంలు, సీసీలు, కొనుగోలు కమిటీ పుస్తక నిర్వాహకులు పాల్గొన్నారు.

- ఉత్పాదకత, రైతు ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు
- దేశవ్యాప్తంగా ఎంపికైన 100జిల్లాల్లో జనగామ ఒకటి
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ





వంద జిల్లాల్లో జనగామకు చోటు..

జనగామకు ధన్ ధాన్య యోగం

'ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన' పథకం కింద ఎంపిక

జనగామ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయాన్ని మరింత సుస్థిరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశంలో ఇప్పటికే అమలులో ఉన్న కేంద్ర, రాష్ట్ర పథకాలను సమన్వయం చేసుకుంటూ కొత్త కార్యక్రమానికి రూపకల్పన చేసింది. దేశ పంటల ఉత్పాదకత, రైతుల ఆదాయాన్ని పెంచడం, రైతులకు వనరుల కల్పన, రుణ సదుపాయం చేరువ చేయడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) కార్యక్రమాన్ని రూపొందించింది. దేశంలో

(మిగతా 6లో..)

దేశవ్యాప్తంగా వ్యవసాయపరంగా వెనుకబడిన వంద జిల్లాలను ఈ పథకం కింద కేంద్రం ఎంపిక చేసింది. ఇందులో జనగామ జిల్లా ఒకటికావడం విశేషం. మూడు ప్రమాణాలను ఆధారంగా చేసుకొని జిల్లాలను ఎంపిక చేసింది. పంటల తక్కువ ఉత్పాదకత, పంటల తక్కువ సాగు విస్తీర్ణం, తక్కువ రుణ సదుపాయం వంటి మూడింటిని ప్రాతిపదికగా తీసుకున్నారు. జిల్లాలో భారీ పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు వంటివి పెద్దగా లేకపోవడం వంటి అంశాలు కలిసి వచ్చాయి. పంటల ఉత్పాదకతను పెంచడం, పంటల మార్పిడిని ప్రోత్సహించడం, నీరు పారుదల వ్యవస్థను మెరుగుపరచడం, రైతులకు రుణ సదుపాయం కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం. వ్యవసాయ రంగమే కాకుండా అనుబంధ రంగాలైన పండ్ల తోటలు, మత్స్య, తేనెటీగల పెంపకం, పశుసంవర్ధక, అటవీ రంగాల అభివృద్ధిపై దృష్టి సారించనుంది. దీని ద్వారా ఉత్పాదకత, రైతుల ఆదాయం పెరగడమే కాకుండా స్థానికంగా జీవనోపాధిని కల్పించడం, రైతులు స్వావలంబనతో జీవించాలన్నదే కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

డిప్యూటేషన్‌పై నగరానికి..

- పర్వతగిరి మండలంలో టీచర్ల తీరు
- ప్రశ్నార్థకంగా విద్యార్థుల చదువులు

పర్వతగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల్లో డిప్యూటేషన్ మోజు పెరుగుతుండటంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు చదువులు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పర్వతగిరి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పలువురు ఉపాధ్యాయులు ఇక్కడి నుంచి డిప్యూటేషన్ వేయించుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. జీవో నెంబర్ 25 ప్రకారం 10 మంది విద్యార్థులకు ఓ టీచర్ ఉండాలని నిబంధన చెప్తుండగా, దానికి భిన్నంగా ఇక్కడ ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఉన్నప్పటికీ కొందరు రకరకాల కారణాలతో డిప్యూటేషన్‌పై అర్బన్ ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.

మండలంలో మొత్తం 49 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 8 జిల్లా పరిషత్, 7 యూపీ, 34 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1237 మంది విద్యార్థులు చదువుతున్నారు. పర్వతగిరిలో 270 మంది విద్యార్థులు ఉండగా, 22 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇక్కడ పని చేసే ఉపాధ్యాయురాలు పార్వతి రంగశాయిపేటకు, ప్రతిభ ఖిలావరంగల్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. అన్నారం షరీఫ్ గ్రామంలోని పాఠశాలలో 93 మంది విద్యార్థులకు 9 మంది ఉపాధ్యాయులు ఉండగా, ఇటీవల టీచర్లు వసంత రాణి, ఉమాదేవి వరంగల్‌కు వెళ్లారు. కొంకపాక, వడ్లకొండ గ్రామాల నుంచి సైతం ఉపాధ్యాయులు శైలజ, శేషచారిలు వరంగల్‌లోని వివిధ పాఠశాలలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. వీరి స్థానంలో ప్రత్యామ్నాయం లేకపోవడంతో పాఠాల బోధనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఈ విషయమై పర్వతగిరి ఎంఈవో గాయపు లింగారెడ్డిని వివరణ కోరగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై పట్టణాలకు వెళ్లారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలతోనే డిప్యూటేషన్‌పై పంపించడం జరిగిందని చెప్పారు. డిప్యూటేషన్లపై డీటీఎఫ్ నాయకుడు మహంకాళి రామస్వామి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు అనుగుణంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు డిప్యూటేషన్ పేరిట పట్టణాలకు వెళ్లడం సరికాదని అన్నారు. వారి అక్రమ డిప్యూటేషన్లను రద్దుచేయాలని కోరారు. అన్నారం షరీఫ్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని గుగులోతు హారికను పలకరించగా.. తమ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న ప్రతిభ, పార్వతి టీచర్లు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారని, వారు వెళ్లిపోవడంతో తమకు హిందీ, ఫిజిక్స్ సబ్జెక్టులు చెప్పేవారు లేకుండా పోయారని తెలిపింది.



అన్నారం షరీఫ్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల

సదయ్యను వెంటనే రిలీవ్ చేయాలి

టీయూటీఎఫ్ నేతల డిమాండ్

హనుమకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని బీఎడ్ కాలేజీలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఆట సదయ్య రెండేళ్ల కాలపరిమితి ముగిసినా రిలీవ్ చేయకపోవడంలోని అంతర్యం ఏమిటని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) హనుమకొండ శాఖ అధ్యక్షుడు నూతనకంటి బాబు, ప్రధాన కార్యదర్శి దామెర భిక్షపతి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఖిలా వరంగల్ మండలం రైల్వేగేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఆంగ్లం) అయిన సదయ్య 2023 సెప్టెంబరు 22న హనుమకొండ ప్రభుత్వ బీఎడ్ కళాశాలకు డిప్యుటేషన్‌పై వచ్చాడని గుర్తు చేశారు. ఆయన డిప్యుటేషన్ గత నెల 26తోనే పూర్తయిందని, అయినా ఇంకా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాడని పేర్కొన్నారు. సదయ్యను బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ వెంటనే రిలీవ్ చేసి వరంగల్ డీఈవోకు సరెండర్ చేయాలని బాబు, భిక్షపతి డిమాండ్ చేశారు. బీఎడ్ కళాశాలలో సబ్జెక్టుపరంగా ఫ్యాకల్టీ కొరత ఉన్నట్లయితే నోటిఫికేషన్ ద్వారా అన్ని అర్హతలు ఉన్న కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా భర్తీ చేయాలని, కానీ అందుకు విరుద్ధంగా ఆయనను ఇంకా కొనసాగించడంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సదయ్య తన 30 ఏళ్ల సర్వీస్‌లో దాదాపు సగం సర్వీసు బీఎడ్ కళాశాలలో, ఇతరత్రా ఫారిన్ సర్వీస్‌లో కొనసాగుతూ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడన్నారు.

భూమిని కబ్జాదారుల నుంచి కాపాడండి

న్యూశాయంపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని రజక కుల సేవా సంఘానికి చెందిన 3ఎకరాల 25 గుంటల భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని, తమ భూమిని కాపాడి న్యాయం చేయాలని వడ్డెపల్లి రజక కుల సేవా సంఘం నాయకులు శుక్రవారం న్యూశాయంపేట కూడలిలో ఉన్న రజక భవనంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. 1963లో పింగిలి విజయ్‌పాల్‌రెడ్డి దొర దగ్గర తమ తాతలు పని చేసినందుకుగాను సర్వేనెంబర్ 914(ఓల్డ్), న్యూసర్వే నెంబర్7లో వడ్డెపల్లి రజక కులస్థులకు 3 ఎకరాల 25 గుంటల భూమి దానంగా ఇచ్చాడని, పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఉన్నాయని, ఇందులో రజక కులానికి సంబంధించి 700 గజాలలో శ్మశాన వాటికకు ఉపయోగించుకుంటున్నామని, మిగతా భూమి రజక సంఘం పేరుపై ఉందని వారు ఎమ్మెల్సీకి వివరించారు. అయితే గత ఆగస్టులో హైదరాబాద్‌కు చెందిన తీగల రమేష్‌బాబు సన్నాఫ్ నారాయణరావు అనే వ్యక్తి తమ ల్యాండ్‌పైకి వచ్చి ఇందులో తనకు కూడా ల్యాండ్ ఉందని, 2003లో 5000 గజాలు కొనుక్కున్నానని దౌర్జన్యంగా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తమ ల్యాండ్ కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నాడని ఎమ్మెల్సీకి చెప్పారు.

వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ సారయ్య కలెక్టర్, ఆర్డీవో, ఎంఆర్వో, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌తో మాట్లాడారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ సారయ్యను కలిసిన వారిలో వడ్డెపల్లి రజక కుల సేవా సంఘం అధ్యక్షులు ఎదులాపురం వినోద్‌కుమార్, వడ్డెపల్లి రజక సేవా సంఘం సభ్యులు కుమారస్వామి, కొమురయ్య, ఐలయ్య, చిన్న రాజు, రాజేందర్, వెంకటనారాయణ, సాంబరాజు వంశీ, చరణ్, కవిత, రాజేశ్వరి, సంపూర్ణ, మాధవి, మానసతోపాటు సుమారు 50 మంది రజకకులానికి చెందిన సభ్యులు ఉన్నారు. ఎమ్మెల్సీ వెంట ఉమ్మడి వరంగల్ జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి చిట్యాల భిక్షపతి, రజక సంఘం నాయకులు సాంబరాజు అంకయ్య, ఎల్లయ్య, సమ్మయ్య, చలపతిలు ఉన్నారు.


ఎమ్మెల్సీ సారయ్యను కలిసిన రజక కుల సేవా సంఘం నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించండి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

కుడా కార్యాలయంలో అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై- అర్బన్) 2.0 కార్యక్రమంపై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కుడా కార్యాలయంలోని సమావేశ మందిరంలో ముందుగా ఈ పథకంపై అధికారులకు అవగాహన కల్పిస్తూ అంగీకార్-2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పీఎంఏవై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రూపులుగా తయారు చేయాలన్నారు.

పీఎం సూర్యఘర్ యొక్క ప్రయోజనాలను ప్రజలకు విశ్లేషించాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 దరఖాస్తుల ధృవీకరణతో పాటు స్పెషల్ ఫోకస్ గ్రూపుల కింద లబ్ధిదారులను చేర్చాలన్నారు. గృహరుణాలపై సబ్సిడీని సులభతరం చేయాలన్నారు. రుణమేళాల ద్వారా లబ్ధిదారులకు గృహ రుణాలు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాల హౌసింగ్ పీడీలు గణపతి, హరికృష్ణ, డిప్యూటీ కమిషనర్‌లు ప్రసన్నరాణి, రవీందర్‌తో పాటు హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కుడా కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

పేద ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయం

హనుమకొండ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ సీట్లు సాధించిన పేద విద్యార్థులకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె.నాగార్జునరెడ్డి ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నిట్ అండ్ మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.2లక్షల 70 వేలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిట్ అండ్ మెడికో రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణచారి, అసోసియేషన్ సభ్యులు రావుల మధు, ఆకుల భాస్కర్, నరేందర్, యాదగిరి, కందిమల్ల జితేందర్, ఇందిరా, రోజా, బాబురావు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించలేదు

హనుమకొండ డీటీడబ్ల్యూవో

వడ్డెపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించలేదని హనుమకొండ, జనగామ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ (డీటీడబ్ల్యూవో) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు తుడుందెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి చింత నాగేశ్వర్‌రావు చేసిన ఆరోపణను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో దారావత్ రాజు స్కూల్ అసిస్టెంట్ హెడ్మాస్టర్‌గా, శ్రీమతి ఎస్‌జీటీగా డిప్యూటీ వార్డెన్‌గా విధులు నిర్వహించేవారని పేర్కొన్నారు.

కాళోజీ కళాక్షేత్రంలో మినీ హాల్ కేటాయించండి

కళా, సాహిత్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల విజ్ఞప్తి

ఎమ్మెల్యే నాయిని, కుడా చైర్మన్‌కు వినతిపత్రాలు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో తమ కార్యక్రమాలను నిర్వహణకు వీలుగా మినీహాల్‌ను కేటాయించాలని కళ, సాహిత్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డిలను కలిసి కోరారు. ఈ మేరకు వినతిపత్రాలను సమర్పించారు. కనీస వసతులు, రెండు వందల కుర్చీలు, వేదిక, ఫ్యాన్లు, లైట్లు తదితర కనీస సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థులు, బాలబాలికలకు విద్యా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. అలాగే కవులు, రచయితలు, కళాకారులు నిర్వహించుకునే సదస్సులు, సమావేశాలకు, రిహార్సల్స్‌కు, నృత్య, సంగీత, నాటక ప్రదర్శనలకు, తక్కువ మంది ప్రేక్షకులు, తక్కువ ఖర్చుతో నిర్వహించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఇందుకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి సానుకూలంగా స్పందించారు. మినీ హాల్‌ను తప్పకుండా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ బృందం వినతి పత్రాలను కుడా వైస్ చైర్పర్సన్, జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, నిధి, కాజీపేట పురుషోత్తం, తేరాల యుగేందర్, పెండ్లి ఉపేందర్‌రెడ్డి, వెంగళ్ రెడ్డి, కరేటీ శంకర్‌రావు, శంకర నారాయణ, రాజ్ మహ్మద్, శ్రావణ్ కుమార్, పరికిపండ్ల వేణు, ఇందారపు నాగేశ్వర్ రావు, గంగారపు యాదగిరి, మక్తాల మనోహరచారి తదితరులు పాల్గొన్నారు.


ఇనుగాల వెంకట్రామ్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తు న్న ప్రతినిధులు

నవరాత్రోత్సవాలకు పెరిగిన ఆదాయం

గతేడాది కంటే 10 శాతం అధికం

వరంగల్ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా జరిగాయని ఈవో, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునిత తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే దసరా ఉత్సవాల్లో 10 శాతం ఆదాయం అధికంగా లభించిందని పేర్కొన్నారు. లడ్డూ, పులిహోర, రవ్వకేసరి, అభిషేకం లడ్డూ, ప్రత్యేక దర్శనం టికెట్లు, వాహన పూజల ద్వారా గత ఏడాది రూ. 58,33,729 ఆదాయం లభించగా ఈ ఏడాది రూ. 64,44,014 లభించిందని తెలిపారు. దాదాపు 6 లక్షల పైచిలుకు అధిక ఆదాయం లభించిందని, రోజు రోజుకూ అమ్మవారి దర్శనానికి తరలి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోందని, ఇందుకు అనుగుణంగా భక్తులకు ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కాజీపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా లారీ ఢీ కొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. కాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన కొలిపాక ఉప్పలయ్య (65) శుక్రవారం ఉదయం కాజీపేట చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా హనుమకొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఉప్పలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని మృతుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విజయ్‌కుమార్ మృతికి బార్ సంతాపం

వరంగల్ లీగల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది ఏపీ విజయ్‌కుమార్ (63) మృతికి హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్లు సంతాపం వ్యక్తం చేశాయి. శుక్రవారం బార్ అసోసియేషన్ హాల్‌లో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఏపీ విజయ్‌కుమార్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా కాజీపేటలోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన 1989 నుంచి న్యాయవాదిగా ఉభయ జిల్లా కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రముఖంగా రైల్వే కేసులను వాదించేవారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ అధ్యక్షత వహించగా వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, ప్రధాన కార్యదర్శి డి.రమాకాంత్, ఇతర కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు కె.అంబరీష్‌రావు, చిల్లా రాజేంద్రప్రసాద్, చొల్లేటి రామకృష్ణ, శివకుమార్, సాంబశివరావు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

అంతకు ముందు హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు ఆధ్వర్యంలో జిల్లా కోర్టు హాల్‌లో సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ఏపీ విజయ్‌కుమార్ మరణం న్యాయవాద వృత్తికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ, అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, గవర్నమెంట్ ప్లీడర్ కె.నర్సింహరావు, ఉభయ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

19న ఉర్సు గుట్ట వద్ద నరకాసుర వధ

కరీమాబాద్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19వ తేదీ ఆదివారం రోజున ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని నరకాసుర వధ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి తెలిపారు. శుక్రవారం ఉర్సు ప్రతాప్‌నగర్‌లో నరకాసుర వధ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరకాసుర వధను తిలకించిన తరువాతే కేదారేశ్వర నోములు, దీపావళి పండుగను జరపుకోవడం పుణ్యప్రదమని వేద బ్రాహ్మణులు తెలియజేసినందున ఈ నెల 19న 58 అడుగుల ఎత్తుతో భారీ నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముఖ్య అతిథిగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొని వేడుకలను ప్రారంభిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి, కోశాధికారి మరుపల్ల గౌతం, ఉపాధ్యక్షుడు బాలకొమురెల్లి, సహాయ కార్యదర్శి శెట్టి మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శులు అన్న కుమారస్వామి, నరసింహా, కాటం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నరకాసుర వధ వేడుకల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


మాట్లాడుతున్న మెడికవర్ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ సంతోష్ మొదాని

ప్రాణాపాయ స్థితి నుంచి రోగిని కాపాడిన మెడికవర్ వైద్యులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితి నుంచి రోగిని కాపాడినట్లు మెడికవర్ వైద్యులు తెలిపారు. శుక్రవారం మెడికల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సంతోష్ మొదాని మాట్లాడారు. 51 ఏళ్ల వయస్సు గల రాజారావు అనే రోగి గుండె సంబంధిత తీవ్రమైన నొప్పితో వరంగల్‌లోని మెడికవర్ హాస్పిటల్ వచ్చారని తెలిపారు. దీర్ఘకాల ధూమపానం చేసే ఈ రోగి గుండె వేగంగా కొట్టుకోవడం, మూర్ఛవంటి లక్షణాలతు ఆస్పత్రులకు వెళ్లగా మోనోమార్ఫిక్ వెంట్రిక్యూలర్ టాకీకార్డియా ఉన్నట్లు తేలినట్లు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకొచ్చేసరికి పల్స్ 220 బీపీఎం, రక్తపోటు 60 సిస్టాలిక్‌గా నమోదే రోగి కార్డియోజెనిక్ షాక్‌లో ఉన్నాడు. వెంటనే డాక్టర్ సంతోష్ మొదాని, కన్సల్టెంట్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డాక్టర్ లక్ష్మీదీపక్, కన్సల్టెంట్ క్రిటికల్ కేర్ స్పెషలిస్టు డాక్టర్ సుష్మ ప్రియాంకలు ఎమర్జెన్సీ మెడిసిన్ నేతృత్వంలో వైద్య బృందం సింక్రొనైజ్ డీసీ కార్డియోవర్షన్ చేసి రోగిని సాధారణ గుండె దాకిడికి (సైనస్ రిదమ్) తీసుకొచ్చారు. సరైన చికిత్సతో రోగి షాక్ నుంచి, కిడ్నీ సమస్య నుంచి పూర్తిగా కోలుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ నమ్రత, మార్కెటింగ్ హెడ్ హరినాథ్ గుప్తా పాల్గొన్నారు.

జనగామకు ధన్ ధాన్య యోగం

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయపరంగా వెనుకబడిన 100 జిల్లాలను ఈ పథకం కింద కేంద్రం ఎంపిక చేసింది. ఇందులో భాగంగా తెలంగాణలో జనగామ, నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలను ఎంపిక చేసింది. ఈ కార్యక్రమానికి ఈ ఏడాది జూలై 16న కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపగా ప్రధాని నరేంద్రమోదీ శనివారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

అమలు తీరు ఇలా..

పీఎండీడీకేవై కింద ఎంపికైన జిల్లాల్లో ధన్ ధాన్య కృషి యోజన కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తారు. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఈ కమిటీలో వ్యవసాయంతో రాణిస్తున్న రైతులతో పాటు అధికారులు సభ్యులుగా ఉంటారు. దేశవ్యాప్తంగా 11 శాఖలకు సంబంధించిన 36 రకాల కార్యక్రమాలు ధన్ ధాన్య కృషి యోజన కిందకు రానున్నాయి. ధన్ ధాన్య కృషి యోజన కోసం 2025-26 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.24వేల కోట్లను కేటాయించింది. ఎంపిక చేసిన జిల్లాల్లో వచ్చే ఆరేళ్లలో రూ.24,000 కోట్లను వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి ఖర్చు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లెక్కన ఒక్కో జిల్లాకు ఆరేళ్లకు రూ.240 కోట్లు ఖర్చు చేస్తారు. ఏడాదికి రూ.40 కోట్లు మంజూరు కానున్నాయి. ఈ నిధులతో వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు అమలు, రైతులకు రుణ సదుపాయం వంటివి ఉంటాయి. ఆగా, ఈ యోజన కార్యక్రమాన్ని ప్రధాని మోదీ శనివారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. ఇందుకోసం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు.

స్మార్ట్‌సిటీ పనుల గడువు పొడిగింపు

(5వ పేజీ తరువాయి)

చేయాల్సి ఉంది. వరంగల్‌లోని పోతనరోడ్డు, పాపయ్యపేటలోని స్మార్ట్ వాటర్ డ్రైనేజీ పనులు చేయాల్సి ఉంది. కీలకమైన ప్రాజెక్ట్‌లో సుమారు రూ.12కోట్ల విలువైన గ్రీనరీ పనులు, పోతనరోడ్డులోని స్వాగత తోరణ నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులు పూర్తి కావలసిన ఉందని ఎంపీ కావ్య శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఇంకా కరీమాబాద్ దసరా రోడ్డు, రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాల్లో స్మార్ట్ సిటీ రోడ్ల కింద పాత్‌వేలు, లైటింగ్, గ్రీనరీ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ అధికారులకు ఎంపీ సూచించారు. స్మార్ట్‌సిటీ పథకంలో మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు మునిసిపల్ అధికారులు, సిబ్బంది సమీక్షలు ఏర్పాటు చేసుకుని గడువులోగా పనులు పూర్తి చేయాలని ఎంపీ కావ్య ఆదేశించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7050	5300
మక్కలు	2050	1521
కందులు	5352	3022
పెసళ్లు	4312	3022
పల్లికాయ (సూక)	5900	3500
పల్లికాయ (పచ్చిది)	4100	2400
పసుపు (కాడి)	9869	9016
పసుపు (గోల)	8906	8226
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	13000	12000
యూఎస్341ఏసీ	15800	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

పండుటాకుల పరేషాన్

» నిలిచిన సీనియర్ సిటిజన్ కార్డుల జారీ
» ఆరు నెలలుగా మంజూరుకు సర్కార్ బ్రేక్
» ఇబ్బందులు పడుతున్న వయో వృద్ధులు
» ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 19,800 కార్డులు
» కార్యాలయాల చుట్టూ వృద్ధుల ప్రదక్షిణ

హనుమకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్స్ కార్డు(ఎస్‌సీసీ)ల జారీ నిలిచిపోవడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్డుల కోసం జిల్లా వయోవృద్ధులు, స్త్రీశిశు సంక్షేమ కార్యాలయం చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా అయినా కార్డులు పొందుదామనుకున్నా వీలు కావడం లేదు. ఇందుకు సంబంధించిన సైట్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం మూసి వేసింది. 60 సంవత్సరాలు దాటిన పురుషులు, 58 సంవత్సరాలు పైబడిన మహిళలకు సీనియర్ సిటిజన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తుంది. దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్ కార్డు చెల్లుబాటు అవుతుంది. ముదిమి వయసులో కన్న బిడ్డల నుంచి నిరాదరణకు గురైనవారికి, ఎలాంటి ఆధారం లేని అనాథ వృద్ధులకు ఆశ్రమాల్లో సేవలు పొందేందుకూ అవసరం అవుతుంది. దేశవ్యాప్తంగా కార్డుల జారీ కొనసాగుతున్నా రాష్ట్రంలో మాత్రం 6 నెలలుగా నిలిచిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో కార్డుల సమస్యను పరిష్కరించాలంటూ వృద్ధులు అర్జీలు పెట్టుకున్నారు.

దరఖాస్తులు పెండింగ్

కలెక్టరేట్, డబ్ల్యూజీఎంసీ కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్ దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. కార్డుల కోసం వెళ్తే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందని అధికారులు చెబుతున్నారు. ఈ కార్డు ద్వారా గతంలో పొందిన ప్రయోజనాలు ఇప్పుడు వృద్ధులు పొందలేకపోతున్నారనీ, అందువల్ల ఈ కార్డులు ఉన్నా లేకున్నా ఒకటే అనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలుస్తోంది. అయితే రైల్వే, ఆర్టీసీ వంటి రవాణాకు గతంలో లాగా ఇప్పుడు ప్రయాణ చార్జీల్లో రాయితీలు ఇవ్వడం లేదు. 58 ఏళ్ల పైబడిన మహిళలు, 60 ఏళ్ల దాటిన పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు 40 శాతం టికెట్ ధరలో రాయితీ ఉండేది. కరోనా నేపథ్యంలో 2020 మార్చిలో ఈ వెసులుబాటును నిలిపివేసిన రైల్వే శాఖ పునరుద్ధరించలేదు. కానీ మిగతా ప్రయోజనాలు యథాతథంగానే ఉన్నాయి. అలాంటప్పుడు కార్డుల జారీని నిలిపివేయడం ఎందుకు ? అని వృద్ధులు ప్రశ్నిస్తున్నారు. సీనియర్ సిటిజన్లు అని ధ్రువీకరించుకోవడానికి ఆధార్ కార్డు సరిపోతుందని, వాటి ఆధారంగా సీనియర్ సిటిజన్ కార్డు ప్రయోజనాలను పొందవచ్చునని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం సీనియర్ సిటిజన్ కార్డు ఉండాల్సిందేనని చెబుతున్నారని వయోవృద్ధులు వాపోతున్నారు.

ఆన్‌లైన్‌లోనూ అవకాశం లేక..

కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదని మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు అంటున్నారు. వెబ్‌సైట్‌లో ఫ్యామిలీ కార్డు వరకు అప్లికేషన్ వెళ్తున్నా కార్డు డౌన్‌లోడ్ చేస్తుంటే ఎర్రర్ అని వస్తోందని చెబుతున్నారు. మాన్యువల్ అయితే చిరునామా ఎక్కడ ఉంటుందో అక్కడి మండల, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో మీ-సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో కార్డులను ఉచితంగా జారీ చేస్తుండగా తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది.



వైద్య సాయం

వృద్ధులకు ఆరోగ్య భరోసాను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన' (ఏబీ-పీఎంజేఏవై) పథకాన్ని ప్రారంభించింది. వార్షిక సంపాదనతో సంబంధం లేకుండా 70 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 5 లక్షల బీమా అందిస్తారు. ఎస్‌సీసీ పొందిన వారికి సంవత్సరానికి కనీసం రూ. 5 లక్షల మేరకు వైద్యసాయం అందుతుంది. రాష్ట్రంలో ఈ కార్డుల జారీ లేక ఆ అవకాశాన్ని వయో వృద్ధులు కోల్పోతున్నారు.

ప్రయోజనాలెన్నో..

సీనియర్ సిటిజన్ కార్డుతో సంక్షేమ పథకాలు సులభంగా పొందవచ్చు. వయసు ధ్రువీకరణ, ఆధార్, ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలు చూపాల్సిన అవసరం లేదు. ఆర్టీసీ బస్ టికెట్‌లో 25 శాతం రాయితీ లభిస్తుంది. కేసుల విచారణలో కోర్టులు ప్రాధాన్యం ఇస్తాయి. బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక లైన్లు ఉంటాయి. పన్ను మినహాయింపులూ ఉంటాయి.

మినహాయింపులు

సీనియర్ సిటిజన్ కార్డు ఉంటే 60 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 3లక్షల వరకు, 80 ఏళ్ల పైబడిన వారికి రూ. 5 లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయింపు లభిస్తుంది. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై పన్ను తగ్గింపు ఉంటుంది. సీనియర్ సిటిజన్లకు వడ్డీ రూపంలో వచ్చే ఆదాయంపై రూ. లక్ష వరకు టీడీఎస్ మినహాయింపు పరిమితి వర్తిస్తుంది. జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం వంటి వాటి కింద పెన్షన్ పొందవచ్చు. పలు విమానయాన సంస్థలు సీనియర్ సిటిజన్లకు ప్రయాణ చార్జీల్లో డిస్కౌంట్లు ఇస్తున్నాయి. సీనియర్ సిటిజన్లు బ్యాంకుల్లో తీసుకునే వ్యక్తిగత రుణాలకు 1 నుంచి 1.5 శాతం వడ్డీ రాయితీ లభిస్తుంది. సీనియర్ సిటిజన్ పొదుపు పథకం కింద 60 ఏళ్ల దాటిన వృద్ధులు చేసిన డిపాజిట్లపై బ్యాంకులు 8.2 శాతం వడ్డీ ఇస్తాయి.

ఉమ్మడి జిల్లాలో 19,800 కార్డులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల వరకు 19,800 సీనియర్ సిటిజన్ కార్డులు జారీ అయ్యాయి. హనుమకొండ జిల్లాలో 4,200 ఎస్‌సీసీలు జారీ అయ్యాయి. వరంగల్ జిల్లాలో 4,050, జనగామ జిల్లాలో 3,900, మహబూబాబాద్‌లో 4,350, ములుగులో 1,600, భూపాలపల్లి జిల్లాలో 1,700 కార్డులు జారీ అయ్యాయి.

సీనియర్ సిటిజన్స్ కార్డులు జారీ చేయాలి



వయోవృద్ధులకు ఎన్నో ప్రయోజనాలు అందించే సీనియర్ సిటిజన్ కార్డుల జారీని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం అన్యాయం. ఆధార్‌కార్డు ఎలాగూ ఉందన్న కారణంతో సీనియర్ సిటిజన్ కార్డు అవసరం లేదని నిలిపివేయడం సరికాదు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్డులు జారీ అవుతుండగా ఇక్కడ మాత్రం రద్దు చేయడం దారుణం. గతంలో మాదిరిగానే సీనియర్ సిటిజన్ కార్డులను జారీ చేయాలి. ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో ప్రభుత్వానికి వినతి పత్రాన్ని సమర్పించబోతున్నాం.

తేరాల యుగేంధర్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

వీధి కుక్కలపై స్పెషల్ డ్రైవ్

- వందకు పైగా కుక్కల పట్టివేత
- చింతగట్టు ఏబీసీ సెంటర్‌కు తరలింపు



వీధి కుక్కలను వాహనంలో తరలిస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకునేందుకు బల్దియా సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేశారు. ఒక్క రోజే సుమారు వందకుపైగా వీధి కుక్కలను పట్టుకుని చింతగట్టు ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)కు తరలించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పీక్కలు పీకుతున్న వీధి కుక్కలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. వెంటనే వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ స్పందించి బల్దియా వెటర్నరీ విభాగం అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. జీడబ్ల్యూఎంసీ వెటర్నరీ అధికారి గోపాల్‌రావు పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో స్వతంత్ర యానిమల్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది (బిహార్ యువకులు) ఉదయమే రంగంలోకి దిగారు. సుమారు 20మంది మూడు వాహనాలలో సంచరిస్తూ వీధి కుక్కలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సుమారు వందకుపైగా వీధి కుక్కలను పట్టుకున్నట్టు అధికారులు వెల్లడించారు. పట్టుకున్న వీధి కుక్కలను చింతగట్టులోని ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)కు తరలించారు. అయితే పట్టుకున్న వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసి పట్టుకున్న చోటనే వదిలివేస్తామని బల్దియా వెటర్నరీ డాక్టర్ గోపాల్‌రావు తెలిపారు. నగరంలో ఇకపై ఎక్కడైనా కోతులు, వీధి కుక్కల సమస్యలు ఉత్పన్నమైతే 97019 99701 సెల్ నెంబర్‌కు ఫోన్ చేయాలని గోపాల్‌రావు తెలిపారు.

సారథులెవరో!?

(5వ పేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లినట్లుగా ప్రచారం జరుగుతోంది. హనుమకొండ డీసీసీ అధ్యక్ష పదవి ఓసీలకు ఇస్తే, వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని కొండా దంపతులు పట్టుబడుతున్నారని సమాచారం. అలాగే దొంతి మాధవరెడ్డి ఈ సారి తన అనుచరులకే డీసీసీ పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నారని తెలుస్తోంది. దీంతో వరంగల్ డీసీసీ అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా జరుగనుందనే చర్చ సాగుతోంది.

ములుగుపై సూర్య.. జనగామపై ఝాన్సీ నజర్..

కాంగ్రెస్ అధ్యక్ష పదవులపై కీలక నేతలు దృష్టి పెట్టారు. 2028లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుండటంతో కొత్త నియోజకవర్గాలు, పాత నియోజకవర్గాల రిజర్వేషన్లు, సరిహద్దులు మారనుండటంతో డీసీసీ అధ్యక్ష పదవిలో ఉంటే ఎమ్మెల్యే సీటుకు కర్చీఫ్ వేసుకున్నట్లే అనే భావనలో కొందరు సీనియర్ నేతలు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా పినపాక అసెంబ్లీ స్థానం నుంచి తన వారసుడిని బరిలోకి దించాలని మంత్రి సీతక్క తీవ్ర ప్రయత్నాలు చేశారు. అప్పట్లో రాజకీయ సమీకరణలతో అవకాశం చేజారింది. అయితే వచ్చే అసెంబ్లీ నాటికి తన వారసుడిని క్రియాశీలక రాజకీయాల్లో ఉంచాలనే లక్ష్యంతో సీతక్క వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌ను కొనసాగించకుంటే సూర్యను డీసీసీ పీఠంపై కూర్చోపెట్టవచ్చుననే చర్చ జరుగుతోంది.

ఇక జనగామ డీసీసీ పదవిపై టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి నజర్ వేశారనే ప్రచారం ఉంది. మొదటి నుంచి జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండాలని ఝాన్సీరెడ్డి భావిస్తున్నారు. అయితే టీపీసీసీ నుంచి వైస్‌ప్రెసిడెంట్ పదవి వచ్చినప్పటికీ తనకు జడ్పీ చైర్మన్ లేదా డీసీసీ అధ్యక్ష పదవుల్లో ఏదో ఒకటి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లుగా సమాచారం. అయితే ప్రస్తుత అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కొనసాగించకపోతే ఝాన్సీరెడ్డికి డీసీసీ అవకాశం దక్కవచ్చుననే ప్రచారం జరుగుతోంది. మరోవైపు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారసుడిగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సైతం డీసీసీ అధ్యక్ష పదవిపై కన్నేశారనే చర్చ నెలకొంది.

మానుకోట, భూపాలపల్లి జిల్లా పగ్గాలెవ్వరికో..?

సీఎం సలహాదారుడు, వేం నరేందర్‌రెడ్డి సొంత జిల్లా మహబూబాబాద్‌లో డీసీసీ అధ్యక్ష పదవిపై పలువురు నేతలు కన్నేశారు. ప్రస్తుత అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చంద్రారెడ్డి మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లుగా సమాచారం. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌కు సేవలు అందిస్తున్న భరత్‌చంద్రారెడ్డికి ఏదైనా నామినేటెడ్ పదవిని ఇస్తే.. మరొకరికి డీసీసీ అధ్యక్ష పదవికి లైన్‌క్లియర్ అవుతుందని చర్చ జరుగుతోంది. అలాగే కాంగ్రెస్ యువనేత, వేం నరేందర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న వెన్నం శ్రీకాంత్‌రెడ్డి పేరు కూడా డీసీసీ అధ్యక్ష పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే జడ్పీ చైర్మన్‌గా శ్రీకాంత్‌రెడ్డికి అవకాశం ఇస్తే.. డీసీసీ రేసు నుంచి తప్పుకుంటారని సమాచారం. అలాగే బీసీలకు అవకాశం ఇవ్వాలని మహబూబాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య కోరుతున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు ముగ్గురు కూడా మానుకోట హస్తం పగ్గాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇక ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత జిల్లా భూపాలపల్లి డీసీసీ అధ్యక్ష పదవి ఉత్కంఠగా మారింది. ప్రస్తుత అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి మంత్రి శ్రీధర్‌బాబు అనుచరుడే. ప్రకాశ్‌రెడ్డికి కార్పొరేషన్ పదవి రావటంతో డీసీసీ అధ్యక్ష పదవికి శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు పేరు తెరపైకి వస్తోంది. అయితే ప్రస్తుత అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డితో పాటు గ్రంథాలయ చైర్మన్ పదవికి కూడా మంథని నియోజకవర్గానికే దక్కింది. మరోసారి డీసీసీ అధ్యక్ష పదవి కూడా శ్రీధర్‌బాబు నియోజకవర్గానికే దక్కితే, తమ పరిస్థితి ఏమిటని భూపాలపల్లి నియోజకవర్గ నేతలు ప్రశ్నిస్తున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ప్రధాన అనుచరుడిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి, మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ పేరు కూడా డీసీసీ అధ్యక్ష పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. అశోక్‌తో పాటు చల్లూరి మధు కూడా డీసీసీ పదవికి దరఖాస్తు చేయమని అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చినట్లుగా సమాచారం. అలాగే ప్రముఖ వ్యాపారి ఎస్.సంపత్‌రావు (ఎస్ఎస్ఆర్) పేరును కూడా అధిష్ఠానం పరిశీలిస్తోందనే చర్చ జరుగుతోంది.

కరాటేలో అక్కాతమ్ముళ్ల ప్రతిభ

» గిన్నిస్ బుక్‌లో ఆసియా, ఇర్ఫాన్‌కు చోటు
» అభినందించిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఆసియా, ఇర్ఫాను అభినందిస్తున్న ఎంపీ కడియం కావ్య

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'ద వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఎస్ఐబీఈటీ కళాశాల మైదానంలో నిర్వహించిన కరాటే ప్రదర్శనలో ఓరుగల్లులోని ఒకే కుటుంబానికి చెందిన అక్క, తమ్ముడు ఎం.డి. ఆసియా, ఎం.డి. ఇర్ఫాన్‌లు అత్తుత్యమ ప్రతిభ కనబర్చి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని సుమారు 4గంటలుగా ఏకధాటిగా పంచెస్, కటాస్‌తో పాటు కరాటేలో ప్రదర్శనలు చేయడంతో గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ద వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాస్టర్ బాలమురుగన్ పర్యవేక్షణలో జరిగిన ప్రదర్శనకు లండన్ దేశానికి చెందిన గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ అధికారి రిషినాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ క్రమంలో శుక్రవారం ఆసియా, ఇర్ఫాన్‌లు తమ కుటుంబసభ్యులతో హనుమకొండలోని వరంగల్ ఎంపీ కడియం కావ్యను, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆసియా, ఇర్ఫాన్‌కు పూల బొకేలు అందించి, శాలువాలతో సన్మానించారు. కఠోర శ్రమ ద్వారా ఆసియా, ఇర్ఫాన్‌లు ఘనత సాధించి జిల్లా, రాష్ట్రకీర్తిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. కాగా, వరంగల్ కొత్తవాడకు చెందిన ఆసియా ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ మైనారిటీ గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సం చదువుతోంది. అదే విధంగా ఇర్ఫాన్ కొత్తవాడలోని ప్రైవేటు హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు ఆసియా, ఇర్ఫాన్ తల్లిదండ్రులు యాస్మిన్ సుల్తానా-నయీంపాషా, కరాటే మాస్టర్లు, సీనియర్ క్రీడాకారులు, హర్షం వ్యక్తం చేశారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

వివరాలు వెల్లడించిన ఏసీపీ సతీష్‌బాబు



నిందితుడి అరెస్టు చూపిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులు, మరో మైనర్ విద్యార్థితో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేశామని పరకాల ఏసీపీ సతీష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయం ఆత్మకూరు మండలం కటాక్షపురం గ్రామంలోని చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో పోలీసులను చూసి ద్విచక్రవాహనంపై పారిపోతుండగా సీఐ సంతోష్, హెడ్‌కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌లు వెంబడించగా పాశం ప్రణీత్, ఇంటర్ విద్యార్థిని పట్టుకున్నారు. ఇందులో మరో వ్యక్తి మున్నీసాయి తప్పించుకుని పారిపోయాడన్నారు. గ్రామస్థుల సమక్షంలో విచారించగా మండలంలోని గూడెప్పాడ్ రామాలయంలో చోరీకి పాల్పడి నగదుతో పాటు వెండి జంజరం, రెండు బంగారు పుస్తెలు దొంగిలించినట్టు, అలాగే ముగ్గురు కలిసి దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద గల వైన్స్ వెంటిలేటర్‌కు ఉన్న గ్రిల్స్‌ను పగులగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ. 12వేల నగదు, చిల్లరతో పాటు 10 మద్యం బాటిళ్లను దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారని ఏసీపీ తెలిపారు. మద్యంబాటిళ్లను తాగినట్లు వారు అంగీకరించారని ఏసీపీ తెలిపారు. గూడెప్పాడ్ రామాలయంలో జరిగిన దొంగతనం చేసిన వాటిలో రూ.1000 నగదు, వెండి జంజరం, రెండు బంగారు పుస్తెలను ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

ఇందులో పాశం ప్రణీత్‌ది హనుమకొండ జిల్లా గోపాల్‌పూర్‌కు చెందిన వ్యక్తి, కాగా, ఇంటర్ విద్యార్థి భీమారంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు, పారిపోయిన యువకుడిని త్వరలో అరెస్టు చేస్తామని ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు కుమారస్వామి, శ్రీనివాస్‌లను పరకాల ఏసీపీ సతీష్‌బాబు అభినందించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు సీఐ సంతోష్, ఎస్సైలు సతీష్, తిరుపతి, కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్ఞానంతో అర్థం చేసుకుంటేనే నిజమైన విజ్ఞానం

» భారత లోహ పరిశోధన సంస్థ గౌరవ సభ్యుడు డాక్టర్ సనక్ మిశ్రా
» వరంగల్ నిట్‌లో ఘనంగా 67వ వ్యవస్థాపక దినోత్సవం



డాక్టర్ సనక్ మిశ్రాకు జ్ఞాపికను అందిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాన్ని లోతుగా అర్థం చేసుకోవడం ద్వారానే నిజమైన విజ్ఞానాన్ని పొందగలుతామని, మేధోమథనం సాధ్యమవుతుందని భారత లోహ పరిశోధనా సంస్థ (ఐఐఎం) గౌరవ సభ్యుడు డ్టార్ సనక్ మిశ్రా అన్నారు. శుక్రవారం వరంగల్ నిట్‌లో 67వ వ్యవస్థాపక దినోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మిశ్రా.. భారత ఉపఖండంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా కూడా జ్ఞానం ఎలా పరిణామం చెందిందో వివరించారు. స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా గవర్నింగ్ బోర్డు సభ్యుడు, రూర్కెల స్టీల్ ప్లాంట్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ కూడా డాక్టర్ సనక్ మిశ్రా 'ది హైపోతిసిస్ ఆఫ్ ది హైయారీక ఆఫ్ నాలెడ్జ్' అనే అంశంపై వ్యవస్థాపక ప్రసంగం చేశారు. వరంగల్ నిట్ తన 67 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక మైలురాళ్ల దాటి దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థగా తనదైన ప్రత్యేకతను నిలబెట్టుకున్నదన్నారు.

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి నిట్ అసాధారణ ప్రయాణాన్ని వివరించారు. మూడు అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలతో ప్రారంభమైన ఈ విద్యా సంస్థ.. నేడు దేశంలోనే అగ్రగామి సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. ప్రస్తుతం నిట్‌లో 11 బీటెక్, 26 ఎంటెక్, 5 ఎంఎస్‌సీ, ఎంసీఏ, ఎంబీఏ, బీఎస్‌సి బీఎడ్, సమగ్ర ఎంఎస్‌సీ కోర్సులు బోధిస్తున్నట్టు తెలిపారు. తాజాగా పునర్విచించిన పాఠ్యక్రమం, స్వయం అభ్యాసం, ఆవిష్కరణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణ్యమైన నైపుణ్యాల పెంపుపై దృష్టిసారించినట్టు తెలిపారు. 8వేలు మంది విద్యార్థులు, 700 మంది అధ్యాపకులు, సిబ్బంది, అలాగే 42,600 మందికిపైగా పూర్వ విద్యార్థులతో బలమైన నెట్‌వర్క్‌ను నిట్ కలిగి ఉందన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో అధ్యాపకులు 884 జర్నల్ పేపర్లు, 350 కాన్ఫరెన్స్ పేపర్లు, 127 పుస్తక అధ్యాయాలు ప్రచురించి, 95 జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నదని, అలాగే వివిధ పరిశోధనలపై 25 పేటెంట్లు పొందిందని పేర్కొన్నారు. నిట్‌కు రూ.45.65కోట్ల విలువైన పరిశోధనా నిధులు అందాయని చెప్పారు. నిట్‌లో 81.3 శాతం ప్లేస్‌మెంట్ రేటు సాధించిందని, అత్యధిక వార్షిక ప్యాకేజీ రూ.64లక్షలుగా నమోదైందని, ఆరు బీటెక్ కార్యక్రమాలు జూన్ 2028 వరకు ఎన్‌బీఏ టియర్-1 గుర్తింపు పొందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వరంగల్, హైదరాబాద్ అలుమ్ని చాప్టర్ల సభ్యులు పాల్గొన్నారు.

వేయి స్తంభాల గుడిలో సంకటహర చతుర్థి

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో శుక్రవారం సాయంత్రం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఉత్తిష్ఠ గణపతికి మూలమంత్ర యుక్తంగా పంచామృతాభిషేకం, నారికేళ జలాభిషేకం, కుంకుమ హరిద్రా లేపన అభిషేకం నిర్వహించారు. జిల్లేడు దండలతో అర్చనాది కార్యక్రమాలు నిర్వర్తించారు. నివేదన నీరాజన మంత్ర పుష్పముల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైదిక బృందం గంగు ఉపేంద్రశర్మ, పెండ్యాల సందీప్ శర్మ, గంగు మణికంఠ శర్మ, ప్రణవ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ బంగారం.!

- తులం రూ.1.27 లక్షలు
- సగానికి పడిపోయిన విక్రయాలు
- పెరుగుతున్న ధరలతో ధనవంతుల్లో ఉత్సాహం
- మధ్య తరగతి వర్గాల్లో కలవరం

కేసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ద్రవ్యంగా పేరున్న బంగారం ధర రోజురోజుకూ పెరుగుతూ అంతనంత ఎత్తుకు వెళ్లి మరింత ఎగబాకుతుండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కలవరపడుతున్నారు. నిత్యం బంగారం ధర పెరుగుతూ రోజుకో రికార్డు నెలకొల్పుతోంది. ప్రస్తుతం తులం బిస్కెట్ బంగారం రూ.1.27లక్షలుగా ఉంది. గత నాలుగు నెలల క్రితం రూ.70వేల నుంచి రూ.80వేల వరకు ఉన్న బంగారం ధర మూడు నెలలుగా క్రమంగా పెరుగుతోంది. ఆగస్టు రెండోవారంలో తులం బంగారం ధర రూ.1లక్ష దాటడంతో అంతా అవాక్కయ్యారు. ఆ తర్వాత గత 20 రోజులుగా వేగంగా పెరుగుతూ తాజాగా తులం బంగారం రూ.1.27లక్షలకు చేరింది. అంతర్జాతీయ ఆర్థిక అస్థిరత, యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలతోపాటు పలు కారణాలతో బంగారం ధరలు వేగంగా పెరుగుతున్నట్లు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుందనే అంచనాలతో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా చూసే వారిలో ఈ ధరల పెరుగుదల మరింత ఉత్సాహాన్ని పెంచుతూ కొనుగోలు చేస్తున్నారు. ధనవంతులు బంగారం ఖరీదులు మరింత చేస్తుండగా పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి వర్గాలు పసిడిని కొనడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.



గ్రామీణుల్లో కలవరం..

గ్రామీణ ప్రాంతాల్లో పంట ఉత్పత్తులు విక్రయించిన అనంతరం పెట్టుబడులు పోను మిగిలిన సొమ్ముతో చాలా మంది రైతులు తమ కుటుంబీకుల కోసం బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేవారు. సుస్థిర ద్రవ్యత్వం కలిగి ఆపద సమయంలో ఆదుకుంటుందని, భవిష్యత్తు అవసరాల కోసం బంగారం కొనిపెట్టుకోవడం చాలా మంది రైతులు, గిరిజన కుటుంబాల్లో ఏటా జరుగుతుండేది. గతంలో తులం బంగారం కొనగలిగే స్థోమత ఉన్నవారు ఇప్పుడు రెండు, మూడు గ్రాములకే పరిమితమవుతున్నారు. బంగారం ధర కొద్దిరోజులపాటు స్థిరంగా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని బంగారం షాపుల్లో పెళ్లిళ్ల, ఇతర శుభకార్యాలకు ఆభరణాలను ఆర్డరు ఇచ్చి మొత్తం ధరలో 10 నుంచి 30శాతం అడ్వాన్సు ఇచ్చేవారు.

తాజా ధరల అనిశ్చితి నేపథ్యంలో ఆభరణాల విలువలో 85 నుంచి 90శాతం అడ్వాన్సు ఇస్తేనే తయారు చేసే పరిస్థితి నెలకొందని పలువురు బంగారం షాపుల యజమానులు చెబుతున్నారు. ఏదేమైనా ధనవంతులు మరింత పెరుగుతుందని ఆశాభావంతో ఉత్సాహంగా బంగారం కొనుగోలు చేస్తుండగా గ్రామీణ ప్రాంతాల్లో మధ్యతరగతి వర్గాల్లో అమ్మాయి పెళ్లిళ్ల చేసే వారు బంగారం ధరలతో గుబులు చెందుతున్నారు.

కొనేటట్లు లేదు...

- కొమ్ము రజని, కేసముద్రం



బంగారం ధర వింటేనే గుండెగుబేలుమంటోంది. తులం రూ.1లక్ష అంటే ఎక్కువ అనుకున్నాం. మరింత పెరుగుతూ రూ.1.27లక్షలతో మధ్యతరగతి వర్గాలకు బంగారం అందనంత ఎత్తుకు చేరింది. పెళ్లిళ్ల చేసే వారు బంగారం కొనుగోళ్లకే అధికంగా వెచ్చించాల్సివస్తోంది.

ధర అడిగి.. లెక్క చేసుకొని వెళ్తున్నారు..

- వేణుగోపాలాచారి, బంగారం షాపు యజమాని, కేసముద్రం స్టేషన్



బంగారం ధర అడిగి...లెక్క చేసుకొని అంత డబ్బు పెట్టలేక కొనకుండా వెళుతున్నారు. పెరిగిన ధరలతో గిరాకీ పూర్తిగా పడిపోయింది. శుభకార్యాలకు వెండిపట్టీలు, బంగారు కమ్మలు పెట్టినవారు ధర అడిగి అంతపెట్టలేమని, నగదును కట్నంగా చదివిస్తాం అంటూ వెళ్లిపోతున్నారు. పెళ్లిళ్లకు ఐదు తులాలు కొనేవారు రెండు తులం, నాలుగైదు వస్తువులు చేయించే వారు ఒకటి, రెండు తయారు చేయించుకుంటున్నారు.

బతుకమ్మ బండ భూమిని ఆక్రమిస్తే చర్యలు

వడ్డెపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని బతుకమ్మ బండ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హనుమకొండ తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. హనుమకొండ వడ్డెపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 690లో 33 గుంటల ప్రభుత్వ భూమి (బతుకమ్మ బండ) ఉంది. ఈ భూమిపై 4 రోజులుగా వివాదం రాజుకుంది. వడ్డెపల్లి గ్రామ ప్రజల ఫిర్యాదు మేరకు శుక్రవారం హనుమకొండ తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, మండల గిర్ధావర్ దశరథరాంరెడ్డి, సర్వేయర్, ఇతర అధికారులతో కలిసి భూమిని సందర్శించారు. సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఎక్కడైనా ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అన్నారు.


బతుకమ్మ బండ భూమికి హద్దులు ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి

42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి

పీఏఎస్ఎస్ అధ్యక్షుడు సంగాని మల్లేశ్వర్

కేయూ క్యాంపస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పూలే ఆశయ సాధన సమితి (పాస్) అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూ దూరవిద్య కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహనికి 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని వినతిపత్రాన్ని అందచేసి మాట్లాడారు. జీవో 9పై రెండు రోజుల వాదాలు హైకోర్టులో జరిగాయని చెప్పారు. స్టేతో బీసీలకు రాజ్యాధికారం దూరం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల రిజర్వేషన్లకు బీజేపీ, రాష్ట్ర గవర్నర్‌లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్ జిల్లా ఉపాధ్యక్షుడు శాస్త్రి, డాక్టర్ మల్లయ్య, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, రుద్రోజు శ్యాంసుందర్, సత్యనారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


కేయూ దూరవిద్య కేంద్రం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మల్లేశ్వర్, శ్రీనివాస్ తదితరులు

బీసీలు రాజ్యాధికారంలోకి వస్తారనే భయం

హనుమకొండ టౌన్: బీసీలు రాజ్యాధికారంలోకి వస్తారనే భయం అగ్రవర్ణాలకు పట్టుకుందని కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు రాజ్యాధికారంలోకి వస్తారని అగ్రవర్ణాల నేతలు 42 శాతం రిజర్వేషన్లకు అడ్డుపడుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్ర నాయకులు అడ్డుపడ్డా తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా సాధించామో ఇప్పుడు బీసీలంతా సంఘటితమై 42 శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు. అగ్రవర్ణాలు తమను ఇలానే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే వారిని అడ్డుకోవడానికి ఎంత సమయం పట్టదని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీల పక్షాన ఉంటాయా..? బీసీల వ్యతిరేకుల పక్షాన ఉంటారో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

హనుమకొండ చౌరస్తా: బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బీసీలకు జీవో ద్వారా చట్టబద్ధత కల్పించాకే బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పిస్తామని కామారెడ్డిలో ఎన్నికల ముందు హామీ ఇచ్చి మరీ నేడు ఎందుకు చట్టబద్ధత కల్పించడం లేదో చెప్పాల్సిన అవసరం ఉందని విజేందర్ ప్రశ్నించారు. బీసీ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా జీవోను ఎందుకు తెచ్చారని హైకోర్టు ప్రశ్నిస్తే ప్రభుత్వం దగ్గర సమాధానం లేక పోవడం ఎంత వరకు సమంజసమని విమర్శించారు. ఈ వ్యవహారం అంతా త్వరలో బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గట్టెక్కేందుకు, తెలంగాణ బీసీ సమాజాన్ని మోసం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుతున్న ఒక డ్రామా అని తెలిపారు. బీసీలకు 42శాతం జీవో అనేది గాలిలో దీపం లాంటిదని ఇది ఎక్కువ రోజులు నిలకడగా ఉండబోదన్నారు. తెలంగాణలో మహారాష్ట్ర పరిస్థితులు నెలకొనే పరిస్థితులు ఉన్నాయని, ఒక వేళ అలాంటి పరిస్థితి వస్తే దానికి సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించి తన సీఎం పదవికి రాజీనామా చేయాల్సి వస్తుందని ప్రకటనలో విజేందర్ హెచ్చరించారు.


పీసీఎండీ నిర్మలా రాజారాంనకు వినతి పత్రం ఇస్తున్న సంఘ్ నాయకులు

రైల్వే ఆస్పత్రిని సందర్శించిన పీసీఎండీ

కాజీపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే ఆస్పత్రిని శుక్రవారం రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారాం సందర్శించారు. ఆస్పత్రి సీనియర్ ఎంఎస్ డాక్టర్ నిరంజన్ బృందం, ఇతర సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలు, వైద్యుల కొరత, బిల్డింగ్ ఇతరత్రా సదుపాయాలు, సమస్యలపై కూలంకశంగా అడిగి తెలుసుకున్నారు. వైద్యుల కొరత, ఆస్పత్రికి కావాల్సిన సదుపాయాలపై డాక్టర్ నిరంజన్ పీసీఎండీకి వివరించారు. అనంతరం ఆస్పత్రి కాంపౌండ్‌లో మొక్కలు నాటారు. ఎంప్లాయిస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ సాదినేని వెంకటనారాయణ, రైల్వే ఎస్సీ, ఎస్టీ కమిటీ, రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పీసీఎండీ నిర్మలా రాజారాంకు వినతిపత్రాలు సమర్పించారు. వినతి పత్రంలో కాజీపేట రైల్వే ఆస్పత్రికి హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మెడికోవర్ ఆస్పత్రికి రిఫరల్ సౌకర్యం కల్పించాలని, అంబులెన్స్ సౌకర్యంతో పాటు ప్రత్యేక కంటి వైద్యుడిని ఏర్పాటు చేయాలని, డీజిల్ కాలనీ ఆసుపత్రికి వైద్యులను పెంచాలని, మెరుగైన ప్రసూతి వైద్య సదుపాయం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘ్ నాయకులు పుల్ల అభిలాష్, మధు, అన్ని బ్రాంచ్‌ల సెక్రెటరీలు, రైల్వే కార్మిక నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి బీమా చెక్కు అందజేత

వరంగల్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గతేడాది మే 10న మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ హతిరామ్ భార్య కీర్తికి సీపీ సన్‌ప్రీత్ సింగ్ రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును శుక్రవారం అందజేశారు. ప్రభుత్వం తరుపున అందజేయాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో అందించాలని అధికారులను సీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సూపరింటెండెంట్ యాకూబ్ బాబా పాల్గొన్నారు.

రిటైర్డ్ రైల్వే పెన్షనర్ల ధర్నా


కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైల్వే పెన్షనర్లు

కాజీపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట శుక్రవారం రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాజీపేట పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల సంఘమయ్య మాట్లాడారు. ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్ రైల్వే మెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల సమస్యలపై పెద్దఎత్తున ధర్నా చేస్తున్నారని, వారికి సంఘీభావంగా కాజీపేటలో ఈ రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్, ఆల్ బ్రాంచీలు ధర్నా చేపట్టినట్లు చెప్పారు. పెన్షన్ నిబంధనలు 2025 బిల్లును వెనక్కి తీసుకోవాలని, 8వ పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు రైల్వేలో రాయితీ సౌకర్యాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

వ్యాస రచన పోటీలు


పింగిళి కళాశాలలోమాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుహాసిని

వడ్డెపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 'యువత మానసిక ఆరోగ్యంపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థినులు వ్యాస రచనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని, లిటరరీ క్లబ్ కోఆర్డినేటర్ రామా రత్నమాల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మమత, కవిత, సుభాషిని, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక దృక్పథం కలిగి ఉండాలి

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని కేడీసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ)లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన అనంతరం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీనాథ్, అధ్యాపకులు శ్రీనివాస్, చిన్న, సమత, సీతారాం, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెరగాలి

పెద్దకోవెలకు సుదీర్ఘ చరిత్ర : అష్టాక్షరి జీయర్‌స్వామి


పెద్ద కోవెలలో అనుగ్రహ భాషణం చేస్తున్న అష్టాక్షరి జీయర్ స్వామి

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం మరింతగా పెరగాలని, భక్తి భావనతోనే సమాజంలో మానసిక శాంతి నెలకొంటుందని అష్టాక్షరి పీఠ వ్యవస్థాపకుడు త్రిదండి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి అన్నారు. వరంగల్ నగర పర్యటనలో భాగంగా గురువారం రాత్రి ఆయన హనుమకొండ బ్రాహ్మణవాడలోని సుదీర్ఘ చరిత్ర కలిగిన రామానుజకూటమి, శ్రీ రంగనాథ ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. తాను సన్యాసం స్వీకరించకముందు రఘునాథాచార్య స్వామితో కలిసి ఈ ఆలయాన్ని సందర్శించానన్నారు. కాకతీయుల కాలంలో భగవత్ రామానుజులు ఈ ఆలయాన్ని స్థాపించేశారని చెన్నైలోని అడయార్ గ్రంథాలయంలోని గ్రంథంలో ఉందన్న విషయాన్ని ఉద్ఘాటించారు. ఈ ఆలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉందని, ఈ ప్రాంతంలో ఉండడం ఓరుగల్లుకు ఒక అదృష్టం అన్నారు. జీర్ణ ఆలయాల ఉద్ధరణే ప్రాధాన్యంగా తమ అష్టాక్షరీ పీఠం కృషి చేస్తున్నదన్నారు.

స్వామివారి వెంట సత్సంప్రదాయ కార్యదర్శి, ఆధ్యాత్మిక ప్రవచకుడు సముద్రాల శఠగోపాలాచార్య ఉన్నారు. పెద్ద కోవెలకు వచ్చిన స్వామికి ఆలయ ప్రధానార్చకుడు కలకోట రాఘవచార్య, నర్సింహచార్య, వేదపండితులు గుదిమళ్ల విజయకుమారాచార్య, యతి రాజాచార్య, శేషభట్టర్ ఆళ్వార్ స్వామి తదితరులు పూర్ణకుంభంతో స్వాగతించారు. డాక్టర్ పాంచాలరాయ్, రేపల్లి వెంకటేశ్వర స్వామి, సుమతి వరదారెడ్డి, అనేక మంది ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధ్యాపకురాలు పద్మజకు సన్మానం


పద్మజను సన్మానిస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలు కె.పద్మజను శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ భిక్షాల నేతృత్వంలో సన్మానించారు. ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా అమరావతి ఇంటర్నేషనల్ మల్టీ డిసిప్లనరీ రీసెర్చ్ ఫౌండేషన్ పద్మజకు ఇండో ఆసియాన్ అలంటూరి డిస్టిబ్యూషన్ ఫ్యాకల్టీ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పద్మను ఇంజనీరింగ్ కళాశాలలో సన్మానించారు. అధ్యాపకులు వేణుగోపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ వీరన్ననాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

మడికొండలో కాన్షీరాం వర్ధంతి

మడికొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బహుజన సమాజ్ పార్టీ అధినేత దివంగత కాన్షీరాం వర్ధంతిని శుక్రవారం మడికొండలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ స్టేట్ కోఆర్డినేటర్ దాగిళ్ల దయానందరావు ముఖ్య అతిథిగా హాజరై కాన్షీరాం, బీఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నేతలు పాల్గొన్నారు.


కాన్షీరాం, అంబేద్కర్, పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బి. ప్రశాంత్

కేయూ క్యాంపస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, నిరుద్యోగ యువత చేతుల్లో కాంగ్రెస్‌పార్టీకి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ హెచ్చరించారు. శుక్రవారం కేయూ క్యాంపస్‌లోని మెయిన్ లైబ్రరీ ఎదుట బీఆర్ఎస్వీ నేతృత్వంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలతోకూడిన బాకీ కార్డులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బైరపాక ప్రశాంత్ మాట్లాడుతూ.. అధికారం కోసం అచరణకు సాధ్యం కానీ హామీలిచ్చి కాంగ్రెస్ మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలు యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేశారా ? అని నిలదీశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ ఏమైందన్నారు. 20 వేల డీఎస్సీ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. జాబ్ క్యాలెండర్ లేదన్నారు.


బాకీ కార్డులను చూపుతున్న బైరపాక ప్రశాంత్ తదితరులు

కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్ల ఉద్యోగాలనే భర్తీ చేసి నియామకాల పత్రాలను ఇచ్చారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు రెండేళ్లుగా రూ.8కోట్లు బాకీ పడ్డారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థుల జీవితాలురోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖకు మంత్రిగా ఉండి సమస్యలను పరిష్కారించడం లేదన్నారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. బీఆర్ఎస్వీ నేతలు జెట్టి రాజేందర్, గొల్లపల్లి వీరాస్వామి, కొనకటి ప్రశాంత్, పస్తం అనిల్, పిన్నింటి విజయ్‌కుమార్, రాసూరి రాజేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, చైతన్యపురి కాలనీలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని వాటర్ ట్యాంక్ బ్యాక్‌సైడ్, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ బ్యాక్‌సైడ్ ఏరియాలో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, కడిపికొండ, వడ్డెపల్లి, సోమిడి, మడికొండ, రాంపూర్, టేకులగూడెం, న్యూశాయంపేట సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిని శిక్షించాలి


- నిరసనగా ఈ నెల 13న చలో కలెక్టరేట్
- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సోమన్న


సమావేశంలో మాట్లాడుతున్న కందుకూరి సోమన్న మాదిగ

హనుమకొండ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్‌పై దాడి చేసిన లాయర్‌పై దేశ ద్రోహం కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమన్న మాదిగ మాట్లాడుతూ.. ఒక దళిత బిడ్డ దేశ అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నందున అగ్రకులాలు జీర్ణించుకోలేదని, తప్పుడు కారణాలు చూపి దాడి చేశారని అన్నారు. ఈ దాడిని నిరసిస్తూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 13న చలో కలెక్టరేట్ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వందలాదిగా తరలివచ్చి గవాయ్‌కి మద్దతుగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, నాయకులు బండారి సురేందర్, గంగారపు శ్రీనివాస్, వెంకటస్వామి, బొక్కల నారాయణ, శాంతిసాగర్, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో వైట్ కోట్ సెర్మనీ

వరంగల్ మెడికల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో 2025-26 విద్యా సంవత్సరానికి చెందిన ఎంబీబీఎస్ కొత్త విద్యార్థుల కోసం వైట్ కోట్ సెర్మనీ శుక్రవారం ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య సుంకరనేని అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ వీఎల్ఎన్.రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వైద్య వృత్తి ప్రాధాన్యత, సేవా దృక్పథం, నైతిక విలువలపై విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగం అందించారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వైట్ కోట్ సెర్మనీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎస్సార్‌యూలో ఘనంగా ఫ్రెషర్స్ డే

అలరించిన విద్యార్థుల నృత్యాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ వి.మహేష్ తదితరులు

హసన్‌పర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం-25 పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, రిజిస్ట్రార్ పి.వెంకటరమణరావు, విద్యార్థి సంఘం డీన్ డాక్టర్ సుధాకర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయాల్లో ఎస్సార్ యూనివర్సిటీ ఒకటన్నారు. విద్యార్థులు ఈ వేదికను తమ ప్రతిభను వికసింపజేయడానికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లబ్బులు, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ద్వారా తమ వ్యక్తిత్వ వికాసానికి ప్రయత్నించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన డ్యాన్స్, మ్యూజిక్, ఫ్యాషన్ షోస్ వంటి కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వివిధ క్లబ్బులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటో ఎక్స్‌పో విద్యార్థుల ఎంతగానో ఆకట్టుకుంది. రంగురంగుల ఇండో వెస్ట్రన్ నృత్యాలు, క్లాసికల్ సింగింగ్, ఫ్యాషన్ ర్యాంప్ వాక్ ప్రేక్షకులను అలరించాయి. అదనంగా విద్యార్థులు షర్ట్ పేయింటింగ్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్ వంటి సృజనాత్మక పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. సాయంత్రం ప్రత్యేక ఆకర్షణగా టాలీవుడ్ ప్లేబ్యాక్ సింగర్ దమిని బట్ల, గాయకుడు అర్జున్ విజయ్ సంగీత విభావరితో అలరించారు. 'కర్ణం గారి వీధి' సినిమా బృందం కూడా ప్రచార కార్యక్రమం కోసం హాజరై విద్యార్థులతో ముచ్చటించి విద్యార్థుల అభిప్రాయాలలో పాలుపంచుకున్నారు.

5 తులాల బంగారు గొలుసు అపహరణ

కాజీపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడల్లోంచి ఓ యువకుడు బైక్‌పై వచ్చి చైన్‌స్నాచింగ్ చేశారు. క్షణాల్లో జరిగిన ఈ చోరీ స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట డీజిల్‌కాలనీ ఆర్చ్ వద్ద పూల లలిత అనే మహిళ కొంతకాలంగా ఓ కిరాణం షాపు నిర్వహిస్తోంది. శుక్రవారం షాపు మూసి భవానీనగర్‌లోని తన ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో మెయిన్‌రోడ్ నుంచి గల్లీలోకి తన ఇంటికి సమీపంలోకి రాగానే బైక్‌పై మాస్క్ పెట్టుకున్న ఓ యువకుడు వచ్చి లలిత మెడల్లోంచి 5 తులాల బంగారు చైన్ లాక్కొని పారిపోయాడు. మహిళ కేకలేసేలోపే నిందితుడు క్షణాల్లో మాయమయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి, ఎస్సై నవీన్‌కుమార్‌లు ఘటనాస్థలికి వెళ్లి బాధిత మహిళతో మాట్లాడారు. చోరీ జరిగిన తీరు ఆరా తీశారు పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నారు. బాధితురాలు లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన బంగారం విలువ రూ.5 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.



కొందరు నియంతృత్వానికి లొంగుతారు. మరి కొందరు ఎదురు తిరుగుతారు. అంక్షలు పెరుగుతున్న కొలది వారి పోరాటం మరింత బలపడుతుంది. అలాంటి వ్యక్తే **మరియా కొరీనా మచాడో**. వెనెజువెలాలో ప్రజాస్వామ హక్కుల కోసం పోరాడుతున్న యోధురాలు. వెనెజువెల నాయకుడు నికలోస్ మాడ్యూరో నియంతృత్వానికి వ్యతిరేకంగా ఆమె చేస్తున్న పోరాటానికి బహుమానంగా నోబెల్ శాంతి బహుమతి ఆమెను వరించింది.

అజ్ఞాతవాసికి శాంతి బహుమతి!

58 ఏళ్ల మచాడో గత 15 నెలలుగా ఎక్కడ ఉందో.. ఏ ప్రాంతంలో తలదాచుకుంటుందో ఎవరికీ తెలియదు. ఆమె ప్రజలను నేరుగా కలిసింది కూడా లేదు. కానీ ఆమె వెనెజువెలలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి ప్రపంచవ్యాప్తంగా ప్రజల దగ్గర నుంచి మద్దతు లభిస్తోంది. వృత్తిపరంగా ఇండస్ట్రీయల్ ఇంజనీర్ అయిన మచాడోపై ప్రభుత్వం అనేక రకాలుగా ఒత్తిడి పెట్టింది. ఆ ఒత్తిడిని తట్టుకోలేక ఆమె భర్త, ఇద్దరు పిల్లలు, తల్లి అందరూ విదేశాలలో తలదాచుకోవాల్సి వచ్చింది. కానీ మచాడో మాత్రం వెనెజువెలలోనే ఉన్నానంటారు. తన కుటుంబానికి ప్రభుత్వం హాని చేస్తుందనే ఆలోచన మచాడోను ముందు నుంచి వేధిస్తూనే వచ్చింది. "2012లో నేను ఒక ఎంపీని. నేషనల్ అసెంబ్లీలో అప్పటి నియంత హ్యూగో చెవిజ్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నా. హఠాత్తుగా 'మా అమ్మాయి అన్నా ఎక్కుడుందనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన రాగానే నాలో భయం మొదలయింది. మాట్లాడటం అయిపోయిన వెంటనే ఇంటికి వెళ్లిపోయా. అన్నాతో- 'నువ్వు ఇక్కడ ఉండద్దు. వేరే దేశానికి వెళ్లిపో!' అని చెప్పా. ప్రజా పోరాటాలలో ఉండాలంటే మంచి అమ్మగా నా బాధ్యతలు నిర్వర్తించలేనని ఆ రోజే గుర్తించాను" అంటారు మాచాడో.

అందమైన బాల్యం

మాచాడో తల్లి మానసిక వైద్యురాలు. తండ్రి ఒక పెద్ద వాణిజ్యవేత్త. "నాకు మా నాన్న అంటే చాలా ఇష్టం. ఆయన బిజినెస్‌లు చూసుకోవటానికి కొడుకులే అక్కర లేదు అని నిరూపించాలని చిన్నప్పటి నుంచి ఉండేది. అందుకే నేను ఇండస్ట్రీయల్ ఇంజినీరింగ్ చదివాను" అంటారు మాచాడో. చిన్నప్పుడు ఎప్పుడూ రాజకీయాలలోకి రావాలని ఆమె అనుకోలేదు. "బాగా బిజినెస్ చేసి.. ఎక్కువ మందికి ఉద్యోగాలు ఇవ్వాలని అనుకొనేదాన్ని" అంటారామె! కాలేజీలో చదువుతున్న సమయంలో సమాజంలో ఉన్న అసమానతలను ఆమె ప్రత్యక్షంగా చూశారు. "నేను ఒక మురికివాడలో పిల్లలకు పాఠాలు చెప్పటానికి వెళ్లేదాన్ని. వాళ్లను చూసిన తర్వాత నాకు గిల్టీ కలిగింది. వాళ్ల గురించి నేను ఏమి చేయటం లేదనే ఆలోచన కలచివేయటం మొదలెట్టింది" అంటారు మాచాడో. చదువు పూర్తయిపోయిన తర్వాత తండ్రి స్టీలు ఫ్యాక్టరీలో చేరారు. అయితే అక్కడ ఆమెకు వెనెజువెలాలో ఉన్న రాజకీయ అస్థిరత గురించి తెలిసింది. "రాజకీయాల గురించి.. రాజకీయనాయకుల గురించి ఫిర్యాదులు చేయటం కాదు. రాజకీయాల్లో చేరి వాటిని ఎలా మార్చాలో ఆలోచించాలి" అనే ఉద్దేశంతో సుమేట్ అనే ఒక సంస్థను ప్రారంభించారు. 2010లో జరిగిన ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేశారు.



తొలి అడుగులు

ఆ సమయంలో మచాడో ఎవరికీ తెలియదు. ఆమె గెలుస్తుందని కూడా ఎవరూ అనుకోలేదు. "లాటిన్ అమెరికా దేశాల్లో పితృస్వామ్య వ్యవస్థ చాలా బలంగా ఉంటుంది. నువ్వు అమ్మాయివి.. నువ్వు ఇంజినీర్‌వి.. నీకు డబ్బులు ఉన్నాయి.. నువ్వు ఎన్నికల్లో ఎలా గెలుస్తావు?" అని చాలా మంది ఆమెపై విమర్శల వర్షం కురిపించేవారు. కానీ అందరిని ఆశ్చర్యపరుస్తూ ఆమె భారీ మెజారిటీతో గెలిచారు. చెవెజ్‌కు వ్యతిరేకంగా ఆమె చేసిన ఉపన్యాసాలు ప్రజలందరినీ ఆకట్టుకొనేవి. 2013లో చెవెజ్ మరణించిన తర్వాత మెడ్యూరో అధికారంలోకి వచ్చారు. ఆయన పాలనలో ప్రజలపై అంక్షలు మరింత పెరిగాయి. తన రాజకీయ ప్రత్యర్థులను మెడ్యూరో విపరీతంగా వేధించటం మొదలుపెట్టాడు. ఆయనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మాచాడోను అణిచివేయటానికి ప్రయత్నం అనేక ప్రయత్నాలు చేసింది. ఈ నేపథ్యంలో గత ఏడాది (2024) జూలైలో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించటానికి మెడ్యూరో నిర్ణయించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని మాచాడో ప్రయత్నించారు. కానీ కోర్టుల ద్వారా ప్రభుత్వం ఆమె అభ్యర్థిత్వాన్ని అడ్డుకుంది. దీనితో గోన్‌జాలిజ్‌కు మచాడో మద్దతు ఇచ్చారు. ప్రజాస్వామికంగా జరిగి ఉంటే ఆయనే ఎన్నికల్లో గెలిచేవారు. కానీ తానే ఎన్నికయ్యానని మెడ్యూరో ప్రకటించుకున్నారు. దీనితో వెజెజువెలాలోని ప్రజలు రోడ్ల మీదకు వచ్చి ప్రదర్శనలు మొదలుపెట్టారు. ప్రభుత్వం ప్రజలను అణిచివేయటానికి ప్రయత్నించింది. "నన్ను చంపేస్తారని అనుమానం వచ్చింది. నన్ను నేను రక్షించుకుంటేనే.. ప్రజాస్వామ్యాన్ని రక్షించగలనని అనిపించింది. అందుకే అజ్ఞాతవాసానికి వెళ్లిపోయాను" అంటారు మచాడో.

అజ్ఞాత వాసం..

ప్రభుత్వ వేగుల నుంచి.. సైన్యం నుంచి తప్పించుకోవటం అంత సులభం కాదు. అందుకే మచాడో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొనేది. "నా జుట్టును నేనే కత్తిరించుకొనేదాన్ని. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం- నాకు పోరాడే శక్తిని ఇవ్వమని భగవంతుడిని ప్రార్థించేదాన్ని.." అంటారామె! అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆమె అజ్ఞాతంలో ఉండే పోరాడుతున్నారు. "ఇది మంచి.. చెడుల మధ్య జరుగుతున్న పోరాటం. ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న పోరాటం. దీనిని గెలవటం అంత సులభం కాదని తెలుసు. కానీ చివరకు మంచే గెలుస్తుందని నాకు తెలుసు. ఆ క్షణం వచ్చేదాకా పోరాడాల్సిందే" అని అంటారు మచాడో. ఆమె ప్రజాస్వామ్యం కోసం చేస్తున్న పోరాటంలో విజయం సాధించాలని ఆశిద్దాం.

నవ్య

కుటుంబ కదంబం

శనివారం • 11 అక్టోబరు 2025

వంటిల్లు



మనం మునక్కాడలతో రకరకాల కూరలు, సాంబార్, నిల్వ పచ్చడి... ఇలా ఎన్నో చేసుకుంటూ ఉంటాం. ఇవి కాక మునక్కాడలతో సరికొత్తగా ప్రయత్నించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

మునక్కాడ చికెన్

కావాల్సిన పదార్థాలు

లేత మునక్కాడలు- మూడు, చికెన్ ముక్కలు- అర కేజీ, నూనె- ఆరు చెంచాలు, పసుపు- అర చెంచా, తర్బూజ గింజలు- ఒక చెంచా, జీడిపప్పులు- అయిదు, దాల్చిన చెక్క- మూడు చిన్న ముక్కలు, యాలకులు- రెండు, లవంగాలు- అయిదు, గసగసాలు- ఒక చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఉల్లిపాయ- ఒకటి, పచ్చి కొబ్బరి- మూడు చిన్న ముక్కలు, పచ్చిమిర్చి- ఆరు, ఉల్లికాడలు- రెండు, కరివేపాకు- కొద్దిగా, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- రెండు చెంచాలు, కారం- రెండున్నర చెంచాలు

తయారీ విధానం: స్టవ్ మీద పాన్ పెట్టి తర్బూజ గింజలు, జీడిపప్పులు, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు వేసి రెండు నిమిషాలపాటు దోరగా వేయించాలి. ఆపైన కొబ్బరిముక్కలు, గసగసాలు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఇవన్నీ చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.

- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. తరువాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, పసుపు, ఉప్పు వేసి కలపాలి. అయిదు నిమిషాల తరువాత మునక్కాడ ముక్కలు, చికెన్ ముక్కలు వేసి కలపాలి. మూతపెట్టి పది నిమిషాలపాటు చిన్న మంట మీద మగ్గించాలి. తరువాత మూత తీసి రెండు గ్లాసుల నీళ్లు పోసి పావుగంటసేపు ఉడికించాలి. ఆపైన.. ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న మసాల పొడి, కారం, పచ్చి మిర్చి ముక్కలు, ఉల్లి కాడల ముక్కలు, కరివేపాకు వేసి కలిపి అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మునక్కాడ చికెన్ కూర... వేడి అన్నం, చపాతీ, పరోటా, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

మునక్కాడలతో కొత్తగా..

మునక్కాడల సూప్



కావాల్సిన పదార్థాలు

మునక్కాడలు- మూడు, టమాటా- ఒకటి, ఉల్లిపాయ- ఒకటి, అల్లం- చిన్న ముక్క, వెల్లుల్లి- మూడు రెబ్బలు, లవంగాలు- రెండు, నీళ్లు- మూడు కప్పులు, ఉప్పు- అర చెంచా, పసుపు- పావు చెంచా, మిరియాల పొడి- పావు చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా

తయారీ విధానం

- స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో మునక్కాడల ముక్కలు, టమాటా ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం, వెల్లుల్లి, లవంగాలు, ఉప్పు, పసుపు వేసి నీళ్లు పోసి బాగా కలపాలి. కుక్కర్‌కు మూతపెట్టి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. కుక్కర్ చల్లారాక మూత తీసి అందులో ఉన్న ముక్కలను పప్పు గుత్తి లేదా గరిటె తో మెత్తగా మెదపాలి. తరువాత స్టయినర్ సహాయంతో మరో గిన్నెలోకి రసాన్ని వడబోయాలి. ఈ గిన్నెను స్టవ్ మీద పెట్టి అయిదు నిమిషాలపాటు రసాన్ని బాగా మరిగించాలి. ఆపైన మిరియాల పొడి, కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మునక్కాడల సూప్‌ను వేడిగా తాగితే రుచిగా ఉంటుంది.

మునక్కాడ పరాటా

కావాల్సిన పదార్థాలు

లేత మునక్కాడలు- నాలుగు, గోధుమ పిండి- రెండు కప్పులు, ఉప్పు- కొద్దిగా, పసుపు- చిటికెడు, కారం- కొద్దిగా, నువ్వులు- అర చెంచా, ఉల్లిపాయ- ఒకటి, కొత్తిమీర- కొద్దిగా, నెయ్యి- నాలుగు చెంచాలు

తయారీ విధానం

- స్టవ్‌మీద కుక్కర్ పెట్టి అందులో మునక్కాడల ముక్కలు వేసి రెండు కప్పుల నీళ్లు పోసి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. తరువాత కుక్కర్‌ను స్టవ్ మీద నుంచి దించి చల్లారనివ్వాలి. మెత్తగా ఉడికిన మునక్కాడల ముక్కల లోపల ఉండే గింజలు, గుజ్జును చెంచా సహాయంతో తీసి ఒక గిన్నెలో వేయాలి.
- వెడల్పాటి గిన్నెను తీసుకుని అందులో గోధుమ పిండి, ఉప్పు, కారం, పసుపు, నువ్వులు, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు, మునక్కాడ ముక్కల నుంచి తీసిన గుజ్జు వేసి బాగా కలపాలి. తరువాత మునక్కాడలు ఉడికించిన నీళ్లు చల్లుకుంటూ పిండిని ముద్దలా చేయాలి. ఈ పిండిని పావుగంటసేపు నాననివ్వాలి. తరువాత పిండిని కొద్దికొద్దిగా తీసుకుంటూ పరాటాల్లా పామి వాటిపై కొద్దిగా నెయ్యి రాయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి వేడిచేయాలి. తరువాత దానిపై పరాటాలు ఒక్కోటి వేస్తూ రెండు వైపులా ఎర్రగా కాల్చి పళ్లెంలోకి తీయాలి. ఈ మునక్కాడ పరాటాలను రైతాతో సర్వ్ చేయవచ్చు.



బీసీ బిల్లు తేవడంలో విఫలమైన కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటం: కవిత

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలప్పుడు బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి.. బీసీ బిల్లు సాధించి తీసుకురావడంలో విఫలమైన కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటం చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్‌కు చెందిన బీసీ నాయకుడు రామ్‌కోటి, ఆయన అనుచరులు కవిత సమక్షంలో జాగృతిలో చేరారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జాగృతిలో చేరినవారు పోరాటం చేయాల్సి ఉంటుందని, జాగృతి అంటేనే విప్లవం, పోరాటాల జెండా అని అన్నారు.

42% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి

» తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం డిమాండ్

హైదరాబాద్, పాపన్నపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ నివేదిక ప్రకారం ఉద్యోగులకు 42% ఫిట్‌మెంట్ ఇచ్చి వెంటనే అమలు చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) డిమాండ్ చేసింది. మెదక్ జిల్లా పాపన్న పేట మండలం, ఏడుపాయలలో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి ఏకగ్రీవంగా 13 తీర్మానాలను ఆమోదించింది. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏల విడుదల, ఉద్యోగుల ఆరోగ్య పథకం, సీపీఎస్ రద్దు వంటి అంశాలు తీర్మానాల్లో ఉన్నాయి. సొసైటీల ద్వారా ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖలో రిటైర్ అయిన వారిని రీ అపాయింటమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోందని, వాటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

మద్యం షాపుల దరఖాస్తులకు 'పంచమి' పవర్

» రెండో శనివారం సెలవు రద్దు..నేడూ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి శుభవార్త! నేడు రెండో శనివారం సెలవుదినం అయినప్పటికీ దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణంగా రెండో శనివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. అయితే, నేడు పంచమి తిథి ఉండడం, ఈ రోజును మంచి రోజుగా పరిగణించడం వల్ల ఎక్కువ మంది ఔత్సాహికులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావించారు. అందుకే సెలవును రద్దుచేసి, దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు.

ఆన్‌లైన్‌లో బాలల అశ్లీల దృశ్యాలు

» ఇద్దరు నిందితులపై పోక్సో కేసు

చాదర్‌ఘాట్, అమీర్‌పేట అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల అశ్లీల దృశ్యాలను ఆన్‌లైన్‌లో షేర్ చేసిన ఇద్దరు వ్యక్తులపై చాదర్‌ఘాట్, డబీర్‌పుర పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. చంచల్‌గూడకు చెందిన మహ్మద్ హుస్సేన్ (34), ఆజాంపురకు చెందిన సయ్యద్ జమీల్ (32)లు చిన్నపిల్లల అశ్లీల దృశ్యాలను ఆన్‌లైన్‌లో, సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. నగరంలోని పిల్లలపై జరిగే నేరాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని, చిన్నపిల్లలకు సంబంధించిన అశ్లీల దృశ్యాలను, అసభ్యకర పోస్టులను ఆన్‌లైన్‌లో, సోషల్ మీడియాలో షేర్ చేయడం, చూడడం చట్టరీత్యా నేరమని మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి తెలిపారు. ఇలాంటి నేరాలకు సంబంధించిన సమాచారంపై చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్ (సీఎస్ఏఎం), ఎన్‌సీఆర్‌బీ, తదితర సంస్థలు నిఘా పెట్టి, స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తాయని, అటువంటి వ్యక్తులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇద్దరు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వారిపై షీట్స్ తెరవనున్నట్లు వెల్లడించారు. బాలల లైంగిక దాడి వీడియోలను ఇతరులకు షేర్ చేసిన మరో నిందితుడిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఐ కాల్స్‌తో బురిడీ!

» ఏపీ సీఎం చంద్రబాబు, దేవినేని ఉమా రూపురేఖలతో ఆగంతకుల టోకరా
» ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని టీడీపీ అభిమానులకు వీడియోకాల్
» పేద పిల్లల చదువుకని 35 వేలు స్వాహా
» అటు ఏపీలోనూ జెడ్పీటీసీ టికెట్ పేరిట రూ.లక్ష దండుకునే యత్నం


చంద్రబాబు మాట్లాడుతున్నట్టుగా కృత్రిమ మేధ ఆధారంగా చేసిన వీడియోకాల్

విజయవాడ/ సత్తుపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ)తో టీడీపీ అభిమానులను ఓ ఆగంతకుడు బురిడీ కొట్టించాడు. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి దేవినేని ఉమా రూపురేఖలతో ఏఐ వీడియో కాల్స్ చేసి డబ్బులు దండుకున్నాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన టీడీపీ అభిమానికి గతనెల 30న ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను ఏపీ మాజీ మంత్రి దేవినేని ఉమా పీఏనంటూ పరిచయం చేసుకున్నాడు. ఉమా వీడియో కాల్‌లో మాట్లాడుతారని చెప్పాడు. అచ్చం దేవినేని ఉమా రూపురేఖలతో, స్వరంతో వీడియోకాల్ వచ్చింది. పేద పిల్లల చదువు కోసం సాయం చేయాలని చెప్పడంతో.. టీడీపీ అభిమాని యూపీఐ ద్వారా రూ.35 వేలు బదిలీ చేశారు. వారం తర్వాత మరోసారి ఫోన్ వచ్చింది. స్థానిక ఎన్నికల్లో పార్టీ బీఫాం ఇస్తామని, చంద్రబాబు వీడియో కాల్‌లో మాట్లాడుతారని ఆ వ్యక్తి చెప్పాడు. తర్వాత కాసేపటికి చంద్రబాబు రూపురేఖలు, స్వరంతో వ్యక్తి మాట్లాడి, అభిమానిని అభినందించారు. తర్వాత ఆగంతకుడు అభిమానికి ఫోన్ చేశాడు. చంద్రబాబుతో అపాయింట్‌మెంట్ ఇప్పిస్తానని, విజయవాడలో హోటల్ గదులు కూడా బుక్ చేశానని చెప్పాడు. దీంతో ఈ నెల 8న 18 మంది సత్తుపల్లి నుంచి విజయవాడలోని ఆ హోటల్‌కు వెళ్లారు. కానీ ఆ వ్యక్తి రాలేదు. ఏమైందని ఫోన్ చేయగా.. ఓ పార్టీ కార్యకర్తకు అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రికి తీసుకొచ్చామని, అత్యవసరంగా రూ.10 వేలు పంపాలని కోరాడు. అదే సమయంలో వారి భోజనాల బిల్లు చెల్లించాలని హోటల్ యాజమాన్యం అడిగింది. ఈ క్రమంలో వాగ్వాదం జరగడంతో పోలీసులు వచ్చారు. వీడియోకాల్, బీఫామ్ కథ తెలుసుకొని దేవినేని ఉమాకు ఫోన్ చేయగా.. ఆగంతకుడు చేసిన మోసం బట్టబయలైంది. ఏలూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఏఐ సాయంతో మోసానికి పాల్పడినట్టుగా నిఘా వర్గాలు గుర్తించినట్టు సమాచారం.

జెడ్పీటీసీ టికెట్ పేరిట మోసానికి యత్నించి..

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గని ఆత్కూరు గ్రామానికి చెందిన మోరకొండ ఏడుకొండలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు. దేవినేని ఉమాకు అనుచరుడు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీగా పోటీ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నెల 8న దేవినేని ఉమా డీపీ ఉన్న వాట్సాప్ నంబరు ఏడుకొండలుకు వీడియోకాల్ వచ్చింది. దేవినేని ఉమా మాట్లాడుతున్నట్టుగా కనిపించింది. తర్వాత మామూలు కాల్ వచ్చింది. అందులో దేవినేని ఉమా స్వరంతో ఓ వ్యక్తి మాట్లాడాడు. 'లైన్‌లో ఉండు.. అన్న (చంద్రబాబు) మాట్లాడతారు' అంటూ కాన్ఫరెన్స్ పెట్టి.. చంద్రబాబు స్వరంతో మరో వ్యక్తితో మాట్లాడించారు. ఎన్ని ఎకరాల పొలం ఉంది, పిల్లలు ఏం చేస్తున్నారు అని అడిగి.. జెడ్పీటీసీగా అవకాశం ఇస్తానని, పేరు డైరీలో రాసుకున్నానని ఆ వ్యక్తి చెప్పారు. తర్వాత కాసేపటికి మొదటి వ్యక్తి మళ్లీ ఫోన్ చేసి రూ.లక్ష ఫోన్‌పే చేయాలని అడిగాడు. ఏడుకొండలు డబ్బు లేదని చెప్పడంతో 9న మళ్లీ ఫోన్ చేస్తానని చెప్పాడు. అయితే ఏడుకొండలు విజయవాడలో ఓ శుభకార్యానికి వెళుతూ మార్గమధ్యంలో దేవినేని ఉమా ఇంటికి వెళ్లారు. ఆయనను కలిసి విషయం చెప్పడంతో మోసం బయటపడింది. దీనిపై ఏడుకొండలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌లో దూసుకెళుతున్న రియల్ ఎస్టేట్ రంగం

» రియల్టర్లు, బిల్డర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం
» హైరైజులు, విల్లాలే కాదు దిగువ, మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకోండి
» సీఎస్ఆర్ నిధులు విద్య, వైద్య రంగాల్లో వెచ్చించండి
» నరెడ్కో ప్రాపర్టీ షోలో డిప్యూటీ సీఎం భట్టి


హైటెక్స్‌లో జరిగిన నరెడ్కో ప్రాపర్టీ షోలో రిబ్బన్ కట్‌చేస్తున్న భట్టి, జూపల్లి తదితరులు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధిలో దూసుకెళుతోందని, ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన వేలంలో ఎకరం భూమి రూ.177 కోట్లు పలకడమే ఇందుకు నిదర్శనమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రియల్టర్లు, బిల్డర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. హైరైజు బిల్డింగులు, విల్లాలకే పరిమితం కాకుండా దిగువ, మధ్య తరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకుని బిల్డర్లు ప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరెడ్కో) ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రాపర్టీ షోను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి భట్టి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏటా రూ.10 వేల కోట్లను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. గడిచిన రెండేళ్లలో రూ.20 వేల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయన్నారు. ఇటీవల 39 సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(ఎస్‌టీపీ) పనులకు ఆమోదం తెలిపామన్నారు. సీవరేజీ ప్లాంట్లు, తాగునీటి అవసరాల కోసం దాదాపు రూ.11,927 కోట్లను ఖర్చు చేస్తున్నామని, రూ.13,704 కోట్లతో మరికొన్ని తాగునీటి, సీవరేజీ ప్లాంట్ల పనులు ప్రతిపాదనల్లో ఉన్నాయని వివరించారు. మూసీ సుందరీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రం మారబోతోందని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కలిపేలా ఆర్ఆర్ఆర్ నిర్మాణం ఉంటుందని చెప్పారు. హైడ్రా ఏర్పాటుతో వచ్చిన ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి నేషనల్ హైవేను కలుపుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.1,487 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. రక్షణ శాఖ భూములను వినియోగించుకునేందుకు కేంద్ర రక్షణ మంత్రి నుంచి సీఎం రేవంత్ అనుమతి సాధించారన్నారు. శామీర్‌పేటలో రూ.3,619 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నామని చెప్పారు. దేశంలోని ఏ నగరాల్లో లేనివిధంగా 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్, మంచినీటిని హైదరాబాద్‌లో అందిస్తున్నామన్నారు. ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులే ఉంటాయని పేర్కొన్నారు. తమది బిజినెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని పేర్కొన్నారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిలో బిల్డర్లు, రియల్టర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని దట్టమైన అడవులు, జలపాతాలు, టైగర్ ఫారెస్ట్‌లకు వివిధ వర్గాల వారిని రియల్టర్లు తరచూ తీసుకెళ్లాలని కోరారు. రియల్టర్లు, బిల్డర్లను ప్రభుత్వం సంపద సృష్టికర్తలుగా గౌరవిస్తుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. విద్య, వైద్యం ప్రభుత్వ ప్రాధాన్య రంగాలని, సీఎస్ఆర్ నిధులను ఆయా రంగాల్లో ఖర్చు చేయాలని నరెడ్కో ప్రతినిధులకు ఆయన సూచించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్ అభివృద్ధికి ఏవిధంగా దోహదపడిందో.. రీజినల్ రింగ్ రోడ్డు అలాగే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నాంది పలుకుతుందన్నారు. హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగడానికి అన్ని రంగాల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. కాగా, నరెడ్కో ఆధ్వర్యంలో రూపొందించిన సావనీర్‌ను భట్టివిక్రమార్క ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్, నరెడ్కో ఆలిండియా అధ్యక్షుడు హరిబాబు, తెలంగాణ అధ్యక్షుడు ఎం.విజయసాయి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్, కాళీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, హవాలా నెట్‌వర్క్‌ను ఛేదించిన 'ఈగల్'

» దేశవ్యాప్తంగా పలు చోట్ల సోదాలు
» నెలరోజులుగా తప్పించుకు తిరుగుతున్న హవాలా ఆపరేటర్ ప్రజాపతి ముంబైలో అరెస్టు

హైదరాబాద్, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న నైజీరియన్ డ్రగ్స్ ముఠా నగదు హవాలా నెట్‌వర్క్‌ను ఈగల్ బృందాలు ఛేదించాయి. ముంబై, ఢిల్లీ, రాజస్థాన్, గోవాలో నైజీరియన్ డ్రగ్స్ స్మగ్లర్లకు సహకరిస్తున్న పలువురు హవాలా ఆపరేటర్ల ఇళ్లు, కార్యాలయాలపై ఈగల్ బృందాలు దాడులు నిర్వహించాయి. డ్రగ్స్ మనీ లాండరింగ్‌లో కీలకంగా వ్యవహరించిన హవాలా ఆపరేటర్ దగ్గారం ప్రజాపతిని ముంబైలో అదుపులోకి తీసుకుని, రూ.3 కోట్లకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నామని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన దాడుల్లో ప్రజాపతి తమ నుంచి తప్పించుకున్నాడని, అతడి స్నేహితుల కదలికలపై నిఘా ఉంచి తాజాగా అతడిని అరెస్టు చేయగలిగామని వివరించారు. ఈగల్ దాడుల నేపథ్యంలో దాదాపు నెలరోజుల నుంచి తప్పించుకతిరుగుతున్నాడని, ఫోన్లలో ఉన్న డేటాను డిలీట్ చేసి, కొత్త నంబర్లను వాడుతున్నాడని తెలిపారు. నైజీరియాకు చెందిన మ్యాక్స్‌వెల్ అనే వ్యక్తితో పాటు అతడి బృందం నుంచి డ్రగ్స్ అమ్మగా వచ్చిన నగదును ప్రజాపతి హవాలా మార్గంలో సూరత్, ముంబై, ఢిల్లీలోని వస్త్ర వ్యాపారులకు పంపేవాడని తెలిపారు. నైజీరియన్లు భారత్‌లో డ్రగ్స్ అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో వస్త్రాలను కొనుగోలు చేసి తమ దేశానికి కంటైనర్ల ద్వారా పంపేవారని, ఇదంతా ఒక పెద్ద నెట్‌వర్క్‌గా గుర్తించామని ఆయన వివరించారు. ఈ కేసులో 25 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. విదేశీయులకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు ఇంటి యజమానులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని ఆయన సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించి ఏ సమాచారం ఉన్నా 1908 నంబర్‌కు ఫోన్ చేసి తెలియచేయాలని సందీప్ శాండిల్య పేర్కొన్నారు.

కిలోల్లో బంగారం.. టన్నుల్లో తేనె!

» భోపాల్‌లో మాజీ చీఫ్ ఇంజనీర్ వద్ద భారీ ఆస్తులు

» 2.64 కిలోల పసిడి, 36 లక్షల నగదు స్వాధీనం

భోపాల్, అక్టోబరు 10: సోదాలు నిర్వహించిన అధికారులే నోరెళ్లబెట్టేలా ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగి ఇళ్లలో భారీగా నోట్ల కట్టలు.. కిలోల కొద్దీ బంగారం బయటపడింది. అంతేనా.. బయట అత్యంత విలాసవంతమైన కార్లు పార్క్‌చేసి ఉన్నాయి. ఆయనగారి వ్యవసాయ క్షేత్రంలోకి వెళితే ఏడు కాటేజీలు, నిర్మాణంలో ఉన్న మరో 32 కాటేజీలు కనిపించాయి. భారీ చేపల చెరువు కనిపించింది. టన్నులకొద్దీ నిల్వ చేసిన తేనె లభ్యమైంది. ఇదంతా మధ్యప్రదేశ్‌లో జీపీ మెహ్రా అనే ప్రజా పనుల విభాగం (పీడబ్ల్యూడీ) రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కూడబెట్టిన సంపద! ఇది తమ ఊహకు అందనంత విలువైన సొత్తు అని సోదాలు నిర్వహించిన లోకాయుక్త అధికారులు వెల్లడించారు. నలుగురు డీఎస్పీ ర్యాంకు అధికారుల నేతృత్వంలోని బృందాలు శుక్రవారం తెల్లవారుజామున భోపాల్, నర్మదాపురంలో మెహ్రాకు సంబంధించిన నాలుగు స్థావరాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. మణిపురం కాలనీలోని మెహ్రా నివాసంలో రూ.8.79 లక్షల నగదు, రూ.50 లక్షల విలువైన బంగారు నగలు, రూ.56 లక్షల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను సీజ్ చేశారు. దనాపానీలో ఆయన లగ్జరీ ఫ్లాట్‌లో రూ.26 లక్షల నగదు, రూ.3.05 కోట్ల విలువైన 2.6 కిలోల బంగారం, 5.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. సోహాగ్‌పూర్‌లోని ఆయన ఫామ్‌హౌస్‌లో మెహ్రా వైభోగం చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. ఆ ఫామ్‌హౌస్‌లో ప్రత్యేకంగా ఓ గోశాల, ఓ ఆలయాన్ని నిర్మించారు. అలాగే మెహ్రా వ్యాపార సంస్థగా భావిస్తున్న గోవిందాపురలోని కేటీ ఇండస్ట్రీస్‌పైనా లోకాయుక్త అధికారులు దాడులు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా రూ.36.04 లక్షల నగదు, 2.64 కిలోల బంగారం, 5.52 కిలోల వెండి, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్‌కు సంబంధించిన పత్రాలు సీజ్ చేశారు.

ఆ ఎమ్మెల్యే లాకర్లలో 40 కిలోల గోల్డ్!



(మొదటి పేజీ తరవాయి)

భారీగా అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ కుంభకోణం జరిగిందని.. పలు బెట్టింగ్ యాప్‌ల ద్వారా అమాయకులను మోసం చేశారంటూ ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మేరకు బెంగళూరుకు చెందిన ఈడీ బృందం శుక్రవారం చల్లెకెరెలోని ఫెడరల్ బ్యాంకులో వీరేంద్రకు సంబంధించిన రెండు లాకర్లలోంచి 40 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. ఇప్పటికే ఆయన్నుంచి 21 కిలోల బంగారు బిస్కెట్లు సహా నగదు, డిపాజిట్లు, లగ్జరీ కార్ల రూపంలో రూ.103 కోట్ల సొత్తును అధికారులు సీజ్ చేశారు. తాజా దాడులతో వీరేంద్రకు సంబంధించి రూ.150 కోట్లకు పైగానే సొత్తును సీజ్ చేసినట్లయిందని అధికారులు వెల్లడించారు. వీరేంద్ర కుటుంబసభ్యులు, ఆయన బంధువులు, సన్నిహితులు బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. అక్రమంగా సంపాదించిన సొమ్మును విదేశీ బ్యాంకుల్లో డిపాజిట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన తమ్ముడు కేసీ తిప్పేస్వామి, మరో వ్యక్తి పృథ్వీరాజ్ దుబాయ్‌లో పలు కాల్‌సెంటర్ల ద్వారా ఆన్‌లైన్ గేమింగ్ వ్యవహారాలు నడిపినట్లు గుర్తించారు. ఈ కార్యకలాపాలన్నీ ఎమ్మెల్యే వీరేంద్ర నియంత్రణలో జరిగాయని.. ఈ బెట్టింగ్ అప్లికేషన్ల టర్నోవర్ రూ.2వేల కోట్లకు పైగా ఉంటుందని వెల్లడించారు. మరోవైపు.. బిహార్ ఎన్నికల కోసం రూ.300 కోట్లు ఇస్తానని కాంగ్రెస్ అధిష్ఠానానికి ఎమ్మెల్యే వీరేంద్ర ఆఫర్ ఇచ్చారని కర్ణాటకలో విపక్ష నేత అశోక్ ఆరోపించారు. తాను చెల్లించే ఈ డబ్బుకు ప్రతిఫలంగా మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలిసిందని పేర్కొన్నారు.

ఒకేరోజు, ఒకే అంశంపై.. రెండు చోట్ల విచారణా?

రెండు బెంచ్‌ల నుంచి విరుద్ధ ఆదేశాలా?

మద్రాస్ హైకోర్టుకు సుప్రీం కోర్టు ప్రశ్నలు

చెన్నై, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ ప్రచారం సందర్భంగా ఇటీవల కరూర్‌లో జరిగిన తొక్కిసలాట వ్యవహారంపై మద్రాస్ హైకోర్టు రెండు బెంచ్‌లు చేపట్టిన విచారణల పట్ల సుప్రీంకోర్టు శుక్రవారం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఒకే అంశంపై, ఒకేరోజు హైకోర్టు రెండు చోట్ల ఎలా విచారణ చేపట్టిందని ప్రశ్నించింది. ఘటన కరూర్‌లో జరిగినందున హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ విచారణ చేపడుతుండగా, అదే అంశంపై మద్రాస్ హైకోర్టు సింగిల్ జడ్జి ఎలా విచారణ చేపట్టారని అడిగింది. రాజకీయ పార్టీలు ప్రచార సభ నిర్వహించేందుకు ప్రామాణిక నిబంధనలు రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తే.. సింగిల్ జడ్జి ఆ అభ్యర్థనను దాటి సిట్‌ను ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించింది. సింగిల్ జడ్జి 'సిట్ దర్యాప్తునకు ఆదేశిస్తే, మదురై డివిజన్ బెంచ్.. పోలీసుల దర్యాప్తులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించిందని గుర్తుచేసింది.

కనీసం మా వాదనలు వినలేదు!

కరూర్ దుర్ఘటనపై విచారణకు మద్రాస్ హైకోర్టు సిట్ ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ టీవీకే దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. టీవీకే తరఫున సీనియర్ న్యాయవాదులు గోపాల్ సుబ్రమణ్యం, ఆర్యమసుందరం వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి కనీసం తమ వాదనలు వినకుండా పార్టీకి, విజయ్‌కు వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అంతేగాక అభ్యర్థనలో లేని విషయాన్ని ప్రస్తావనకు తీసుకువచ్చి సిట్ ఏర్పాటు చేశారని వివరించారు. ఘటన జరిగిన వెంటనే విజయ్ ఎలాంటి విచారం వ్యక్తం చేయకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారన్న హైకోర్టు వ్యాఖ్యలు తప్పని, పరిస్థితులు మరింత దిగజారకుండా పోలీసులు వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని బలవంతం చేశారని ఆర్యమసుందరం కోర్టుకు తెలిపారు. మరోవైపు, తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గీ, పి.విల్సన్ వాదనలు వినిపించారు. సిట్ ఏర్పాటుతో ప్రభుత్వానికి సంబంధం లేదని, అది కేవలం హైకోర్టు నిర్ణయమేనని తెలిపారు.

మైక్రోసాఫ్ట్ సలహాదారుగా బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్

లండన్, అక్టోబరు 10: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్.. అమెరికాకు చెందిన టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ఏఐ సంస్థ ఆంత్రోపిక్‌లకు సీనియర్ సలహాదారుగా వ్యవహరించనున్నారు. రిషి ఈ బాధ్యతలు చేపట్టేందుకు బ్రిటన్‌లో మాజీ మంత్రులకు సంబంధించి బిజినెస్ నియామకాలను పర్యవేక్షించే అడ్వైజరీ కమిటీ ఆన్ బిజినెస్ అపాయింట్‌మెంట్స్ (ఏసీవోబీఏ) గురువారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా కొన్ని షరతులు విధించింది. సునాక్ ప్రధాని పదవిలో ఉన్నప్పటి నుంచి తనకు తెలిసిన ఏ సమాచారాన్ని ఉపయోగించరాదని పేర్కొంది.

బిహార్‌లో ఎన్‌డీఏకు కాస్త ఆధిక్యం

» సీఎం అభ్యర్థిగా తేజస్వీ వైపు మొగ్గు: సీ-ఓటర్ సర్వే

న్యూఢిల్లీ, అక్టోబరు 10: బిహార్ అసెంబ్లీ ఎన్నికలపై నిర్వహించిన ఒపీనియన్ పోల్ ఫలితాలను సీ-ఓటర్ సంస్థ శుక్రవారం వెల్లడించింది. బీజేపీ-జేడీ(యూ)ల ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ కూటమికి కాస్త ఆధిక్యం లభించగా, సీఎం అభ్యర్థిగా మాత్రం ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ వైపు అత్యధికులు మొగ్గు చూపుతున్నట్టు ప్రకటించింది. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని నిలుపుకొనే అవకాశాలు 40శాతం ఉండగా, ఆర్జేడీ ఆధ్వర్యంలోని మహాగట్‌బంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు 38.3 శాతం మేర ఉన్నాయి. కొత్తగా ఏర్పాటయిన ప్రశాంత్ కిశోర్ ఆధ్వర్యంలోని జన్ సురాజ్ పార్టీ పట్ల కేవలం 13.3 శాతం మందే ఇష్టత ప్రదర్శించారు. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరయితే బాగుంటుందన్న ప్రశ్నకు భిన్నమైన సమాధానం వచ్చింది. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ పట్ల 36.5% మంది మొగ్గు చూపారు. ప్రశాంత్ కిషోర్‌కు 23.2% మంది, ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు 15.9% మంది, చిరాగ్ పాసవాన్‌కు 8.8% మంది మద్దతు తెలిపారు.

'సర్' సమర్థనీయమే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 10: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)ను సుప్రీంకోర్టు సమర్థించింది. నకిలీ ఓటర్లను తొలగించడంతోపాటు అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించే ప్రక్రియ మంచిదేనని అభిప్రాయపడింది. "ఏ సందర్భంలో అయినా 'సర్' ఇలానే ఉంటే సమర్థనీయమే." అని న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. సామాజిక ఉద్యమకారుడు యోగేంద్ర యాదవ్ పిటిషన్‌పై శుక్రవారం మరోసారి విచారణ జరిపిన ధర్మాసనం.. బిహార్ మొత్తం ఓటర్ల సంఖ్య.. రాష్ట్రంలోని వయోజనుల సంఖ్య కంటే 107 శాతం ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో నకిలీ ఓటర్లను తొలగించడం అవసరమని స్పష్టం చేసింది.

దగ్గు మందు మరణాలపై సీబీఐ విచారణకు నో

» 'పిల్'ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 10: మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో దగ్గు మందు కారణంగా పిల్లలు మరణించిన సంఘటనలపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరుతూ దాఖలైన పిల్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మరణాల నేపథ్యంలో ఔషధాల ప్రమాణాల వ్యవస్థలను సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలని విన్నవిస్తూ న్యాయవాది విశాల్ తివారీ ఈ పిల్‌ను దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన ధర్మాసనం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సూచనతో పిటిషన్‌ను కొట్టేసింది.

ఇక డిస్కమ్‌ల పోటీ



ఒకే ప్రాంతంలో బహుళ డిస్కమ్‌ల విద్యుత్ సరఫరా

» ప్రస్తుత నెట్‌వర్క్‌ను వాడుకుని వ్యాపారం చేసుకునే చాన్స్

» ముసాయిదా విద్యుత్ సవరణ బిల్లు-2025 తెచ్చిన కేంద్రం

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒకే ప్రాంతంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ డిస్కమ్‌లు రావొచ్చు. వినియోగదారుడు తనకు నచ్చిన డిస్కమ్ నుంచి కరెంట్ కొనుగోలు చేయవచ్చు. డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలంటే విధిగా నెట్‌వర్క్ (స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు) కలిగి ఉండాలనే నిబంధన సడలింపు. ఇప్పటికే ఒక ప్రాంతంలో ఉన్న డిస్కమ్‌ల లైన్లు, నెట్‌వర్క్‌ను వాడుకొని వేరే డిస్కమ్‌లు వ్యాపారం చేసుకునే వెసులుబాటు. విద్యుత్ నియంత్రణ మండళ్ల(ఈఆర్‌సీ) సుమోటోగా చార్జీలు ఖరారు చేసే అధికారం. క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీ రద్దు. ఇవీ.. విద్యుత్ పంపిణీ రంగంలో కీలక సంస్కరణలను ప్రతిపాదిస్తూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ తెచ్చిన ముసాయిదా బిల్లు (విద్యుత్(సవరణ) బిల్లు-2025)లోని ముఖ్యాంశాలు. దీన్ని రాష్ట్రాలకు పంపిన కేంద్రం, నెల రోజుల్లోగా అభిప్రాయం తెలియజేయాలని కోరింది. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే.. టెలికం రంగంలాగే విద్యుత్ పంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయి. మరీ ముఖ్యంగా.. ఒక ప్రాంతంలో ఒకే నెట్‌వర్క్‌ను బహుళ విద్యుత్ పంపిణీ వ్యవస్థలు వాడుకునే వీలు కల్పించే ప్రతిపాదన అమల్లోకి వస్తే.. బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్‌టెల్, జియో, ఐడియా, వోడాఫోన్ కంపెనీలు పోటీ పడ్డట్టుగా.. డిస్కమ్‌లు ఇంటింటికీ తిరిగి తమ కనెక్షనే తీసుకోవాలంటూ నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకే ఆఫర్ చేసే అవకాశాలున్నాయి. ఇంగ్లండ్ లాంటి దేశాల్లో ఈ విధానం ఇప్పటికే అమల్లో ఉంది. గతంలో ల్యాండ్‌లైన్ టెలిఫోన్ కనెక్షన్ తీసుకోవాలంటే విధిగా లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కరెంట్ కనెక్షన్‌కూ అదే పరిస్థితి. దరఖాస్తు చేసుకున్నా.. రకరకాల కారణాలతో కరెంట్ కనెక్షన్ ఇవ్వకుండా తిప్పడం చాలా మంది విద్యుత్ సిబ్బందికి అనవాయితీగా మారింది. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే డిస్కమ్‌ల మధ్య పోటీ పెరిగి.. సిబ్బంది మన ఇంటికే వచ్చి తక్కువ ధరకే కనెక్షన్ ఇస్తామని ఆఫర్ చేసే అవకాశాలున్నాయి. అలాగే.. ముసాయిదా బిల్లు ప్రకారం ఒక యూనిట్‌కు అయ్యే వ్యయాన్ని పూర్తిస్థాయిలో డిస్కమ్‌లు వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. సబ్సిడీ ఇవ్వదలుచుకుంటే నేరుగా ప్రభుత్వం వినియోగదారుడి ఖాతాలో జమచేయాలి. లేదంటే ప్రత్యేకంగా ఒక ఖాతాను తెరిచి.. డిస్కమ్‌ల అకౌంట్‌లో జమచేయాల్సి ఉంటుంది. ముసాయిదాలోని మరో ముఖ్యమైన ప్రతిపాదన.. తయారీ రంగం, రైల్వే, మెట్రోలను క్రాస్ సబ్సిడీ భారం నుంచి ఐదేళ్లలోగా మినహాయించడం. క్రాస్ సబ్సిడీలంటే.. పరిశ్రమల వంటివాటికి సరఫరా చేసే విద్యుత్‌కు ఎక్కువ చార్జీలు వసూలు చేసి, ఆ ఆదాయంతో పేదలకు, రైతులకు రాయితీ ధరలకు విద్యుత్ సరఫరా చేయడం. ఈ క్రాస్ సబ్సిడీల భారం నుంచి తయారీ రంగాన్ని, రైల్వే, మెట్రోలను మినహాయించడం అంటే.. అవి విద్యుత్‌కు అధిక చార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

టారిఫ్ పిటిషన్ ఇవ్వకపోతే..

విద్యుత్ టారిఫ్‌లను సుమోటోగా సవరించే అధికారాన్ని రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ సంస్థ (ఈఆర్‌సీ)లకు కల్పించే ప్రతిపాదన ఈ బిల్లులో ఉంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం టారిఫ్‌లను సవరించాలంటే.. విద్యుత్ పంపిణీ సంస్థలు టారిఫ్ పిటిషన్‌ను ఈఆర్‌సీకి సమర్పించాల్సి ఉంటుంది. అందులో డిస్కమ్‌లు సమర్పించిన వివరాల ఆధారంగా.. ఆధారంగా ఈఆర్‌సీలు ప్రజాభిప్రాయాన్ని సేకరించి, అన్ని విధాలా సమీక్షించి కొత్త చార్జీలను నిర్ణయిస్తాయి. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల కారణాల వల్ల (ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెరగడం ఇష్టం లేకనో, మరేవైనా రాజకీయకారణాలతోనో) డిస్కమ్‌లు టారిఫ్ పిటిషన్లను ఈఆర్‌సీకి సమర్పించకుండా ఆపుతాయి. ఫలితంగా చార్జీలు పెరగవుగానీ వ్యయాలు.. డిస్కంల నష్టాలు మాత్రం ఏటికేడాదీ పెరిగిపోతుంటాయి. అందుకే కేంద్రం ఈ ముసాయిదా బిల్లులో ఈఆర్‌సీలకు సుమోటోగా టారిఫ్‌లను సవరించే అధికారాన్ని కల్పించే ప్రతిపాదనను చేర్చింది. దీనివల్ల.. డిస్కమ్‌లు టారిఫ్ పిటిషన్లను సమర్పించకపోయినా ఈఆర్‌సీలు సొంతంగా నిర్ణయం తీసుకుని ఏటా ఏప్రిల్ 1 (ఆర్థిక సంవత్సరం మొదటిరోజు) నుంచి కొత్త టారిఫ్‌లు అమలయ్యేలా చూసే వీలుంటుంది. విద్యుత్ రంగంలో పాలసీలపై చర్చించడానికి వీలుగా జాతీయ స్థాయిలో కేంద్ర విద్యుత్ మంత్రి చైర్మన్‌గా ఎలక్ట్రిసిటీ కౌన్సిల్ ఏర్పాటు అవుతుంది. ఇందులో రాష్ట్రాల విద్యుత్ మంత్రులు సభ్యులుగా ఉంటారు. విధాన నిర్ణయాలపై సూచనలు, సలహాలు తీసుకోవడానికి ఈ కౌన్సిల్ ఉపయుక్తంగా ఉంటుంది.

మారిన లెక్కలు..

ప్రస్తుతం విద్యుత్ చౌర్యం కేసులో ఒక వినియోగదారుడిని పట్టుకుంటే... గరిష్ఠ వినియోగం ఆధారంగా రెండేళ్లు, మూడేళ్లు, నాలుగేళ్లు.. ఇలా ఇష్టం వచ్చిన కాలానికి డిస్కమ్‌లు జరిమానాలు వేస్తున్నాయి. ఇక ముందు అలా కుదరదు. ఆ వినియోగదారుడు ఎన్నేళ్లుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నా.. గరిష్ఠంగా ఏడాది కాలానికి మాత్రమే జరిమానాలు వేయాల్సి ఉంటుంది. ఈఆర్‌సీలు ఏ కేసునైనా నిర్దిష్టంగా నాలుగు నెలల్లోపు తేల్చాలి. ఒక మెగావాట్ కన్నా ఎక్కువ వినియోగం ఉన్న వినియోగదారులు డిస్కమ్ నుంచి లేదా ఓపెన్ యాక్సెస్‌లో నేరుగా కరెంట్ కొనుగోలు చేసే అవకాశం ఉంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఈసారి రెట్టింపు వినోదం



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న కథానాయకుడు విష్వక్సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి.అనుదీప్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బేనర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. వెంకట్ ఉప్పుటూరి సహనిర్మాత. తాజాగా ఈ చిత్రం టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. దర్శకుడి పాత్రలో విష్వక్సేన్ సరికొత్తగా కనిపిస్తున్నారు. కథానాయిక కయాదు లోహర్ తన అందంతో కట్టిపడేశారు. వీరి జోడి కొత్తగా, ఉత్సాహంగా కనిపిస్తూ తెరకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. దర్శకుడు అనుదీప్ ఈసారి రెట్టింపు వినోదాన్ని అందించబోతున్నారని టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో


ఆ తపనే నడిపిస్తోంది



శరత్‌కుమార్

"సినీరంగంలో నాలుగు దశాబ్దాల కెరీర్ పూర్తిచేసుకున్నా నటుడిగా ఇప్పటికీ నాలో ఎలాంటి మార్పు లేదు. మరిన్ని మంచి కథలు, పాత్రలు చేయాలనే తపనే నన్ను ముందుకు నడిపిస్తోంది' అని నటుడు శరత్‌కుమార్ అన్నారు. ప్రదీప్ రంగనాథన్ కథానాయకుడిగా కీర్తీశ్వరన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన చిత్రం 'డ్యూడ్'. శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించారు. ఈ నెల 17న విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- కథను మలుపుతిప్పే పాత్రలు చేయడమే నాకు ఇష్టం. కీర్తీశ్వరన్ గారు 'డ్యూడ్' కథ చెప్పగానే అద్భుతంగా ఉందనిపించింది. ఇది రెగ్యులర్ సినిమాలా ఉండదు. వ్యంగ్యం, వినోదంతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్నాయి. నటుడిగా నాకు సవాల్ విసిరే పాత్రను ఇందులో చేశాను. డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. ఒకే ఎక్స్‌ప్రెషన్‌లో విభిన్నమైన భావోద్వేగాలను పలికించడం చాలా కష్టంగా అనిపించింది. కీర్తీశ్వరన్ ప్రత్యేక శ్రద్ధతో నా పాత్రను సరికొత్తగా తీర్చిదిద్దాడు. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని దర్శకుడు కథ రాశారు. ఒక కుటుంబంలో జరిగే అనూహ్య పరిణామాలకు సమాజం ఎలా స్పందిస్తుందనే అంశాన్ని కొత్తకోణంలో చూపించబోతున్నాడు. కథాగమనంలో నా పాత్ర కీలకంగా ఉంటుంది.
- ప్రదీప్ ఆల్‌రౌండర్. మంచి డైరెక్టర్. తనకంటూ ప్రత్యేకమైన శైలి ఉంది. ఈ సినిమాలో తన నటన హై ఎనర్జీతో ఉంటుంది. మైత్రీ లాంటి గొప్ప నిర్మాణసంస్థలో సినిమా చేయడం ఆనందాన్నిచ్చింది. సాయి అభ్యంకర్ సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. అవకాశం వస్తే సుభాస్ చంద్రబోస్ బయోపిక్ చేయాలనుంది. ప్రస్తుతం 'మిస్టర్ ఎక్స్' అనే సినిమాతో పాటు తమిళ, హిందీ చిత్రాలు చేస్తున్నాను.



విదేశాల్లో చిత్రీకరణ

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో 'ఆర్‌టీ76' వర్కింగ్ టైటిల్ పేరుతో ఓ సినిమా రూపుదిద్దుకుంటోన్న విషయం తెలిసిందే. ఎస్‌ఎల్‌వీ సినిమా బేనర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర బృందం విదేశాల్లో కీలక సన్నివేశాల చిత్రీకరణలో నిమగ్నమై ఉంది. స్పెయిన్‌లోని వాలెన్షియా, ఆ సమీప దీవుల్లో కొన్ని రోజులుగా సాగుతున్న చిత్రీకరణ పనులు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి జెనీవా, ఫ్రాన్స్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభించారు. ఈ 25 రోజుల షెడ్యూల్‌లో టాకీ పార్ట్ తోపాటు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రెండు పాటల చిత్రీకరణను పూర్తి చేయనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

మిత్రమండలి వినోదం మెప్పిస్తుంది



"జంగ్లీ అనే కాల్పనిక పట్టణం నేపథ్యంలో రూపుదిద్దుకున్న పూర్తి వినోదాత్మక చిత్రం 'మిత్రమండలి'. అవుట్ అండ్ అవుట్ కామెడీ ప్రేక్షకులను అలరిస్తుంది. కథ మీద నమ్మకంతో సినిమా నిర్మాణంలో భాగస్వాములమయ్యాం" అని నిర్మాతలు భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల అన్నారు. ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం జంటగా విజయేందర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 16న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మీడియాతో ముచ్చటించారు.

- బన్నీ వాస్ మాకు మంచి మిత్రుడు. గీతా ఆర్ట్స్‌లో ఆయనతో కలసి కొన్ని సినిమాలు చేశాం. మేం నిర్మాణసంస్థను ప్రారంభించాలని అనుకున్నప్పుడు బన్నీవాస్ సూచన మేరకు 'మిత్రమండలి' కథ విన్నాం. వినోదం, వ్యంగ్యం కలబోతగా రూపొందిన చిత్రమిది.
- దర్శకుడిగా విజయేందర్‌కు మంచి స్పష్టత ఉంది. కథను ఎంత అద్భుతంగా రాసుకున్నాడో అంతే అద్భుతంగా తెరకెక్కించాడు. మేకింగ్‌లో ఎక్కడా తడబడలేదు. ఒక కొత్త దర్శకుడిలా అనిపించలేదు. 'మిత్రమండలి' చిత్రంలో బ్రహ్మానందం గారి పాత్ర చాలా ఆసక్తికరంగా ఉండబోతోంది. సినిమా పూర్తయ్యాక ఏదో వెలితిగా అనిపించింది. అప్పుడు బ్రహ్మానందం గారి మీద ఒక పాటను చిత్రీకరించాం. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. 'జాతిరత్నాలు' చిత్రంతో 'మిత్రమండలి'కి పోలిక తెస్తున్నారు. కానీ మాది పూర్తిగా వేరే కథ. ప్రేక్షకులు సినిమాను ఆద్యంతం ఆస్వాదిస్తారు.

ముగ్గురు స్నేహితుల కథ




ఎంసీ హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రధారులుగా రమణరెడ్డి సోమ తెరకెక్కిస్తోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'అమీర్ లోగ్'. అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ బేనర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని కథానాయకుడు శ్రీవిష్ణు ఆవిష్కరించారు. పోస్టర్‌లో చార్మినార్, ఇరానీ ఛాయ్ అని రాసి ఉన్న బోర్డుని చూస్తుంటే హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథ అని అర్థమవుతోంది. కాగా, ఇది ముగ్గురు స్నేహితుల చుట్టూ తిరిగే ఓ వినోదాత్మక చిత్రమని, పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తామని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి డీవోపీ: ఎస్‌వీకే, సంగీతం: స్మరన్ సాయి.

బైసన్ వస్తున్నాడు



తమిళ హీరో విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'బైసన్'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. మారి సెల్వరాజన్ దర్శకుడు. సమీర్ నాయర్ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా నుంచి తొలి గీతాన్ని విడుదల చేసి, చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'తీరేనా తీరేనా గుండెల్లోన మండుతున్న ఎద వేదనా' అంటూ సాగే ఈ గీతానికి మారి సెల్వరాజ్ సాహిత్యం అందించగా, నివాస్ కే ప్రసన్న స్వరపరిచారు. మనువర్ధన్ ఆలపించారు. ఈ చిత్రాన్ని జగదంబె ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత బాలాజీ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రంలో ధ్రువ్ నటన తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు' అని చెప్పారు.



కళాకారుల కథతో...

చాణక్య ప్రధాన పాత్రధారునిగా స్వీయ నిర్మాణంలో కళా శ్రీనివాస్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'దక్కన్ సర్కార్'. తాజాగా ఈ చిత్రం పోస్టర్‌ని నటి విజయశాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ప్రజా ఉద్యమాలతో సంబంధం ఉన్న రచయిత, ప్రజా కళాకారుడు కళా శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, చిత్ర విజయానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కళా కారుల జేఏసీ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే మాట్లాడుతూ తెలంగాణ సినిమాలను, కళాకారులను ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. చిత్ర దర్శకనిర్మాత కళా శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఇది ప్రజల జీవన స్థితిగతుల కథ, నిజ జీవిత ఘటనల ఆధారంగా నిర్మించాం' అని చెప్పారు.

బిజినెస్

ఈక్విటీల కంటే బంగారమే ముద్దు



దేశంలో 34,600 టన్నుల పసిడి

- విలువ రూ.335.69 లక్షల కోట్లు
- ఈక్విటీ పెట్టుబడుల కంటే 3.1 రెట్లు అధికం
- జీడీపీలో పసిడి విలువ 88.8 శాతం

మోర్గాన్ స్టాన్లీ

న్యూఢిల్లీ: మన దేశంలో పసిడి నిల్వలు ఏటేటా పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది జూన్ నెలాఖరు నాటికి మన దేశంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), ప్రజల వద్ద 34,600 టన్నుల పసిడి నిల్వలు ఉన్నట్టు అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం చూస్తే దీని విలువ 3,78,500 కోట్ల డాలర్లు. రూపాయల్లో చెప్పాలంటే ఇది దాదాపు రూ.335.69 లక్షల కోట్లకు సమానం. ప్రస్తుతం భారత కుటుంబాలు ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసిన 1,18,500 కోట్ల డాలర్ల కంటే ఇది 3.1 రెట్లు ఎక్కువ. జీడీపీపరంగా చూసినా పసిడి విలువ ప్రస్తుత జీడీపీలో 88.8 శాతం వరకు ఉంటుందని మోర్గాన్ స్టాన్లీ నివేదిక తెలిపింది.

వినియోగంలో రెండో స్థానం: ప్రస్తుతం ప్రపంచ పసిడి డిమాండ్‌లో చైనా తర్వాత మన దేశం రెండో స్థానంలో ఉంది. గత ఐదేళ్ల డేటాను పరిశీలిస్తే ప్రపంచ వార్షిక పసిడి కొనుగోళ్లలో చైనా 28 శాతం కొనుగోలు చేస్తుంటే, మన దేశం 26 శాతం వరకు కొనుగోలు చేస్తోందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యుజీసీ) ఒక నివేదికలో తెలిపింది. మన దేశంలో పసిడి నిల్వలు పెద్దగా లేవు. దీంతో దేశ అవసరాల్లో దాదాపు 99 శాతానికి దిగుమతులే దిక్కు. భారత్ ఎంత లేదన్నా ఏటా 750 నుంచి 840 టన్నుల పసిడిని దిగుమతి చేసుకుంటోంది.

కారణాలు: మన దేశంలో పండగొచ్చినా, పబ్బమొచ్చినా చిన్నమెత్తు బంగారమైనా లేకుండా ఏ కార్యక్రమమూ పూర్తి కాదు. ఇక ధనత్రయోదశి రోజైతే బంగారం షాపులన్నీ కిటకిటలాడుతుంటాయి. ధర ఎంత పెరిగినా, తాహతుకు తగ్గట్టు కొద్దో గొప్పో బంగారం కొని పెట్టుకోవడం మధ్య, సంపన్న వర్గాల సంప్రదాయం. దీనికి తోడు ఇటీవల పెట్టుబడి లాభాల కోసం బంగారం కొని పెట్టుకునే వారి సంఖ్యా పెరిగి పోయింది. ప్రస్తుతం దేశంలో అమ్ముడయ్యే బంగారంలో 30 శాతం బిస్కెట్లు, కడ్డీలు, నాణేల రూపంలో అమ్ముడవుతోంది. వీటిని కొనేవారిలో ఎక్కువ మంది పెట్టుబడి లాభాల కోసం కొనేవారే. ఆర్థిక అనిశ్చితి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, స్టాక్ మార్కెట్ ఆటుపోట్లు, ద్రవ్యోల్బణం కూడా చాలా మంది ఇన్వెస్టర్లను పసిడి వైపు చూసేలా చేస్తున్నాయి.

బంగారం రుణ మార్కెట్ రూ.15 లక్షల కోట్లు..

దేశంలో పసిడి నిల్వలతో పాటు బంగారాన్ని కుదువ పెట్టుకుని అప్పులిచ్చే మార్కెట్ కూడా పెరిగిపోతోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి సంఘటిత రంగంలోని ఈ మార్కెట్ రూ.15 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఇక్రా రేటింగ్ సంస్థ అంచనా. గతంలో అంచనా వేసిన దాని కంటే ఇది ఒక ఏడాది తక్కువ. 2027 మార్చి నాటికి ఇది మరింత విస్తరించి రూ.18 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉందని తెలిపింది. రేసు గుర్రంలా పరుగెడుతున్న బంగారం ధరను దృష్టిలో ఉంచుకుని గత ఏడాది సెప్టెంబరులో విడుదల చేసిన తమ అంచనాలను సవరిస్తున్నట్టు ఇక్రా తెలిపింది.

బ్యాంకులదే అగ్రస్థానం: రుణాలివ్వటంలో బ్యాంకింగేతర ఆర్థికేతర సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లతో పోలిస్తే బ్యాంకులు ముందున్నాయి. 2020-25 మధ్య కాలంలో సంఘటిత రంగంలోని ఎన్‌బీఎఫ్‌సీల పసిడి రుణాల మార్కెట్ ఏటా సగటున 20 శాతం చొప్పున పెరిగితే, బ్యాంకుల పసిడి రుణాల వితరణ 26 శాతం చొప్పున పెరిగింది. దీంతో ఈ ఏడాది మార్చి నాటికి పసిడి రుణాల మార్కెట్ రూ.11.8 లక్షల కోట్లు ఉంటే, అందులో బ్యాంకుల వాటా 82 శాతానికి చేరినట్టు ఇక్రా తెలిపింది.

టీటీకే ప్రెస్టీజ్ ఎమిరిటస్ చైర్మన్

టీటీ జగన్నాథన్ కన్నుమూత



న్యూఢిల్లీ: కిచెన్ మొఘల్‌గా సుప్రసిద్ధుడైన టీటీకే ప్రెస్టీజ్ ఎమిరిటస్ చైర్మన్ టీటీ జగన్నాథన్ శుక్రవారం బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 77 సంవత్సరాలు. ఆయన చెన్నై ఐఐటీ గోల్డ్ మెడలిస్ట్ కావడమే కాకుండా కార్నెల్ యూనివర్శిటీ డాక్టరేట్ కూడా పొందారు. గత 50 సంవత్సరాలుగా ఆయన తన తాత, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి టీటీ కృష్ణమాచారి స్థాపించిన టీటీకే ప్రెస్టీజ్ కంపెనీ బోర్డులో ఉన్నారు. 1975లో టీటీకే ప్రెస్టీజ్ ఎండీగా బాధ్యతలు చేపట్టిన జగన్నాథన్ 2000 సంవత్సరం వరకు అదే పదవిలో కొనసాగారు. ఆ తర్వాత 2019 వరకు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉన్నారు. అనంతరం నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/చైర్మన్‌గా కొనసాగారు. ఈ ఏడాది మార్చి 25న చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దివాలా దశలో ఉన్న టీటీకే ప్రెస్టీజ్ కంపెనీని బిలియన్ డాలర్ కంపెనీగా తీర్చిదిద్దటంలో జగన్నాథన్ కీలక పాత్ర పోషించారు. ఆయన సారథ్యంలో కంపెనీ విభిన్న ఉత్పత్తులను మార్కెట్లోకి ప్రవేశపెట్టడం ద్వారా చిన్న గృహోపకరణాల విభాగంలో అగ్రగామిగా నిలిచింది.

గోల్డ్ ఈటీఎఫ్‌లు జిగేల్

సెప్టెంబరు లో రూ.8,363 కోట్ల పెట్టుబడులు

రూ.90,000 కోట్లకు గోల్డ్ ఈటీఎఫ్‌ల ఏయూఎం

న్యూఢిల్లీ: బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఎగబాకుతున్న నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)లోకి భారీగా నిధులు వచ్చాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ ఏడాది సెప్టెంబరులో ఇన్వెస్టర్లు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో కొత్తగా రూ.8,363 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వీటిలోకి వచ్చిన అత్యధిక నెలవారీ పెట్టుబడులివి. ఈ ఆగస్టులో నమోదైన రూ.2,190 కోట్లతో పోలిస్తే గత నెలలో దాదాపు నాలుగు రెట్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ రూ.90,000 కోట్ల మైలురాయిని దాటింది.

ఇక ప్రైవేట్ రంగం నుంచి పీఎస్‌బీ సారథులు

న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల అత్యున్నత శ్రేణి మేనేజ్‌మెంట్ హోదాల్లో ప్రైవేట్ రంగంలోని ప్రతిభావంతులను నియమించుకునేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఇప్పటికే ఎస్‌బీఐలోని నలుగురు మేనేజింగ్ డైరెక్టర్లలో ఒక పోస్టును ప్రైవేట్ రంగానికి కేటాయించారు. ఇప్పటివరకు పీఎస్‌బీల ఎండీ, చైర్మన్ పదవులన్నింటికీ అంతర్గతంగా ఉన్న అర్హులైన అభ్యర్థులనే నియమిస్తూ వచ్చారు. ప్రస్తుతం దేశంలో ఎస్‌బీఐ సహా 11 పీఎస్‌బీలున్నాయి. సవరించిన నియామక మార్గదర్శకాల ప్రకారం ఇక నుంచి ఈ పదవులకు పోటీ చేసేందుకు ప్రైవేట్ రంగంలోని అభ్యర్థులను అనుమతించనున్నారు.

- హైదరాబాద్, విజయవాడల్లోని వినియోగదారులకు ఈ పండగ సీజన్‌లో ఎస్‌యూవీ విభాగంలో టాటా పంచ్ అత్యుత్తమ చాయిస్‌గా నిలిచిందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) వెల్లడించింది. గత నెలలో దేశంలో అమ్ముడుపోయిన కార్లలో పంచ్ టాప్ 5లో ఒకటిగా ఉందని తెలిపింది.
- భారత్‌లోని 10 గిగావాట్ల సామర్థ్యం గల పవన, సౌర విద్యుత్, స్టోరేజీ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చేందుకు గాను 2,000 కోట్ల డాలర్లు సమీకరించింది. ఈ నిధుల్లో ఇప్పటికే 50 కోట్ల డాలర్లను బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ జేవీ అయిన ఎవ్రెన్‌కు అందించింది. ఈ జేవీ భారత్‌లో 10 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది.
- అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌కు విజయవాడ, విశాఖపట్నం నగరాల్లోని వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని అమెజాన్ ఇండియా వెల్లడించింది. గృహోపకరణాలకు డిమాండ్ ఏకంగా 150 శాతం, ప్రీమియం టీవీలకు 70 శాతం, జువెలరీకి డిమాండ్ ఏకంగా రెండింతలు పెరిగిందని తెలిపింది

15 నుంచి మిడ్‌వెస్ట్ ఐపీఓ

ఇష్యూ ధరల శ్రేణి రూ.1,014-1,065

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణకు చెందిన గ్రానైట్ కంపెనీ మిడ్‌వెస్ట్ లిమిటెడ్ రూ.451 కోట్ల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 15న ప్రారంభమై 17న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.1,014-1,065గా నిర్ణయించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.250 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతో పాటు రూ.201 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. ఈ నెల 24న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది. తాజా ఈక్విటీ జారీ ద్వారా లభించనున్న నిధుల్లో రూ.130.3 కోట్లను తన అనుబంధ విభాగమైన మిడ్‌వెస్ట్ నియోస్టోన్ క్వార్ట్జ్ రెండో దశ విస్తరణ కోసం ఉపయోగించుకోనున్నట్లు మిడ్‌వెస్ట్ తెలిపింది. మరో రూ.25.7 కోట్లను ఎలక్ట్రిక్ డంప్ ట్రక్కుల కోసం, రూ.3.2 కోట్లను కొన్ని గనుల్లో సోలార్ ఇంధన అనుసంధానం కోసం వినియోగించుకోనుంది. కాగా, రూ.56.2 కోట్లను రుణాల తిరిగి చెల్లింపు కోసం, మిగతా సొమ్మును వ్యాపార అవసరాల కోసం ఉపయోగించుకోనున్నట్లు కంపెనీ పేర్కొంది. మిడ్‌వెస్ట్ తెలంగాణ, ఏపీలో 16 గ్రానైట్ గనులను నిర్వహిస్తోంది. అత్యంత ఖరీదైన బ్లాక్ గెలాక్సీ గ్రానైట్, బ్లాక్ గ్రానైట్‌ను ఉత్పత్తి చేస్తోందీ సంస్థ.

సెన్సెక్స్ 329 పాయింట్లు అప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజు లాభపడ్డాయి. ఫార్మా, బ్యాంకింగ్ షేర్ల ర్యాలీతో పాటు విదేశీ సంస్థాగత పెట్టుబడులతో సెన్సెక్స్ శుక్రవారం 328.72 పాయింట్ల వృద్ధితో 82,500.82 వద్ద స్థిరపడింది. ఒక దశలో సూచీ 482 పాయింట్లు ఎగబాకి 82,654 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, 103.55 పాయింట్ల లాభంతో 25,285.35 వద్ద ముగిసింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య సంధి కుదరడంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టడంతో పాటు అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం విషయంలో కొంత పురోగతి కన్పించడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచిందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	90
కర్నూలు	102	నెల్లూరు	95
విశాఖపట్నం	127	అనంతపురం	95
గోదావరి	119		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,290 ▼	1,12,100 ▼	1,71,000 ▲
విజయవాడ	1,25,000 ▼	1,19,000 ▼	1,69,500 ▲
విశాఖపట్నం	1,25,000 ▼	1,13,800 ▼	1,84,000 ▲
రాజమండ్రి	1,23,710 ▼	1,13,400 ▼	1,72,000 ▲
ప్రొద్దుటూరు	1,27,500 ▼	1,17,300 ▼	1,68,000 ▲
ముంబై	1,21,525 ▼	1,11,317 ▼	1,64,500 ▲

టాటా సన్స్ లిస్టింగ్ జరగాల్సిందే

అప్పుడే ట్రస్టీ ఇంటి పోరుకు ఫుల్ స్టాప్

ఎస్‌పీ గ్రూప్ చైర్మన్ ఎస్‌పీ మిస్త్రీ

న్యూఢిల్లీ: టాటా ట్రస్ట్ బోర్డు మీటింగ్ వాడి వేడిగా జరిగినట్లు సమాచారం. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో టాటా గ్రూప్ కంపెనీల మాతృ సంస్థ టాటా సన్స్ షేర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాల్సిందేనని షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్ పట్టుబట్టింది. దీనికి సంబంధించి ఎస్‌పీ గ్రూప్ చైర్మన్ షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ ఒక ప్రకటన విడుదల చేశారు. షేర్లను లిస్ట్ చేస్తేనే టాటా సన్స్ ఈక్విటీలో 66 శాతం వాటా ఉన్న టాటా ట్రస్ట్ ట్రస్టీల ఇంటి పోరుకు తెరపడి, కంపెనీ నిర్వహణలో పూర్తి పారదర్శకత ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు. టాటా సన్స్ ఈక్విటీలో ఎస్‌పీ గ్రూప్ 18.37 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉంది. ఈ నేపథ్యంలో ఎస్‌పీ మిస్త్రీ చేసిన ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్‌బీఐ ఆదేశించినా గత నెలాఖరులోగా టాటా సన్స్ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయించలేకపోవడంపైనా మిస్త్రీ ఈ సమావేశంలో ట్రస్టీలను నిలదీసినట్టు సమాచారం. ఇప్పటికైనా వీలైనంత త్వరగా టాటా సన్స్ లిస్టింగ్ పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ చర్య టాటా గ్రూప్ లిస్టెడ్ కంపెనీల్లో వాటాలు ఉన్న 1.2 కోట్ల మంది వాటాదారులకూ మేలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. టాటా ట్రస్ట్ ట్రస్టీల ఇంటిపోరుతో చైర్మన్ నోయెల్ టాటా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్ కూడా ఇటీవల జరిగిన భేటీలో టాటా ట్రస్ట్ చైర్మన్ నోయెల్ టాటా, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌లను నిలదీసినట్టు సమాచారం. ఈ ఇంటిపోరు ముదిరితే దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానంలో ఉన్న టాటా గ్రూప్ కంపెనీల పనితీరుపైనా ప్రభావం పడుతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	540
వరంగల్	522	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ.	72

స్పోర్ట్స్



బ్రూక్ (69)

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో — శ్రీలంక x ఇంగ్లండ్

బోణీ కొట్టిన కివీస్

- బంగ్లాదేశ్‌పై గెలుపు
- మహిళల వరల్డ్‌కప్

గువాహటి: న్యూజిలాండ్ మహిళలు వన్డే ప్రపంచ కప్‌లో ఎట్టకేలకు ప్రపంచ కప్‌లో బోణీ చేశారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం చవిచూసిన కివీస్.. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 100 పరుగులతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. మొదట న్యూజిలాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 227 పరుగులు చేసింది. బ్రూక్ (69), కెప్టెన్ సోఫీ డివైన్ (63) హాఫ్ సెంచరీలతో ఆదుకున్నారు. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 112 పరుగులు జోడించడంతో న్యూజిలాండ్ తేరుకుంది. ఛేదనలో కివీస్ బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ 39.5 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. ఫహీమా ఖాతూన్ (34) టాప్ స్కోరర్. రబేయా ఖాన్ (25), నహీదా అక్తర్ (17) మోస్తరుగా ఆడారు. బంగ్లా ఇన్నింగ్స్‌లో రెండో అత్యధిక స్కోరు ఎక్స్‌ట్రాల (30)దే కావడం గమనార్హం.

సంక్షిప్తస్కోర్లు: న్యూజిలాండ్: 50 ఓవర్లలో 227/9 (బ్రూక్ హలిడే 69, సోఫీ డివైన్ 63, సుజీ బేట్స్ 29, రబేయా ఖాన్ 3/30); **బంగ్లాదేశ్:** 39.5 ఓవర్లలో 127 ఆలౌట్ (ఫహీమా ఖాతూన్ 34, రబేయా ఖాన్ 25, నహీదా అక్తర్ 17, జెస్ కెర్ 3/21, లియా తహూహు 3/22, రోస్‌మేరీ 2/20).

సింధు మూడోసారి..

బీడబ్ల్యూఎఫ్ అథ్లెట్ల కమిషన్‌లో చోటు



న్యూఢిల్లీ: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) అథ్లెట్ల కమిషన్‌లో మూడోసారి చోటు దక్కించుకుంది. నవంబరు 2025-నవంబరు 2029 కాలానికిగాను బీడబ్ల్యూఎఫ్ శుక్రవారం ప్రకటించిన నూతన సభ్యుల జాబితాలో మరోసారి సింధు పేరును చేర్చారు. తొలిసారిగా 2017లో ఈ కమిషన్‌కు ఎంపికైన సింధు.. ఆ తర్వాత 2021లో రెండోసారి స్థానం దక్కించుకున్న విషయం తెలిసిందే.

హైదరాబాద్ పరాజయం

హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ఆతిథ్య హైదరాబాద్ బ్లాక్‌హాక్స్‌కు ఓటమి ఎదురైంది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తూఫాన్స్ 15-10, 16-14, 17-15తో హైదరాబాద్‌పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ 12-15, 15-12, 15-12, 16-14తో డిఫెండింగ్ చాంపియన్స్ కాలికట్ హీరోస్‌కు షాకిచ్చింది.

అక్షిత్ మెరిసె.. ఢిల్లీ గెలిచె

చెన్నై: అక్షిత్ ధుల్ సూపర్ 10తో మెరవడంతో ప్రొ.కబడ్డీ లీగ్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ గెలుపొందింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో ఢిల్లీ 39-33తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో యు ముంబా 48-29తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

కాంస్యంతో సరి

సెమీస్‌లో భారత్ ఓటమి

జూ. ప్రపంచ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్

గువాహటి: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ల జైత్రయాత్రకు తెరపడింది. సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఇండోనేసియా చేతిలో ఓటమిపాలై కాంస్యంతో సరిపెట్టుకున్నారు. శుక్రవారం జరిగిన సెమీస్‌లో భారత్ 35-45, 21-45తో పరాజయం పాలైంది. కాంస్యానికి పరిమితమైనా.. ఈ మెగా టోర్నీలో పతకం దక్కడం భారత్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.

గదిలో పెట్టి తాళం వేశాడు

ఆసియా 'కప్'పై నక్వీ తీరు

దుబాయ్: ఆసియాకప్‌లో విజేతగా నిలిచి రెండు వారాలైనప్పటికీ భారత టీ20 జట్టుకు ఇప్పటిదాకా ట్రోఫీ దక్కలేదు. పాక్‌పై ఫైనల్లో గెలిచాక ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహిసిన్ నక్వీ నుంచి తాము ఆ ట్రోఫీ అందుకునేది లేదని కెప్టెన్ సూర్యకుమార్ తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. దీంతో నక్వీ వేదికపైనుంచే కప్‌ను తీసుకెళ్లిపోయాడు. తాజా సమాచారం ప్రకారం దాన్ని దుబాయ్‌లోని తన ఏసీసీ ప్రధాన కార్యాలయంలో పెట్టి గదికి తాళం వేశాడట. 'ఇప్పటికీ ట్రోఫీ ఆ ఆఫీస్‌లోనే ఉంది. తన అనుమతి లేకుండా ఆ ట్రోఫీని ఎట్టి పరిస్థితిలో తీయకూడదని, అలాగే ఎవరికీ ఇవ్వకూడదని మాకు ఆదేశాలున్నాయి. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే ఎప్పటికైనా దాన్ని స్వయంగా తానే బీసీసీఐకి కానీ భారత జట్టుకు కానీ ఇస్తానని నక్వీ తెలిపాడు' అని ఏసీసీ వర్గాలు పేర్కొన్నాయి.

కాస్పరోవ్ ఆధిక్యం మరింత..

ఆనంద్‌తో లెజెండ్స్ క్లచ్ చెస్

సెయింట్ లూయిస్ (అమెరికా): భారత దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్‌తో లెజెండ్స్ క్లచ్ చెస్ టోర్నీలో రష్యా జీఎం గ్యారీ కాస్పరోవ్ తన ఆధిక్యాన్ని మరింత పెంచుకున్నాడు. రెండో రోజు జరిగిన నాలుగు గేమ్‌లలో రెండింటిలో కాస్పరోవ్ విజయం సాధించాడు. మరో రెండు గేమ్‌లు డ్రాగా ముగిశాయి. రెండో రోజు నాలుగు గేమ్‌ల్లో 6-2 ఆధిక్యంతో నిలిచిన గ్యారీ.. మొత్తం ఎనిమిది గేమ్‌ల తర్వాత 8.5-3.5తో ముందంజలో నిలిచాడు. మూడో.. చివరి రోజు మరో నాలుగు గేమ్‌లు జరగనున్నాయి.

శతక జైస్వాల్



'డబుల్' దిశగా ఓపెనర్

రాణించిన సాయి సుదర్శన్

భారత్ తొలి ఇన్నింగ్స్ 318/2

వెస్టిండీస్‌తో రెండో టెస్టు

న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులోనూ భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (173 బ్యాటింగ్) తన అసాధారణ బ్యాటింగ్ నైపుణ్యంతో డబుల్ సెంచరీ వైపు సాగుతుండగా.. అటు సాయి సుదర్శన్ (87) అర్ధసెంచరీతో ఫామ్‌ను అందుకున్నాడు. దీంతో తొలి రోజు శుక్రవారమే భారత్ పూర్తి పట్టు సాధించింది. తద్వారా ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 318/2 భారీ స్కోరుతో నిలిచింది. క్రీజులో యశస్వీకి జతగా గిల్ (20 బ్యాటింగ్) ఉన్నాడు. స్పిన్నర్ జోమెల్ వారికన్‌కు రెండు వికెట్లు దక్కాయి. మరోవైపు విండీస్ బౌలర్లు తొలి రోజు ఆటలో ఒక్క ఎక్స్‌ట్రా రన్ ఇవ్వకపోవడం విశేషం.

ఆరంభంలో ఆచితూచి..: కెప్టెన్‌గా మొదటిసారి టాస్ గెలిచిన గిల్ వెంటనే బ్యాటింగ్‌ను ఎంచుకున్నాడు. అయితే కొత్త బంతిని ఎదుర్కొన్న ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ తొలి గంటపాటు నిదానంగా ఆడారు. వారెదుర్కొన్న మొదటి 72 బంతుల్లో 60 డాట్ బాల్స్ ఉండడం గమనార్హం. దీంతో డ్రింక్స్ విరామానికి జట్టు స్కోరు 29/0గానే ఉంది. పేసర్ ఫిలిప్ చక్కటి సీమ్‌తో ఓపెనర్లను ఇబ్బందిపెట్టాడు. కానీ బ్రేక్ తర్వాత స్ట్రయిక్‌ను రొటేట్ చేసుకుంటూ, చెత్త బంతులను ఫోర్లుగా మలుస్తూ చకచకా పరుగులు రాబట్టారు. 17వ ఓవర్‌లో సిక్సర్‌తో జోరు మీదున్న రాహుల్ (38)ను.. స్పిన్నర్ వారికన్ తన తొలి ఓవర్‌లోనే స్టంపౌట్‌గా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో మొదటి వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఎదుర్కొన్న మొదటి బంతినే ఫోర్‌గా మలిచిన సాయి సుదర్శన్‌తో కలిసి జైస్వాల్ మరో వికెట్ పడకుండా తొలి సెషన్‌ను 94/1 స్కోరుతో ముగించాడు.



సాయి సుదర్శన్ (87)

యశస్వీ-సాయి శతక భాగస్వామ్యం: రెండో సెషన్‌లో పూర్తిగా భారత్ ఆధిపత్యం సాగింది. పిచ్ బ్యాటింగ్‌కు సహకరించడంతో ఇద్దరు లెఫ్ట్‌హ్యాండర్లు జైస్వాల్-సుదర్శన్ శతక భాగస్వామ్యాన్ని అందించారు. తొలి గంటపాటు వీరి దూకుడుకు ఓవర్‌కు ఆరు పరుగుల రన్‌రేట్‌తో స్కోరు దూసుకెళ్లింది. లంచ్ విరామం తర్వాత జైస్వాల్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. విండీస్ బౌలర్లు ఈ జోడీని విడదీసేందుకు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో సాయి కెరీర్‌లో రెండో అర్ధసెంచరీకి చేరుకున్నాడు. అటు తొలి టెస్టులో భారీ స్కోరు అందుకోలేకపోయిన జైస్వాల్ ఈసారి పట్టుదలగా ఆడి కెరీర్‌లో ఏడో శతకం సాధించాడు. అయితే సాయి 58 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను మిడ్ వికెట్‌లో వారికన్ పట్టుకోలేకపోయాడు. రెండో వికెట్‌కు అజేయంగా 162 పరుగులు జోడించాక ఇద్దరూ టీ బ్రేక్‌కు వెళ్లారు.

సాయి శతకం మిస్: ఆఖరి సెషన్‌లో బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో భారత్ ఆటలో కాస్త వేగం తగ్గింది. ఇక ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తున్న సాయి సుదర్శన్ కెరీర్‌లో తొలి సెంచరీ చేయడం ఖాయమనిపించింది. కానీ వారికన్ అతడిని దెబ్బతీశాడు. అటు అంపైర్ ఎల్బీ నిర్ణయంపై సాయి రివ్యూ కోరినా ఫలితం లేకపోయింది. రీప్లేలో బంతి లెగ్ స్టంప్‌ను తాకుతున్నట్టుగా తేలడంతో సెంచరీకి 13 రన్స్ దూరంలో సుదర్శన్ పెవిలియన్ చేరాడు. దీంతో రెండో వికెట్‌కు 193 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్లాస్ ఇన్నింగ్స్‌తో జైస్వాల్ ఐదోసారి టెస్టుల్లో 150 రన్స్‌ను పూర్తి చేశాడు. గిల్ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడడంతో.. తొలిరోజు ఆటను భారత్ మెరుగ్గా ముగించింది.

4 — అతి పిన్న వయస్సులోనే (23) టెస్టుల్లో 7 శతకాలు బాదిన నాలుగో ప్లేయర్‌గా జైస్వాల్. బ్రాడ్‌మన్ (12), సచిన్ (8), సోబర్స్ (9) ముందున్నారు. మియాందాద్, గ్రేమ్ స్మిత్, విలియమ్సన్, కుక్ కూడా ఏడు సెంచరీలతో ఉన్నారు. అలాగే జైస్వాల్ శతకాల్లో ఐదు 150+ స్కోర్లు ఉండడం విశేషం. బ్రాడ్‌మన్ మాత్రమే ఈ వయస్సులో ఎక్కువ సార్లు (8) ఈ ఫీట్ సాధించాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వీ జైస్వాల్ (బ్యాటింగ్) 173, రాహుల్ (స్టంప్) ఇమ్లాచ్ (బి) వారికన్ 38, సాయి సుదర్శన్ (ఎల్బీ) వారికన్ 87, గిల్ (బ్యాటింగ్) 20, **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 90 ఓవర్లలో 318/2; వికెట్ల పతనం:** 1-58, 2-251; **బౌలింగ్:** సీల్స్ 16-1-59-0; ఫిలిప్ 13-2-44-0; గ్రీవ్స్ 8-1-26-0; పియర్ 20-1-74-0; వారికన్ 20-3-60-2; చేజ్ 13-0-55-0.

డాక్టర్ యశస్వీ



తొలి రోజు ఆఖరి సెషన్‌లో కెప్టెన్ గిల్ రెండో పరుగు తీసే క్రమంలో విండీస్ కీపర్ టెవిన్ ఇమ్లాచ్ బలంగా ఢీకొన్నాడు. గిల్ హెల్మెట్ కీపర్ ఛాతీకి బలంగా తాకడంతో ఇద్దరూ కిందపడిపోయారు. దీంతో మైదానంలో కాసేపు ఆందోళన నెలకొంది. వెంటనే ఇరు జట్ల ఫిజియోలు వచ్చి ఆటగాళ్లను పరీక్షించారు. గిల్ హెల్మెట్ తీసి కాసేపు తల పట్టుకుని కూర్చున్నాడు. అతడిని ఫిజియో చెక్ చేశాక జైస్వాల్.. తన రెండు వేళ్లను గిల్‌కు చూపుతూ ఇవెన్ని ఉన్నాయంటూ కంకషన్ టెస్టు చేసినట్టుగా ఆటపట్టించాడు. అటు గిల్ కూడా సరదాగా నవ్వుకోవడం కనిపించింది. మరోవైపు జైస్వాల్ సూపర్ ఇన్నింగ్స్‌తో అరుణ్ జైట్లీ స్టేడియంలోని ప్రేక్షకులు ఫిదా అయ్యారు. దీంతో అప్పటిదాకా 'కోహ్లీ.. కోహ్లీ' అంటూ అరిచిన అభిమానులు.. 'జైస్వాల్.. జైస్వాల్' అనే నామస్మరణతో హోరెత్తించారు.

మోహిత్ మీట్ రికార్డ్

స్వర్ణం కైవసం — జాతీయ జూనియర్ అథ్లెటిక్స్



మోహిత్

భువనేశ్వర్: తెలంగాణకు చెందిన మోహిత్ చౌదరి జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. శుక్రవారం ఇక్కడ ప్రారంభమైన మీట్‌లోని అండర్-20 పురుషుల 5వేల మీటర్ల పరుగులో మోహిత్ 14 నిమిషాల 09.71 సెకన్ల రికార్డ్‌తో గమ్యం చేరి అగ్రస్థానంలో నిలిచాడు. దాంతో 14 ని 12.67సె. గత రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా 11 ఏళ్ల రికార్డును హిమాంశు జాఖర్ బద్దలుగొట్టాడు. హరియాణాకు చెందిన హిమాంశు జావెలిన్ త్రో అండర్-18 విభాగంలో 79.96 మీ. దూరంతో సరికొత్త జాతీయ రికార్డుతో స్వర్ణం నెగ్గాడు. దాంతో 2014లో నీరజ్ 76.50 మీ. దూరంతో నెలకొల్పిన రికార్డు కనుమరుగైంది.

బలమైన ప్రదర్శన చేయాలని..

తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఢీ

జూ. జొహార్ కప్ హాకీ నేటి నుంచి

జొహార్ బహ్రు (మలేసియా): రానున్న జూనియర్ హాకీ ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని.. యువ భారత జట్టు శనివారం నుంచి జరిగే జూనియర్ సుల్తాన్ జొహార్ కప్‌లో బలమైన ప్రదర్శన చేయాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతోంది. తొలిరోజు పోటీలో భాగంగా ఇంగ్లండ్‌తో భారత్ తన ఆరంభ మ్యాచ్‌ను ఆడనుంది. ఈ ఈవెంట్‌లో సత్తా చాటి వచ్చేనెల 28 నుంచి చెన్నైలో జరిగే ప్రపంచ కప్‌కు మరింత ఉత్సాహంతో పోటీపడాలనుకుంటోంది. భారత్.. ఈనెల 12న న్యూజిలాండ్‌తో, 14న పాకిస్థాన్‌తో, 15న ఆస్ట్రేలియాతో, 17న ఆతిథ్య మలేసియాతో తలపడనుంది. 18న ఫైనల్ జరగనుంది.

మెట్రో త్వరగా స్వాధీనం కావాలి

- సంప్రదింపులు, బదిలీ ప్రక్రియను వేగంగా చేపట్టండి
- మొదటి, రెండో దశల అనుసంధానంతోనే.. పనులు వేగంగా జరిగే అవకాశం: సీఎం రేవంత్
- ఎన్వీఎస్ రెడ్డి, సర్ఫరాజ్ అహ్మద్‌తో సీఎం భేటీ

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశకు రెండో దశను అనుసంధానం చేయడం ద్వారానే సజావుగా ముందుకు సాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అంతా ఒకే గొడుగు కిందికి వస్తే.. ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులు చేసే అవకాశం ఉంటుందనే మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవటానికి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రభుత్వ సలహాదారులు ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌లతో సమీక్ష నిర్వహించారు. మెట్రో ప్రాజెక్టును వీలైనంత వేగంగా ముందుకు తీసుకెళ్లడానికి ఉన్న మార్గాలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రస్తుతం మెట్రో ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీపై రూ.13 వేల కోట్ల అప్పుల భారం పడటం, నిర్వహణ ఇబ్బందితో.. ప్రాజెక్టు నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో ప్రజా రవాణాను దృష్టిలో పెట్టుకొని మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. దీనితో రూ.13వేల కోట్ల అప్పులను కూడా ప్రభుత్వం బదిలీ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను త్వరగా ముందుకు తీసుకెళ్లాలని, చర్చలు, బదిలీ ప్రక్రియ, ఒప్పందాలు త్వరగా పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. కాగా, అప్పుల బదిలీతోపాటు తమకు రూ.5 వేల కోట్ల గుడ్‌విల్ ఇవ్వాలని ఎల్అండ్‌టీ డిమాండ్ చేస్తోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఇవ్వాల్సి వస్తే.. రూ.2 వేల కోట్ల వరకు ఇవ్వొచ్చనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మెట్రో ప్రాజెక్టును సర్కారు స్వాధీనం చేసుకుంటే... మెట్రోకు ఉన్న భూములు, ఆస్తులన్నీ ప్రభుత్వ అదీనంలోకి వస్తాయి.

బీఏఎస్ విద్యార్థులను రానివ్వట్లేదు!

- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన
- బకాయిల విడుదల కోసం యాజమాన్యాల పట్టు
- నేడు ఉపముఖ్యమంత్రిని కలుస్తాం:బీఏఎస్ అసోసియేషన్

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బీఏఎస్) పథకం కింద చదువుతున్న విద్యార్థులను యాజమాన్యాలు పాఠశాలలకు రానివ్వడంలేదు. వీరికి సంబంధించి ప్రభుత్వం ఉపకార వేతనాల బకాయిలు విడుదల చేసే వరకు పాఠశాలలకు రానివ్వొద్దన్న నిర్ణయం మేరకు యాజమాన్యాలు పట్టువీడటం లేదు. దసరా సెలవుల తర్వాత పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులను అనుమతించలేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్డెక్కాల్సి వచ్చింది. విద్యార్థులను అనుమతించాలని, లేకుంటే క్రిమినల్ కేసులు పెడతామని అధికారులు హెచ్చరించినా.. బీఏఎస్ యాజమాన్యాలు దిగిరావడం లేదు. బకాయిలు వచ్చే వరకు వారిని రానివ్వబోమని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద దాదాపు 30 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారు. వారికి రెండున్నరేళ్లుగా నిధులు మంజూరు చేయకపోవడంతో రూ.180 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. వాటిని విడుదల చేయాలని బీఏఎస్ యాజమాన్య సంఘం నేతలు వినతి పత్రాలు ఇచ్చారు. అయినా స్పందన లేకపోవడంతో దసరా సెలవులు ముగిశాక పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులను వెనక్కు పంపారు. దీంతో చదువులకు ఇబ్బంది కలుగుతుందని, అనుమతించాలని విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. యాజమాన్యాలు పట్టు వీడకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. బకాయి బిల్లుల గురించి శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలవనున్నట్లు బీఏఎస్ అసోసియేషన్ నేతలు తెలిపారు.

గ్రేటర్‌లో చెరువుల కబ్జాలపై చర్యల్లేవు

ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు

హెచ్ఎండీఏ, హైడ్రా, జీహెచ్ఎంసీలపై ఆరోపణ.. హైకోర్టులో కామారెడ్డి ఎమ్మెల్యే పిటిషన్

కామారెడ్డిలో అంతా సక్రమంగా ఉందా?.. ధర్మాసనం ప్రశ్న

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో పలు చెరువులను పూర్తిగా కబ్జా చేసి భారీ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై ఫిర్యాదు చేసినా రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రేమావతిపేట్ పెద్ద చెరువు, శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలో చెరువు, దుండిగల్ గండిమైసమ్మ మండలం గాగిలాపూర్‌లో చెరువు, గండిపేట్ మండలం పుప్పాల్‌గూడ ముక్కసాని కుంటలను పూర్తిగా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది బొండెంపల్లి రాములు వాదిస్తూ ఈ అంశంపై తొలుత తాను హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశానని పేర్కొన్నారు. రిట్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని డివిజన్ బెంచ్ సూచించడంతో ప్రస్తుత పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ 'పిటిషనర్ ఒక ఎమ్మెల్యే. చాలా పవర్‌ఫుల్ వ్యక్తి. చెరువులు, కుంటలు, జలవనరులు, నాలాల కబ్జాలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చు కదా? పిటిషనర్ కామారెడ్డి ఎమ్మెల్యే.. కామారెడ్డి పట్టణంలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు లేకుండా అంతా సక్రమంగా ఉందా? అని ప్రశ్నించింది. న్యాయవాది సమాధానం ఇస్తూ. అసెంబ్లీ వేదికగా ఈ విషయాన్ని పలుమార్లు లేవనెత్తారని పేర్కొన్నారు. మంత్రులు సమాధానం ఇస్తూ కబ్జాలను తొలగించడానికి హైడ్రా వంటి వ్యవస్థలను ఏర్పాటు చేశామని, అక్కడ ఆధారాలతో ఫిర్యాదు చేయాలని చెప్పారని గుర్తుచేశారు. మంత్రులు చెప్పిన విధంగానే ఫిర్యాదు చేసినా ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పోలిస్తే కామారెడ్డిలో అక్రమ నిర్మాణాలు తక్కువని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాదులు సమాధానం ఇస్తూ ఫిర్యాదులో చాలా అంశాలు ఉన్నాయని, అన్ని పరిశీలించి ఆరువారాల్లో తగిన ఉత్తర్వులు జారీచేస్తామని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. వివరణ తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రా, రెరా, ఆయా జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఈనెల 30కి వాయిదాపడింది.

భూగర్భ గనుల మూసివేత!

ఏడు గనులను మూసివేసే దిశగా సింగరేణి!.. జాబితాలో భూపాలపల్లి 6 ఇంక్లయిన్ కూడా

- ప్రమాదంలో 6,511 మంది ఉద్యోగుల భవితవ్యం
- నష్టాలే కారణమంటున్న యాజమాన్యం
- కోల్ ఇండియాతో పోలిస్తే బొగ్గు ధర రెట్టింపు
- భూగర్భ గనుల వల్ల ఏటా రూ.2,200 కోట్ల నష్టం



భూపాలపల్లి కాకతీయఖని-6

(భూపాలపల్లి, ఆంధ్రజ్యోతి)

తెలంగాణకు తలమానికంగా నిలుస్తున్న సింగరేణిలో భూగర్భ గనుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 21 భూగర్భ గనుల్లో ఏడు కీలకమైన గనుల మూసివేత దిశగా అడుగులు పడుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఆ గనులను మూసివేసేందుకు యాజమాన్యం కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా ఈ గనుల్లో ఉత్పాదక వ్యయం పెరిగిపోయి.. నష్టాలు పెరుగుతుండడంతో సింగరేణికి ఈ గనులు శిరోభారంగా మారాయని అంటున్నారు. ఉపరితల గనులు కొంతమేర లక్ష్యాలకు మించి ఉత్పత్తి సాధిస్తుండడంతో నష్టాల లోటు కొంత పూడుతున్నా.. మొత్తంగా భూగర్భ గనుల కారణంగా ఏటా సుమారు రూ.2,200 కోట్ల నష్టాలు వస్తున్నాయి. దీంతో యాజమాన్యం ఈ గనుల కొనసాగింపుపై ఆలోచనలో పడినట్లు సింగరేణి వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల నిర్వహించిన సింగరేణి వార్షిక సమావేశం సందర్భంగా రాబోయే రోజుల్లో మూసివేతకు గురయ్యే బొగ్గు గనుల వివరాలను పరోక్షంగా వెల్లడించారు. ఈ నిర్ణయానికి ఉత్పాదకత తగ్గడం ఒక కారణమైతే.. ఆ గనుల్లో బొగ్గు లభ్యత, నాణ్యతపరమైన సమస్యలు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో మరో ఐదేళ్లకు మించి ఆ గనులను కొనసాగించే అవకాశం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఏడు గనుల్లో పనిచేస్తున్న 6,511 మంది ఉద్యోగుల భవితవ్యం సందిగ్ధంలో పడింది. ఇప్పటికే కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్ ఫీల్డ్స్ సంస్థలు విక్రయిస్తున్న ధరలకు, సింగరేణి ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉండడంతో అటు వాణిజ్యపరంగా కూడా సింగరేణి బొగ్గు.. పరిశ్రమలకు విక్రయించలేని పరిస్థితిని ఎదుర్కొంటోంది. దీంతో భూగర్భ గనులను ఓపెన్‌కాస్ట్‌లుగా మార్చడం లేదా కొత్త గనులను ప్రారంభించడం వంటి అంశాలపైనే ఉద్యోగుల భవితవ్యం ఆధారపడి ఉంటుందని అంటున్నారు.

మూసివేసే గనుల్లో కేటీకే-6

వచ్చే ఐదేళ్లలో మూసివేసే అవకాశం ఉన్న ఏడు భూగర్భ గనుల్లో ప్రధానంగా శ్రీరాంపూర్-1, ఆర్కే-5, ఆర్కే-ఎన్‌టీ, కాకతీయఖని-6, కేకే-5, ఆర్కే-7, ఐకే-1ఎ గనులు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-6 ఇంక్లయిన్ కూడా ఉండడంతో ఇందులో పనిచేస్తున్న ఉద్యోగులను, కార్మికులను ఇతర గనుల్లో సర్దుబాటు చేయాల్సి ఉంటుందని సింగరేణి వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పటికే అన్ని గనుల్లో అవసరానికి మించి ఉద్యోగుల సంఖ్య ఉందని, దానికితోడు 1,250 మందికి పైగా కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొంటున్నారు. మరోవైపు సింగరేణి భూగర్భ గనుల్లో బొగ్గు తవ్వకాల అంశం సంస్థకు గుదిబండగా మారుతోందని యాజమాన్యం గుర్తించింది. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం మార్కెట్లో పోటీ కంపెనీలైన వెస్ట్రన్ కోల్ ఫీల్డ్, కోల్ ఇండియా విక్రయిస్తున్న ధరలతో పోటీ పడలేకపోతోంది. ఆయా కంపెనీలు సింగరేణి అందిస్తున్న ధరలో సగం ధరకే అటు విద్యుత్ సంస్థలు, ఇతర కంపెనీలకు బొగ్గును సరఫరా చేస్తుండడంతో సింగరేణికి నష్టాలు తప్పడం లేదు.

ఇతర కంపెనీలతో పోటీ పడలేక!

సింగరేణిలో అవసరానికి మించి ఉన్న ఉద్యోగుల సంఖ్యతోపాటు బొగ్గు ఉత్పత్తికి అయ్యే ఖర్చుతో పోల్చినప్పుడు మార్కెట్లో లభిస్తున్న ఇతర కంపెనీల ధర తక్కువగా ఉండడం నష్టాలకు కారణమని చెబుతున్నారు. 'ఆంధ్రజ్యోతి' సేకరించిన సమాచారం ప్రకారం గ్రేడ్-5 రకం బొగ్గును సింగరేణి టన్ను రూ.8,713కు విక్రయిస్తుండగా, వెస్ట్రన్ కోల్ ఫీల్డ్ కంపెనీ టన్నుకు రూ.4,872 చొప్పున విక్రయిస్తోంది. అంతకంటే తక్కువగా కోల్ ఇండియా రూ.4,321కే టన్ను చొప్పున విద్యుత్ సంస్థలకు అందిస్తోంది. ఇక ప్రైవేట్, ఇతర కంపెనీల విషయానికొస్తే సింగరేణి టన్ను రూ.8,710కు విక్రయిస్తుంటే.. వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ కంపెనీ రూ.4,909కి అందిస్తోంది. కోల్ ఇండియా రూ.4,355కు టన్ను చొప్పున జీ-5 గ్రేడ్ బొగ్గును విక్రయిస్తోంది. ధరల్లో ఇంత భారీ వ్యత్యాసం ఉండడం వల్ల ఆయా కంపెనీలతో సింగరేణి పోటీ పడలేకపోతోందని చెబుతున్నారు. ఈ అంశాలన్నీ భూగర్భ గనుల మూసివేత దిశగా యాజమాన్యాన్ని పురిగొల్పుతున్నాయని భావిస్తున్నారు.

నాగారం భూములపై వారంలో నివేదిక ఇవ్వండి

- రంగారెడ్డి కలెక్టర్‌కు హైకోర్టు మరోసారి ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో సర్వే నెంబర్లు 181, 182, 194, 195లలో ఉన్న భూములపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సీ నారాయణరెడ్డికి హైకోర్టు మరోసారి ఆదేశాలు జారీచేసింది. ఇవి భూదాన్ భూములా, కాదా అన్న దానిపై వివాదం ఉండడంతో వాటి స్వరూపాన్ని మార్చరాదని గతంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నిర్మాణాలు కొనసాగిస్తున్నారని పేర్కొంటూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. నిర్మాణాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది. తాజాగా శుక్రవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రంగారెడ్డి కలెక్టర్ నివేదిక ఇవ్వకపోవడాన్ని గమనించి, మరోవారం రోజుల గడువు ఇచ్చింది.

పటాన్‌చెరు ఎమ్మెల్యే ఎన్నికపై పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన ఎలక్షన్ పిటిషన్‌ను కొట్టేసింది. ఎమ్మెల్యేగా ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించాలని కోరుతూ ప్రత్యర్థి కాటం శ్రీనివాస్‌గౌడ్ హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ (ఈపీ) దాఖలు చేశారు. తప్పుడు ఆరోపణలు, అబద్ధాల ఆధారంగా ఈపీ దాఖలు చేశారని, దానిని కొట్టివేయాలని కోరుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం ఎలక్షన్ పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పు వెలువరించింది.





ఆక్రమించుకున్న భూమి చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్; కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది

750 కోట్ల స్థలం కబ్జా

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. గాజులరామారంలోని మహదేవపురంలో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన 3.50 ఎకరాల స్థలాన్ని కొందరు ఆక్రమించారు. మేడ్చల్ ఏజీ ఆఫీస్ ఉద్యోగులకు చెందిన హౌసింగ్ సొసైటీ లే అవుట్‌లో పార్కులు, రోడ్లు, ఇతర అవసరాలకు ఉద్దేశించిన 3 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. ఈ రెండు ప్రాంతాల్లోని భూమి విలువ రూ.350 కోట్ల వరకు ఉంటుందని హైడ్రా వర్గాలు తెలిపాయి. ఈ భూముల్లోని ఆక్రమణలు తొలగించిన అధికారులు.. వాటిని స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారంలోని సర్వే నంబర్ 76/ఏలో కొన్నేళ్ల క్రితం సుమారు 9.24 ఎకరాల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేశారు.

ఇందులో సుమారు 680 చదరపు గజాల స్థలాన్ని పార్కు కోసం వదిలేశారు. ప్రస్తుతం ఈ లేఅవుట్‌లో లక్ష్మీగణపతి కాలనీ వెలసింది. పార్కు స్థలంలో 2016లో ఓ గదితోపాటు చుట్టూ ప్రహరీ నిర్మించిన ఓ వ్యక్తి 270 చ.గ. స్థలం తనదని చెప్పడంతో కాలనీవాసులు హైడ్రాను ఆశ్రయించారు. ఇరు వర్గాల డాక్యుమెంట్లను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. అది పార్కు స్థలంగా గుర్తించారు. ఆయన ఆదేశాల మేరకు గది, ప్రహరీ కూల్చి.. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. పార్కు స్థలం విలువ రూ.2.50 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

'రైడెన్'కు రైట్‌రైట్!

87,500 కోట్లతో విశాఖలో డేటా సెంటర్

- గూగుల్ అనుబంధ సంస్థ పెట్టుబడికి క్యాబినెట్ ఆమోదం
- భూమి ధరలో 25% రాయితీ
- స్టాంపు డ్యూటీ రద్దు
- ఎస్‌జీఎస్‌టీ 100 శాతం రాయితీ
- సబ్సిడీపై విద్యుత్ సరఫరా
- తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురంలో 3 డేటా సెంటర్ క్యాంపస్‌లు
- 14న సీఎం, వైష్ణవ్, లోకేశ్ సమక్షంలో ప్రకటన చేయనున్న గూగుల్
- 13న ఢిల్లీకి చంద్రబాబు, లోకేశ్
- ప్రధానిని ముఖ్యమంత్రి కలిసే అవకాశం!

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ విశాఖలో రూ.87,500 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ)తో ఒక గిగావాట్ సామర్థ్యంతో భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ పెట్టుబడిని రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదించింది. రైడెన్ రూ.87,500 కోట్లతో విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురంలో 500 ఎకరాల్లో మూడు క్యాంపస్‌లతో కూడిన డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో తొలిసారిగా భారీ ఎఫ్‌డీఐతో వస్తున్న ఈ సంస్థకు 25 శాతం రాయితీకి భూములివ్వాలని.. వాటికి పూర్తిగా స్టాంపు డ్యూటీ మినహాయింపు ఇవ్వాలని, 100 శాతం ఎస్‌జీఎస్‌టీ రాయితీ ఇవ్వాలని ప్రతిపాదించారు. వీటితో పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ పూర్తి మినహాయింపు, పది శాతం క్యాపిటల్ సబ్సిడీ ఇవ్వాలన్న ప్రతిపాదనను కూడా క్యాబినెట్ ఆమోదించింది. మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనలు వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు స్పందించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై కొత్త విశ్వాసం కనిపిస్తోందని.. టీసీఎస్, కాగ్నిజెంట్ సహా.. ప్రపంచ ప్రఖ్యాత గూగుల్, ఐబీఎం వంటి సంస్థలు రాష్ట్రంలో వ్యాపార కార్యకలాపాలు చేపట్టేందుకు ముందుకొచ్చాయన్నారు. విశాఖ నగరం భవిష్యత్‌లో ఐటీ రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకుంటుందన్న ధీమా వ్యక్తం చేశారు. కాగా.. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి 14న ఢిల్లీలో ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. ఇందుకోసం చంద్రబాబు, లోకేశ్ 13న ఢిల్లీ వెళ్లనున్నారు. వీరితోపాటు కేంద్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమక్షంలో డేటా సెంటర్ ఏర్పాటు ఒప్పందంపై గూగుల్, రైడెన్ సంస్థల ఉన్నతాధికారులు సంతకాలు చేసి అధికారిక ప్రకటన చేస్తారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం ప్రధాని మోదీని కూడా కలిసే అవకాశం ఉంది.

ధర్మపురి అరవింద్ బీసీ ద్రోహి

- ఆయనకు తలపై వెంట్రుకలే కాదు.. తలకాయలో గుజ్జు కూడా లేదు: బల్మూరి వెంకట్

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు నెత్తిమీద వెంట్రుకలు మాత్రమే కాకుండా.. తలకాయలో గుజ్జు కూడా లేదనిపిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఒక బీసీ బిడ్డగా.. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లుల ఆమోదానికి ఒత్తిడి చేయని అరవింద్.. బీసీ ద్రోహి అని ఆరోపించారు. బీసీల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టి ఇక్కడ సానుభూతి మాటలు మాట్లాడితే నమ్మే స్థితిలో జనం లేరని తెలిపారు. శుక్రవారంనాడు సీఎల్పీ మీడియా హాల్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అరవింద్ అసలు సిసలు బీసీ అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కేంద్రాన్ని నిలదీయాలని, ఢిల్లీలో ఆమరణ దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు ఉరికిస్తారని హెచ్చరించారు. ఇక ఎమ్మెల్సీ కవిత తన రాజకీయం కోసం నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని బల్మూరి వెంకట్ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగినప్పుడు ఆమె ఎక్కడున్నారని ప్రశ్నించారు. కొందరు కోచింగ్ సెంటర్ల యజమానులు ఆమెతో కలిసి నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారని, నిరుద్యోగులు కవిత మాయలో పడొద్దని అన్నారు.

జూడాల మానసిక ఆరోగ్యానికి హెల్ప్‌డెస్క్ ప్రారంభం

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) వైద్య విద్యార్థులు, రెసిడెంట్లు, జూనియర్ డాక్టర్ల కోసం ప్రత్యేకంగా 'ఈడీటీ-జూడా' అనే మానసిక ఆరోగ్య హెల్ప్‌డెస్క్, పీర్-సపోర్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ నరేంద్ర కుమార్, టీపీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి సమక్షంలో ఆవిష్కరించారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నివేదికల ప్రకారం గత ఐదేళ్లలో భారత్‌లో 119 మంది వైద్య విద్యార్థులు (64 ఎంబీబీఎస్, 55 పీజీ విద్యార్థులు) ఆత్మహత్య చేసుకున్నారు. ఈ నేపథ్యంలో "ఈడీటీ-జూడా" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈడీ అంటే ఎమోషనల్ డెవలప్‌మెంట్ అని, శిక్షణ పొందిన వారితో ఈ హెల్ప్‌డెస్క్‌ను నిర్వహించనున్నట్లు జూడా నేతలు తెలిపారు. వైద్యులపై తీవ్రమైన పని ఒత్తిడితో వారి మానసిక ఆరోగ్య సంరక్షణకు దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు టీజూడా ఓ ప్రకటనలో పేర్కొంది.

సివిల్ సర్జన్ పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వండి: టీజీజీడీఏ డిమాండ్

ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో సివిల్ సర్జన్ పోస్టింగ్ ఆర్డర్ల జారీలో తీవ్ర జాప్యం నెలకొంటోందని, వెంటనే పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ) అధ్యక్షుడు డాక్టర్ నరహరి శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సివిల్ సర్జన్ పోస్టింగ్ ఆర్డర్ల ఆలస్యం వల్ల డిప్యూటీ సివిల్ సర్జన్ల పోస్టింగ్ ఆర్డర్ల జారీ నిలిచిపోయిందన్నారు. పదోన్నతి ప్రక్రియ చాలా కాలం క్రితమే పూర్తయినా ఇప్పటికీ ఆర్డర్లు విడుదల కాలేకపోవడం వల్ల డాక్టర్ల హక్కులు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఇక తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది జీతాల చెల్లింపులో తీవ్ర ఆలస్యం జరుగుతోందన్నారు. టీవీవీపీలో 80 ఆస్పత్రులకు తగిన సిబ్బంది లేరని, సిబ్బంది పునర్విభజన ఇప్పటివరకు జరగలేదని తెలిపారు. ఈ సమస్యపై కమిషనర్ కార్యాలయం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తూ, బాధ్యతను డీఎస్‌హెచ్ ఫైల్‌పై నెట్టివేస్తోందని ఆరోపించారు. దీంతో ఆస్పత్రుల పనితీరు తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. టీవీవీపీని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ (డీఎస్‌హెచ్)గా మార్చాలని టీజీజీడీఏ డిమాండ్ చేసింది.

మనల్ని ఎవడ్రా ఆపేది.. అనుకున్నాడేమో!

- రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్ లేకుండా 13 ఏళ్లుగా రయ్‌రయ్
- ద్విచక్రవాహనదారుడికి రెండు రోజుల జైలు శిక్ష

చాదర్‌ఘాట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కొత్త వాహనాన్ని కొనుగోలు చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ చేయించే విషయంలో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. నిర్దేశిత గడువు ముగిసినా రిజిస్ట్రేషన్ చేయించకుండా కొందరు.. మనల్ని ఎవడ్రా ఆపేది అనే తీరులో ధీమాగా రోడ్లపై తిరిగేస్తుంటారు. ఇలా ఒకటి, రెండు కాదు ఏకంగా 13 ఏళ్ల రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్ లేకుండా హైదరాబాద్ రోడ్లు చుట్టేసిన ఓ ద్విచక్రవాహనదారుడు ఇటీవల వాహన తనిఖీల్లో పట్టుబడ్డాడు. అంతేనా.. జైలు పాలై తన బాధ్యతారాహిత్యానికి మూల్యం చెల్లించుకున్నాడు. ఇందుకు సంబంధించి మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్, నాగోల్ ప్రాంతానికి చెందిన అవునా నాగదత్తు(33) తన ద్విచక్ర వాహనానికి 13 ఏళ్ల నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. నంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై నడుపుతున్నాడు. అయితే, అక్టోబరు 9న మలక్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు చేస్తుండగా.. అదే సమయంలో నంబర్ ప్లేట్ లేని వాహనంపై వస్తున్న నాగదత్తును ఆపారు. దాదాపు 13 ఏళ్లుగా నాగదత్తు ద్విచక్ర వాహనానికి రిజిస్ట్రేషన్ చేయించుకుండా నడుపుతున్నట్టు గుర్తించారు. దీంతో మోటారు వాహనాల చట్టం ప్రకారం నాగదత్తుపై కేసు నమోదు చేసి నాంపల్లిలోని 7వ మెట్రో పాలిటన్ స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితుడు నాగదత్తుకు రెండ్రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఒకే బండిపై 277 పెండింగ్ చలాన్లు

- 79,845 జరిమానా, ద్విచక్రవాహనం సీజ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు అంటే లెక్క లేదో.. ట్రాఫిక్ పోలీసులంటే భయం లేదో మరీ.. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి రోడ్డుపై రెచ్చిపోయాడు. తన ద్విచక్రవాహనంతో ఇష్టారీతిన తిరిగి ఐదేళ్లలో 277 సార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడ్డాడు. ఆ 277 చలాన్లకు సంబంధించి రూ.79,845 జరిమానా బకాయి పడ్డాడు. కరీంనగర్ సిక్కువాడీ ప్రాంతంలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు.. ఓ ద్విచక్రవాహనానికి సంబంధించిన ఈ రికార్డులు చూసి షాకయ్యారు. కరీంనగర్‌లోని గోదాం గడ్డకు చెందిన అబ్దుల్ ఖయ్యూమ్ (37) ఆర్ఎంపీ ప్రాక్టిషనర్‌గా పని చేస్తుంటారు. ఖయ్యూమ్‌కు చెందిన టీఎస్ 02 ఇఎక్స్ 1395 నంబర్ ద్విచక్రవాహనంపై 2019 జూన్ 8 నుంచి 2024 డిసెంబరు 25 మధ్య కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో 277 చలాన్లు పడ్డాయి. వీటికి సంబంధించి రూ.79,845 జరిమానా నమోదైంది. ఇన్ని చలాన్లు పెండింగ్‌లో ఉండడంతో పోలీసులు ఆ ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు.

ప్రపంచ దేశాలన్నీ కలిసి అభివృద్ధి చెందాలి

- ఐరాస వేదికపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ

న్యూయార్క్, అక్టోబరు 10: ప్రపంచ దేశాలన్నీ కలిసి అభివృద్ధి చెందాలన్నదే భారత్ ఆశయమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సంక్షోభంలో ఉందని, ఇలాంటి సమయంలో ప్రపంచ వాణిజ్య సమ్మిళిత వృద్ధికి ఇంజిన్‌లా పనిచేయాలని అభిప్రాయపడ్డారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్య సమితి రెండో కమిటీలోని 'మ్యాక్రో ఎకనామిక్ పాలసీ ప్రశ్నలు, ఫైనాన్సింగ్ ఫర్ డెవలప్‌మెంట్'పై సాధారణ చర్చలో భారత్ తరఫున ఎంపీ వంశీకృష్ణ ప్రసంగించారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు అవసరమని, అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను ప్రపంచ వేదికలపై వినిపించాలన్నది భారత్ అభిప్రాయమని తెలిపారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) ఆధ్వర్యంలో ఉన్న అంతర్జాతీయ వ్యాపార నియమాలకు దేశాలన్నీ కట్టుబడి ఉండాలని సూచించారు.

సుప్రీంకు రాష్ట్ర ప్రభుత్వం?

- హైకోర్టు స్టేపై అప్పీలు యోచన
- న్యాయ నిపుణులతో మంతనాలు
- శుక్రవారమే కెవియట్ వేసిన మాధవరెడ్డి
- తమ వాదనలు ముందు వినాలని పిటిషన్

హైదరాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తామిచ్చిన జీవో నంబర్ 9 మీద హైకోర్టు స్టే ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో దాన్ని వెకేట్ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచన రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. అసలు అప్పీలుకు వెళ్లాలా? వద్దా? అనే విషయమై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నారు. అయితే, జీవో నంబరు 9 మీద హైకోర్టులో పిటిషన్ వేసి స్టే సంపాదించిన బుట్టెంగారి మాధవరెడ్డి తదితరులు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వస్తుందనే అంచనాతో శుక్రవారమే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేస్తే తమ వాదనలు విన్న తర్వాతే తగిన ఉత్తర్వులు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో కెవియట్ పిటిషన్ వేశారు.

హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలి

- అత్యుత్తమ సదుపాయాలు కల్పించాలి: మంత్రి అడ్లూరి

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యత, సరఫరాపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. శుక్రవారం సచివాలయంలో సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి సబ్యసాచి ఘోష్, వివిధ శాఖల కార్యదర్శులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. హాస్టళ్లకు నాణ్యత కలిగిన ఆహార పదార్థాలు, ఇతర సరుకులు సరఫరా చేసేలా చూడాలని, అవన్నీ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్ల ఆధునికీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

సుద్దాల హనుమంతుకు జూపల్లి నివాళులు

తెలంగాణ సాయుధ రైతాంగ సాంస్కృతిక పోరాట యోధుడు, ప్రజాకవి సుద్దాల హనుమంతు వర్ధంతి సందర్భంగా శుక్రవారం రవీంద్రభారతిలో ఆయన చిత్రపటానికి మంత్రి జూపల్లి కృష్ణారావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుద్దాల హనుమంతు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తన సాహిత్యం ద్వారా ప్రజల్లో స్ఫూర్తి నింపారని కొనియాడారు. తెలంగాణ కోసం జరిగిన ప్రజాస్వామ్య పోరులో సుద్దాల స్ఫూర్తి ఇమిడి ఉంద న్నారు.

ఖమ్మంలో టీటీడీ ఆలయం

- సోమవారం స్థలం ఎంపిక.. మంత్రి తుమ్మల వెల్లడి



హైదరాబాద్, ఖమ్మం, భద్రాచలం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మంలో వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ నేతృత్వంలో అధికారుల బృందం సోమవారం ఖమ్మంలో పర్యటించి స్థలాన్ని ఎంపిక చేస్తుందని చెప్పారు. సచివాలయంలో దేవాదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరి శైలజా రామయ్యర్‌తో పాటు అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులపై కూడా సమీక్షించారు.

మల్కాజిగిరి నర్సింహస్వామి ఆలయ భూములపై విచారణ జరిపించాలి: ఎఫ్‌జీజీ

హైదరాబాద్ నగరంలోని మల్కాజిగిరి జయగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ భూములను ఒక కాంట్రాక్టరు పేరు మీద రిజిస్టర్ చేసిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) కోరింది. ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 2003లో ఈ భూములను ఓ కాంట్రాక్టర్‌కు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని లేఖలో తెలిపారు. దీనిపై విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ విచారణ జరిపి, 2014లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని, అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ సూచించారని వివరించారు. అయితే నాటి ప్రభుత్వం ఆ నివేదికను పక్కన పెట్టిందని, ఇప్పుడు ఆ భూముల్లో భవన నిర్మాణాలు మొదలయ్యాయని, సమగ్ర విచారణ జరిపించి, ఆలయ భూములను పరిరక్షించాలన్నారు.

కాళేశ్వరం బాధ్యులపై చర్యలకు కసరత్తు


హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు కేసులో షోకాజ్ నోటీసులు అందుకొని, సంజాయిషీ ఇచ్చిన వారిపై తదుపరి చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. వీరిపై ఏం చర్యలు తీసుకోవాలనే దాన్ని పరిశీలించి, తగిన అభిప్రాయం వ్యక్తం చేయాలని చీఫ్ ఇంజనీర్(ఎంక్వయిరీస్)ను ప్రభుత్వం ఆదేశించింది. దాంతో 38 మంది ఇచ్చిన సంజాయిషీపై అధ్యయనానికి సీఈ(ఎంక్వయిరీస్) విభాగం పూనుకుంది. నోటీసులు అందుకున్న 38 మందిలో 22 మంది దాకా సర్వీసులో ఉండగా... వీరికి పదోన్నతులు ఇవ్వలేదు. వీరిపై మళ్లీ శాఖపరమైన విచారణ కోసం ప్రభుత్వం కమిటీని వేయనుంది.

కేటీపీఎస్‌లో కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం

- 800 మెగావాట్ల రెండు యూనిట్లకు.. పీఎఫ్ఆర్ తయారీకి ప్రైవేటు సంస్థకు బాధ్యతలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచలో ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లను కొత్తగా నిర్మించాలని తెలంగాణ జెన్‌కో నిర్ణయించింది. అల్ట్రా సూపర్ క్రిటికల్ విధానంలో కట్టే ఈ రెండు యూనిట్ల ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్) తయారీ బాధ్యతను న్యూఢిల్లీకి చెందిన డిసైన్ అనే సంస్థకు కట్టబెట్టింది. ఈ ప్రాంతంలో 1,800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. గతంలో 30 ఏళ్లు దాటిన పవర్ ప్లాంట్లు అన్నీ మూసివేయాలన్న కేంద్రం ఆదేశాలతో 720 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్లను ఇదివరకే పాల్వంచలో మూతపెట్టారు. వాస్తవానికి కేటీపీఎస్ ఏడో దశ 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ విద్యుత్ కేంద్రానికి అనుమతినిచ్చిన షరతుల్లోనే పాత కేంద్రాలన్నీ మూసివేయాలని ఉంది. కాగా 720 మెగావాట్ల ప్లాంట్ల స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు కట్టాలని తెలంగాణ ప్రభుత్వం ఇదివరకే నిర్ణయం తీసుకుంది. జెన్‌కోకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రానున్న నవంబరు తొలివారంకల్లా పీఎఫ్ఆర్ సిద్ధం కానుంది. ఆ తర్వాత డీపీఆర్‌ను సిద్ధం చేసి, అనుమతి కోసం కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖతో పాటు విద్యుత్ అథారిటీకి దరఖాస్తు చేయనున్నారు.

నారా భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు



అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు - 2025ను ప్రకటించింది. ప్రజాసేవ, సామాజికంగా ప్రభావితం చేసే అంశాల్లో కీలకంగా పనిచేసినందుకు గాను ఆమెకు ఈ అవార్డును ప్రకటించారు. లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్‌లో నవంబరు 4న జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందజేస్తారు. గతంలో ఈ అవార్డును దక్కించుకున్న వారిలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, హిందుజా గ్రూప్ కో-చైర్మన్ గోపీచంద్, ఆదిత్య బిర్లా సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ఛైర్‌పర్సన్ రాజశ్రీ బిర్లా తదితరులు ఉన్నారు.

హైకోర్టు స్టేకు నిరసనగా 14న తెలంగాణ బంద్

- అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలి
- మిలియన్ మార్చ్ తరహాలో బీసీ ఉద్యమానికి కార్యాచరణ: ఆర్.కృష్ణయ్య
- రాజ్యాధికారంతోనే బీసీల సమస్యల పరిష్కారం: మధుసూదనాచారి

బర్కత్‌పుర/రాంనగర్/పంజాగుట్ట/హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించిన 42% రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ అన్ని బీసీ సంఘాలతో కలిసి ఈ నెల 14న రాష్ట్ర బంద్ నిర్వహిస్తున్నట్లు బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో 22 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల సాధన ఇప్పుడు ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు. మిలియన్ మార్చ్ తరహాలో బీసీ ఉద్యమాన్ని నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని, శాంతియుతంగా ఈ ఉద్యమం చేపడతామన్నారు. ఇటు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో, విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంఘాల సమావేశాల్లోనూ ఇదే విషయమై ఆయన మాట్లాడారు. మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీలు బిచ్చగాళ్లు కాదని.. వాటాదారులనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలన్నారు. రాజ్యాధికారంతోనే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. 42% రిజర్వేషన్లు బీసీలకు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

13న జాతీయ రహదారుల దిగ్బంధం: జాజుల

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను నిరసిస్తూ ఈనెల 13న రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులను దిగ్బంధం చేయాలని నిర్ణయించినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. మీడియాతో జాజుల మాట్లాడుతూ.. శనివారం మధ్యాహ్నం బంజారాహిల్స్ కళింగభవన్‌లో అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాలు, కుల సంఘాల నేతలు, మేధావులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

అంజన్ అలక.. బుజ్జగింపు!

జూబ్లీహిల్స్ టికెట్ దక్కకపోవడంతో ఆగ్రహం.. స్థానికుడే అభ్యర్థి అన్నది వంక మాత్రమే

- కామారెడ్డి, మల్కాజిగిరిలో స్థానికేతరుడు పోటీ చేయలేదా?
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎక్కడైనా పోటీ చేయొచ్చు: అంజన్‌కుమార్
- వెంటనే అంజన్ కార్యాలయానికి మీనాక్షి, మంత్రులు పొన్నం, వివేక్
- బుజ్జగింపు.. మెత్తబడ్డ అంజన్



అంజన్‌కుమార్ నివాసంలో భేటీ అయిన మీనాక్షి, వివేక్, పొన్నం తదితరులు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక.. ఆశావహులను అసంతృప్తికి గురిచేసింది. తమకు టికెట్ దక్కనందుకు వారు అలకబూనడంతో అధిష్ఠానం ప్రతినిధులు రంగంలోకి దిగి బుజ్జగించాల్సి వచ్చింది. ప్రధానంగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అలకబూనడం పార్టీని ఆందోళనకు గురి చేసింది. తనకు టికెట్ దక్కకపోవడంపై శుక్రవారం ఉదయం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అంజన్‌కుమార్.. కార్యకర్తలతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానంటూ బాంబు పేల్చారు. దీంతో అప్రత్తమైన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయన కార్యాలయానికి వెళ్లి బుజ్జగించారు. వాస్తవానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై సర్వేలు నిర్వహిస్తున్నప్పుడే.. టికెట్ తనకే ఇవ్వాలని, గెలిచాక మంత్రి పదవీ ఇవ్వాలని అంజన్‌కుమార్ డిమాండ్ చేసిన విష యం తెలిసిందే. అనంతరం నియోజకవర్గ ఓటర్లకు హామీలిస్తూ అంజన్‌కుమార్ పేరిట పోస్టర్లు వెలిశాయి. టికెట్ రేసులో ఆయన చివరిదాకా పోటీ పడ్డారు. అయితే పలు అంశాల ఆధారంగా అధిష్ఠానం.. నవీన్ యాదవ్‌ను అభ్యర్థిగా బుధవారం ప్రకటించింది. దీనిపై గురువారం మౌనంగానే ఉన్న అంజన్‌కుమార్.. శుక్రవారం తన అసంతృప్తిని బయటపెట్టారు.

ఒరిజినల్ నేతలకు 200 శాతం అన్యాయం

తన కార్యాలయంలో అంజన్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఫలానా అభ్యర్థిని నిర్ణయిస్తున్నట్లుగా తనకు మాట వరసకైనా చెప్పలేదన్నారు. గతంలో ఒకాయన కామారెడ్డి, మల్కాజిగిరిలో పోటీ చేసినప్పుడు రాని లోకల్, నాన్‌లోకల్ సమస్య.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనే ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో తాను ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చునని చెప్పారు. స్థానిక అభ్యర్థి అన్నది ఒక వంక మాత్రమేనన్నారు. తనకు టికెట్ రాకుండా చేసిందెవరో తర్వాత చెబుతానన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేశానని, కనీసం జూబ్లీహిల్స్ కమిటీలోకి కూడా తనను తీసుకోలేదని తప్పుబట్టారు. ఒరిజినల్ కాంగ్రెస్ నేతలకు రెండొందల శాతం అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. దీంతో విషయం తెలుసుకున్న మీనాక్షీ నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి.. అంజన్ కార్యాలయానికి వెళ్లి ఇది అధిష్ఠానం నిర్ణయమని చెప్పారు. భవిష్యత్తులో ప్రాధాన్యం ఇస్తామని నచ్చజెప్పారు. మీనాక్షి బుజ్జగింపుతో మెత్తబడ్డ అంజన్.. మధ్యాహ్నానికి అలక వీడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ చర్యలతో తాను మనస్తాపానికి గురయ్యానని, కానీ.. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తనకు ముఖ్యమని అన్నారు. అయితే పార్టీ కష్టకాలం లో వెంట ఉన్న తనను ఇప్పుడు పక్కన పెడతారా అని ఆవేదన వ్యక్తం చేశారు.

ముషీరాబాద్‌లో గెలిస్తే మంత్రి అయ్యేవారు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అంజన్‌కుమార్‌యాదవ్.. అప్పుడు గెలిచి ఉంటే మంత్రి అయ్యేవారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు అంజన్‌కుమార్ పెద్ద దిక్కుగా ఉంటూ వస్తున్నారని తెలిపారు. కంటోన్మెంట్‌లో గెలిచినట్లుగానే.. జూబ్లీహిల్స్‌లోనూ కాంగ్రెస్ గెలవబోతోందని, అంజన్ కుమార్ ముందుండి పార్టీని నడిపిస్తారన్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ మరో ఇద్దరు నేతలు రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గుర్రం మురళీగౌడ్ గురువారం నుంచి పార్టీ అగ్రనేతలకు ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. దీంతో శుక్రవారం సాయంత్రం మంత్రులు వివేక్, పొన్నం, ఏఐసీసీ ఎన్నికల ఇన్‌చార్జి విశ్వనాథన్ తదితరులు సీఎన్ రెడ్డి, మురళీగౌడ్ ఇళ్లకు వెళ్లారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, మున్ముందు సముచిత గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇక మరో ఆశావహురాలు కంజర్ల విజయలక్ష్మితోనూ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదని సమాచారం. ఇదిలా ఉండగా.. అంజన్ అలకబూనడం, మీనాక్షి వెళ్లి బుజ్జగించడం గాంధీభవన్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

గురుకులాల్లో అత్యవసర ఖర్చులకు రూ.60 కోట్లు!

- సీఎం సహాయనిధి నుంచి కేటాయింపు
- బడ్జెట్ కేటాయింపులకు ఇవి అదనం
- భవనాలు, టాయిలెట్ల మరమ్మతులు, ఇతర చిన్న సమస్యల పరిష్కారానికి వినియోగం

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పన కోసం అత్యవసర ఖర్చుల కింద ప్రభుత్వం కొంత నిధిని అందించింది. ఎస్సీ, బీసీ గురుకులాలకు రూ.20 కోట్ల చొప్పున, ఎస్టీ, మైనార్టీ గురుకులాలకు రూ.10 కోట్ల చొప్పున.. మొత్తం రూ.60 కోట్లను ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి కేటాయించింది. 2025-26 బడ్జెట్‌లో చేసిన కేటాయింపులకు ఈ నిధులు అదనం కావడం గమనార్హం. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కలిపి 851 గురుకుల పాఠశాలలు, కాలేజీలు ఉండగా వాటిలో 4,89,916 మంది, 86 డిగ్రీ కాలేజీల్లో 68,500 మంది చదువుతున్నారు. పలుచోట్ల గురుకుల భవనాల్లో చిన్న చిన్న సమస్యలు తలెత్తుతుండటం, టాయిలెట్ల మరమ్మతులు చేయాల్సి వస్తుండటం ఇబ్బందిగా మారింది. ఈ అంశం సీఎం దృష్టికి వెళ్లడంతో ఇలాంటి చిన్న చిన్న సమస్యల వల్ల పిల్లలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఈ క్రమంలో అధికారులు ఎంతమేర నిధులు అవసరమనే దానిపై పరిశీలన జరిపారు. ఆ మేరకు రూ.60 కోట్లను సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేయడంతోపాటు చెక్కులనూ అందించారు.

బిల్లుల మంజూరుకు వేచి చూడాల్సిన పనిలేదు

రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయానికి మరమ్మతులు చేస్తుంటారు. అయినా మధ్యలో చిన్నచిన్న సమస్యలు తలెత్తుతుంటాయి. వాటిని సరిచేయించాలంటే.. ఆ పనుల వివరాలన్నింటినీ పేర్కొంటూ గురుకులాల కార్యదర్శులు ప్రభుత్వానికి లేఖలు రాయాలి. ఆమోదం వచ్చాక, చేసిన పనులకు బిల్లుల కోసం ఆర్థిక శాఖవైపు చూడాల్సి వస్తోంది. దీనితో జాప్యం జరుగుతోంది. మరమ్మతుల పనులు చేయాలంటే గుత్తేదారులు ముందుకు రావడంలేదు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం గురుకులాల కార్యదర్శుల స్థాయిలోనే నిధులు మంజూరు అయ్యేలా ఏర్పాట్లు చేసింది.

వరద జలాల్లో రాష్ట్రాల వాటాను తేల్చండి

- వాటి ఆధారంగా ప్రాజెక్టులను పరిశీలిస్తే మా ప్రాజెక్టుల డీపీఆర్‌లు కూడా ఇస్తాం
- పోలవరం-బనకచర్లపై మహారాష్ట్ర మెలిక
- కేంద్ర జలశక్తి శాఖకు లేఖ

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో వరద జలాలపై ప్రతి రాష్ట్రానికి అధికారం ఉంటుందని, పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును వరద జలాలపై ప్రతిపాదించినందున.. వరద జలాల్లోనూ రాష్ట్రాల వాటాను తేల్చాలని మహారాష్ట్ర స్పష్టం చేసింది. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)పై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర జలశక్తి శాఖ గోదావరి జలాలను పంచుకునే రాష్ట్రాలను కోరగా.. మహారాష్ట్ర లేఖ ద్వారా పై విధంగా తెలియజేసింది. వరద ఆధారిత ప్రాజెక్టులను పరిశీలించడానికి కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)వద్ద ఏమైనా మార్గదర్శకాలు ఉంటే.. మహారాష్ట్ర కూడా డీపీఆర్‌లను సమర్పిస్తుందని, అందుకు తగిన సమాచారం అందించాలని కోరింది. గోదావరి ట్రైబ్యునల్‌లోని క్లాజ్-4 ప్రకారం కేటాయింపులు ఉంటే.. వాటి ప్రకారం దక్కిన గోదావరి జలాలను ఏ ప్రాంతానికైనా తరలించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉందని తెలిపింది. మహారాష్ట్రలోని విదర్భ, మరాఠ్వాడ ప్రాంతాల్లో తీవ్ర దుర్భిక్షం ఉందని, ఆ కరువు పీడిత ప్రాంతాలకు వరద జలాలను మళ్లించడానికి ప్రాజెక్టులు చేపడతామని తెలిపింది. పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ నుంచి వరదల సమయంలో రోజుకు 2 టీఎంసీల చొప్పున 243 టీఎంసీలను తరలించడానికి వీలుగా పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించిన విషయం విదితమే. దాంతో ఆ ప్రాజెక్టు ద్వారా తరలించే జలాలను కృష్ణా నదిలో పోస్తున్నందున ఆ నదిని పంచుకునే రాష్ట్రాలకు కృష్ణా ట్రైబ్యునల్-1లోని క్లాజ్-14(బీ) ప్రకారం ఆ నీటిని కోరే అధికారం ఉంటుందని మహారాష్ట్ర పేర్కొంది. ఈ క్లాజు ఆధారంగానే పోలవరం నుంచి కృష్ణా డెల్టా సిస్టమ్(కేడీఎస్)కు తరలించే 80 టీఎంసీలకు బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీలు వినియోగించుకోవడానికి వీలు కల్పించారని, ఇలా ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీలు, కర్ణాటకకు 21 టీఎంసీలు, మహారాష్ట్రకు 14 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు లభించిందని గుర్తుచేసింది. ఈ లెక్కన 243 టీఎంసీల నీటిని తరలించాలని యోచిస్తున్నందున.. ట్రైబ్యునల్‌లోని క్లాజు ఆధారంగా ఆ నీటిని అన్ని రాష్ట్రాలకు పంచాలని తెలిపింది. అలాగే గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా మరో నాలుగు ఇంట్రా లింక్‌ల ద్వారా గోదావరి జలాలను ఏపీ తరలిస్తున్నందున.. ఆ నీటిలో కూడా మహారాష్ట్రకు వాటా ఇవ్వాలని కోరారు. నాలుగు ఇంట్రాలింక్‌ల కింద తరలించే నీటిలో వాటాతో పాటు పోలవరం-బనకచర్ల కింద తరలించే నీటిలో మహారాష్ట్రకు తగిన వాటాను కేటాయించాలని కోరింది. మరోవైపు ఏపీ ప్రభుత్వం పోలవరం-బనకచర్ల అనుసంధానం డీపీఆర్ తయారీ కోసం టెండర్లు పిలుస్తూ ఈ నెల 8వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ప్రాజెక్టును ఏ విధంగానైనా ముందుకు తీసుకెళ్లాలని ఏపీ యోచిస్తున్న విషయం విదితమే.

లొంగిపోండి.. ఏమీ చేయం

- జనజీవన స్రవంతిలోకి వచ్చే మావోయిస్టులకు సేఫ్ పాసేజ్ ఇస్తాం: డీజీపీ
- లొంగిపోయిన నక్సల్స్ నేతలు



లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు అందజేస్తున్న డీజీపీ

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆయుధాలను వదిలి, జనజీవన స్రవంతిలోకి రావడానికి ఇష్టపడే మావోయిస్టులకు అడవుల నుంచి సేఫ్ పాసేజ్ ఇస్తామని.. వారికి ఎలాంటి హాని కల్పించబోమని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, మీడియా, రాజకీయ నాయకులు, బంధుమిత్రుల్లో ఎవరి ద్వారానైనా సరే.. లొంగుబాటు సమాచారం అందిస్తే చాలని ఆయన పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు రాష్ట్ర కమిటీ నాయకులు శుక్రవారం డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. వారి వివరాలను డీజీపీ శుక్రవారం తన కార్యాలయంలో వెల్లడించారు. ఆ ముగ్గురూ సిద్దిపేట జిల్లా మద్దూర్ మండలం కూటిగల్ గ్రామానికి చెందిన కుంకటి వెంకటయ్య అలియాస్ రమేశ్ అలియాస్ వికాస్, హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన మొగిలిచెర్ల వెంకటరాజు అలియాస్ పున్నంచంద్, ఆయన భార్య తోడెం గంగ. కంటి చూపు మందగించడంతో పాటు పార్టీలో వివిధ విభాగాల్లో వచ్చిన సిద్ధాంతపరమైన విభేదాలతో పున్నంచంద్ భార్యతో కలిసి లొంగిపోవడానికి వచ్చారని.. ఈ ముగ్గురికీ ఒకొక్కరికి రూ.20 లక్షల చొప్పున రివార్డును అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో తెలంగాణ కమిటీలకు సంబంధించి 72 మంది అడవుల్లో ఉన్నారని.. కేంద్ర కమిటీలోని 12 మందిలో 8 మంది తెలంగాణ వాసులేనని తెలిపారు. మావోయిస్టు పార్టీలో సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నట్లు లొంగిపోయిన వారు చెప్తున్న విషయాలను బట్టి స్పష్టమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ చీఫ్ విజయకుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి, అదనపు డీజీ స్వాతి లక్రా తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడు బయటపడ్డా..

లొంగుబాట్లు, ఆయుధాలను వదిలి వేయడానికి సంబంధించి మావోయిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలున్న విషయం సోనూ లేఖ ద్వారా బయటపడినప్పటికీ.. వాటిపై పార్టీలో చాలాకాలంగా సుదీర్ఘ చర్చ జరుగుతోందని లొంగిపోయిన మావోయిస్టు వికాస్ పేర్కొన్నారు. రాజకీయంగా, సామాజికంగా వస్తున్న మార్పులపై పార్టీలో ఎంతోకాలంగా అంతర్మథనం జరుగుతోందని, ఆయుధాలను వదిలి వేసే విషయం కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదని తెలిపారు. పార్టీలో పాత పరిస్థితులు, ఉద్యమ వాతావరణం ఇప్పుడు లేవని, పాత విధానాలు ఇప్పుడు పనిచేయవనే విషయమై తీవ్ర చర్చ పార్టీలో జరిగిందని చెప్పారు.

ఉప ఎన్నికలో గెలుపే మోదీకి బహుమతి

- జూబ్లీహిల్స్‌లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందాం
- నేతలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పిలుపు
- రెండు, మూడు రోజుల్లో అభ్యర్థిని ప్రకటిస్తామని వెల్లడి
- బీసీ రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ అసలు రంగు బయటపడింది: లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు, చిత్రంలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. నగరవాసులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ఆ రెండు పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. జూబ్లీహిల్స్ అభివృద్ధిపై మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థిని గెలిపించుకొని.. ప్రధాని మోదీకి బహుమతిగా ఇద్దామని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య చీకటి ఒప్పందాలున్నాయని, వాటిని ఎండగట్టాలని, సమష్టి కృషితో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ప్రకటిస్తామని చెప్పారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు అధ్యక్షతన.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి భాగ్యనగరంలోని 8 జిల్లాల ప్రధాన నాయకులతో సమావేశం జరిగింది. ఇందులో పార్టీ బలోపేతం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై రాంచందర్‌రావు దిశానిర్దేశం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్ల అమలు బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని.. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌ను వరల్డ్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పి గత బీఆర్ఎస్ సర్కారు విషాదనగరంగా మార్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నగర అభివృద్ధిని పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రధాన మార్గాలు, డ్రైనేజీ వ్యవస్థలు, రోడ్ల నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మ్యాన్‌హోల్‌లో పడి పిల్లలు మృతిచెందిన ఘటనలను చూశామని.. రామంతాపూర్‌లో విద్యుత్తు షాక్‌తో ఆరుగురు మృతి చెందారని ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే జరిగాయన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఆర్టీసీ కార్మికుల్లో కొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారని.. కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూనే మరోవైపు బస్సు చార్జీలు పెంచిందని విమర్శించారు. బస్ చార్జీలు పెంచి సామాన్యులు, పేదలపై భారం మోపడం ఎంతవరకు న్యాయం? అని ప్రశ్నించారు. ఇటీవల నగరంలో ముస్లిం ఖబ్రస్థాన్ ఏర్పాటుకు రక్షణ శాఖ భూములను కట్టబెట్టే ప్రయత్నాలు జరిగాయని.. ఇది దారుణం అని అన్నారు. కాగా.. రాంచందర్‌రావు, శనివారం ఢిల్లీ వెళ్లనున్నారు. పార్టీ రాష్ట్ర కమిటీలో మరికొంత మందికి అవకాశం కల్పించే అంశంపై ఆయన, జాతీయ నాయకత్వం అనుమతి కోరనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, జుబ్లీహిల్స్ అభ్యర్థికి సంబంధించి ముగ్గురి పేర్లతో రాష్ట్రపార్టీ, జాతీయ నాయకత్వానికి జాబితాను నివేదించింది. లంకల దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, డాక్టర్ పద్మ వీరపనేనిల పేర్లు ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం. పార్టీ అభ్యర్థిని ఆదివారం ప్రకటించనున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి.

రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఏది?

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసలు రంగు బయటపడిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ రిజర్వేషన్ల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మరోసారి రుజువైందన్నారు. రిజర్వేషన్ల అంశం న్యాయసమీక్షకు వెళుతుందని తెలిసినా.. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించారని, దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిది, సీఎం రేవంత్ రెడ్డిదేనని పేర్కొన్నారు. శుక్రవారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ మాటిచ్చిందని.. ఎందుకు అమలు చేయలేకపోతున్నారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెడతామని హామీ ఇచ్చారని.. ఆ మేరకు జిల్లా పేరును ఎందుకు మార్చడం లేదని ఆయన ప్రశ్నించారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాతృమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే భూపతిరెడ్డికి సీఎం పరామర్శ..

నిజామాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. భూపతిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ ఇటీవల కన్నుమూయగా.. నగర శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం భూపతిరెడ్డి కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు. ఆయన వెంట టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, సీఎం సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

సమ్మేటివ్ అసెస్మెంట్

పరీక్షల షెడ్యూల్ విడుదల

- ఒకటి నుంచి పదో తరగతి వరకు..

ఈ నెల 24 నుంచి 31 దాకా పరీక్షలు

హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు మొదటి సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎస్‌ఏ) పరీక్షల టైమ్ టేబుల్‌ను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షలు ఈ నెల 24 నుంచి 31 తేదీ వరకు జరగనున్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6, 8వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9:15 గంటల నుంచి 12 వరకు, 7వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1:15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1:15 గంటల నుంచి సాయంత్రం 4:15 వరకు, 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పేర్కొంది. 1 నుంచి 5వ తరగతి వరకు 27న మొదటి భాష (తెలుగు లేదా ఉర్దూ), 28న ఆంగ్లం, 29న గణితం, 30న ఈవీఎస్, 31న ద్వితీయ భాష తెలుగు (మొదటి భాషగా తెలుగు రాయని విద్యార్థులకు) పరీక్షలు నిర్వహించనున్నారు. 6, 7 తరగతుల విద్యార్థులకు 24న మొదటి భాష (తెలుగు లేదా ఉర్దూ), 25న ద్వితీయ భాష (హిందీ లేదా తెలుగు), 27న ఆంగ్లం, 28న సోషల్, 29న గణితం, 30న జనరల్ సైన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 24న గణితం, 25న భౌతిక శాస్త్రం, 27న జీవ శాస్త్రం, 28న సోషల్ స్టడీస్, 29న మొదటి భాష (తెలుగు లేదా ఉర్దూ), 30న ద్వితీయ భాష (హిందీ లేదా తెలుగు), 31న ఆంగ్లం పరీక్షలు నిర్వహిస్తారు. నవంబరు 3న ఫలితాలు ప్రకటించి, 15న పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహిస్తారు. అన్ని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారులు ఈ షెడ్యూల్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీ చేసింది.

ఇంజనీరింగ్ కాలేజీలో భారీ చోరీ

- బీరువా బద్దలు కొట్టి రూ.1.7 కోట్ల నగదు అపహరణ
- సీసీ ఫుటేజీ తాలూకు హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లిన దొంగలు
- బ్రిలియంట్ ఇంజనీరింగ్ కాలేజీలో ఘటన

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలోని బీరువా తాళాలు పగులకొట్టి అందులో ఉన్న రూ.1.7 కోట్లను దొంగలు ఎత్తుకెళ్లారు. ఘటనాస్థలిలో రెండు స్క్రూడ్రైవర్లు కనిపించాయి. వాటితోనే బీరువా తాళాలు పగులగొట్టి ఉంటారని భావిస్తున్నారు. తెలివిగా వ్యవహరించిన దొంగలు.. సీసీ ఫుటేజీ దొరక్కుండా ఉండేందుకు హార్డ్‌డిస్క్‌లను కూడా తమ వెంట పట్టుకెళ్లిపోయారు. గురువారం సాయంత్రం కాలేజీకి తాళాలు వేసి.. శుక్రవారం ఉదయం వచ్చిన సిబ్బంది బీరువా తాళాలు తెరిచి ఉండటాన్ని చూసి కళాశాల యాజమాన్యానికి సమాచారమిచ్చారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులొచ్చి వివరాలు సేకరించారు. ఫీజులను ఎప్పటికప్పుడు బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేస్తూ వస్తున్నా.. ఈ పనిని పర్యవేక్షిస్తున్న యాజమాన్యంలోని కీలక వ్యక్తి కొన్నాళ్లుగా జ్వరంతో బాధపడుతుంటంతో ఫీజు రూపంలో వచ్చిన డబ్బునంతా కాలేజీలోని బీరువాలోనే దాస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ సంగతి గుర్తెరిగిన వ్యక్తులే ఈ చోరీకి పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలేజీ చైర్మన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం కళాశాలను సందర్శించి వివరాలు తెలుసుకుని పోలీసులతో మాట్లాడి వెళ్లారు. కళాశాల ప్రిన్సిపల్ వీరన్న ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదైంది. కాగా గురువారం అర్ధరాత్రి కళాశాలలోకి ఇద్దరు యువకులు ప్రవేశించినట్లు సమీపంలోని ఓ సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

జోర్డాన్‌లో చిక్కుకున్న వలస కార్మికులను

వెంటనే స్వదేశానికి తీసుకురావాలి

సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్ చొరవ తీసుకోవాలి: హరీశ్

సిద్దిపేట/హైదరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జోర్డాన్‌లో చిక్కుకున్న తెలంగాణలోని పలు జిల్లాలకు చెందిన 12 మంది వలస కార్మికులను వెంటనే స్వదేశానికి తీసుకురావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉపాధి కోసం వెళ్లి వివిధ దేశాల్లో చిక్కుకున్న వలస కార్మికుల ఆవేదనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేట జిల్లాలకు చెందిన కార్మికులు దేశం కాని దేశంలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని తెలిపారు. అక్కడే ఉండి బతికేందుకు చేతిలో డబ్బు లేక, కంపెనీ అనుమతి ఇవ్వకపోవడంతో తిరిగి స్వదేశానికి రాలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో వలసలు వాపస్ అయితే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో వలసలు తిరిగి మొదలయ్యాయన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల సంక్షేమం అంటూ అనేక హామీలు ఇచ్చింది తప్ప, ఇప్పటి వరకు ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఏడాదిన్నర పాలన తర్వాత గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన అడ్వైజరీ కమిటీ ఏం చేస్తున్నదని ప్రశ్నించారు? సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవ చూపి జోర్డాన్‌లో ఉన్న కార్మికులను వెంటనే తెలంగాణకు రప్పించేందుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.